అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

బుధవారం 02-01-2019

సమగ్ర తెలుగు దినపత్రిక



సంపుటి : 5 సంచిక : 5 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు వెల : 6.50



పంచాయతీలకు నగారా

నోటిఫికేషన్ జారీ

- మూడు దఫాలుగా ఎన్నికలు
- 21, 25, 30 తేదీల్లో పోలింగ్ .. అదే రోజు ఫలితాలు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎట్టకేలకు పంచాయతీ ఎన్నికలకు ముహూర్తం ఖరారైంది. దీనికి సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ నాగిరెడ్డి మంగళవారం సాయంత్రం హైదరాబాద్‌లోని ఎన్నికల సంఘం కార్యాలయంలో గ్రామ పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. రాష్ట్రంలోని 12,732 పంచాయతీలకు మూడు విడతలుగా ఎన్నికలు నిర్వహిస్తున్నామని, 19 పంచాయతీల్లో ఎన్నికలు జరపడం లేదన్నారు. మరో 15 గ్రామ పంచాయతీల కాలపరిమితి ముగియనందున వాటికి తర్వా ఎన్నికలు చేపడతామన్నారు. ఈ నెల 21,25,30వ తేదీల్లో పోలింగ్ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, అదే రోజు ఫలితాలు వెల్లడిస్తామని తెలిపారు. మూడు విడతలుగా నిర్వహించే ఎన్నికలకు మూడు దఫాలుగా నామినేషన్ల స్వీకరిస్తామని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ఈ నెల విడత ఈ నెల 11న ప్రారంభమై 25తో, మూడో విడత 16న ప్రారంభమై 30న ముగుస్తుందని వివరించారు. రాష్ట్రంలోని 12,732 గ్రామ పంచాయతీలు.. 1,13,170 వార్డుల్లో ఎన్నికలు నిర్వహిస్తున్నందున ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుని తమకు నచ్చిన ప్రజాప్రతినిధులను ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్నికల నిర్వహణ కోసం 1,13,190 పోలింగ్ కేంద్రాలు ...9లో

మార్చికల్లా మేడిగడ్డ పూర్తికావాలి

అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశం

- ప్రాజెక్టు పనుల పరిశీలన



వివరాలు 9లో

తెలంగాణ హైకోర్టు షురూ

తొలి సీజేగా రాధాకృష్ణన్ ప్రమాణం

- తొమ్మిది మంది న్యాయమూర్తులు కూడా
- కొత్త చరిత్రకు శ్రీకారం



వివరాలు 9లో

అంబేద్కర్ విగ్రహం ధ్వంసం

నూతన సంవత్సర వేడుకల్లో ఘటన



- ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలంలో...

వివరాలు 9లో



వెల్లువెత్తిన స్త్రీ శక్తి

కేరళలో620 కిమీల పొడవున 'వనితా మాథిల్'

- శబరిమలపై సుప్రీంకోర్టు తీర్పునకు మద్దతుగా...



వివరాలు 2లో





మాట్లాడుతున్న బృందాకరత్



కేరళలో మహా మానవహారం









వెల్లువెత్తిన స్త్రీశక్తి



కేరళలో 620 కిమీల పొడవున 'వనితా మాథిల్'

- శబరిమలపై సుప్రీంకోర్టు తీర్పునకు మద్దతుగా 30 లక్షల మందితో మహిళా మానవహారం

తిరువనంతపురం : కొత్త సంవత్సరం తొలిరోజున కేరళలో 30 లక్షల మంది మహిళలు తమ సమానత్వ హక్కులను కాపాడుకొనేందుకు కదలివచ్చారు. రాష్ట్ర రాజధాని నుంచి ఉత్తర జిల్లా కాసరగఢ్ వరకూ 620 కిలోమీటర్ల పొడవునా మహిళా హారాన్ని నిర్మించారు. 14 జిల్లాలోని జాతీయ రహదారులు వెంబడి ఈ 'వనితా మాథిల్' ఏర్పాటు చేశారు. ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా మహిళలు ఈ మానవహారంలో భాగస్వాములయ్యారు. బలవంతపు సంప్రదాయాల నుంచి రాష్ట్రాన్ని కాపాడతామంటూ మానవహారంలో పాల్గొన్న అందరూ ప్రతిజ్ఞ చేశారు. ముఖ్యమంత్రి పినరయి విజయన్ మంగళవారం మధ్యాహ్నం ప్రారంభించగా, సుమారు అర గంటపాటు సాగింది. కులమతాలకు అతీతంగా జరిగిన ఈ కార్యక్రమంలో మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు. అలాగే మహిళా కుడ్యానికి సంఘీభావంగా దాని వెనక పురుషుల మానవహారం నిర్మించారు. ఇందులో ప్రముఖ పురుష రచయితలు, కళాకారులు పాల్గొన్నారు. ఈ మహిళా కుడ్యం ఏర్పాటుతో రహదారులన్నీ సందడిగా మారాయి. మహిళలు తమ నినాదాలతో ప్రాంతాలను హోరెత్తించారు. లింగ వివక్ష అంతం కావాలని పిలుపునిచ్చారు.

ప్రముఖ సినీనటులు, ఇతర రంగాలకు చెందిన ప్రముఖులు కూడా ఇందులో పాల్గొన్నారు. తిరునంతపురంలో ఈ కార్యక్రమం సందర్భంగా స్వామి అగ్నివేష్ మహిళలకు మద్దతు పలికారు. ఈ హారం ముగింపు ప్రాంతం వెల్లయంబళమ్ వద్ద చివరి వ్యక్తిగా రాష్ట్ర ఆరోగ్య మంత్రి కెకె శైలజా నిలిచారు. తిరువనంతపురంలో మానవహారం చివరన సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందా కారత్ నిలబడ్డారు. ఈ కార్యక్రమం కోసం కొన్ని పాఠశాలలకు మధ్యాహ్నం నుంచి సెలవును ఇచ్చారు. కళాశాలల్లో జరగాల్సిన పరీక్షలనూ వాయిదా వేశారు. దీంతో బాలికలు కూడా పెద్దఎత్తున మానవహారంలో పాల్గొనేలా అవకాశం కలిగింది.

చారిత్రక దినం : బృందాకరత్

లక్షలాది మందితో మహిళాకుడ్యాన్ని నిర్మించడం ఒక చారిత్రాత్మక దినమని అని సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బృందాకరత్ పేర్కొన్నారు. మహిళాకుడ్యం సందర్భంగా ఏర్పాటుచేసిన ఒక బహిరంగ సమావేశంలో బృందాకరత్ ప్రసంగించారు. కొంతమంది రాష్ట్రాన్ని చీకటి శకంలోకి తీసుకెళ్లాలని ప్రయత్నిస్తున్నారు.. కానీ ఈ రాష్ట్ర మహిళలు దాన్ని అడ్డుకుని తీరుతారని ఆమె చెప్పారు.

ఇది రెఫరెండమ్ కాదు : కె.బాలకృష్ణన్

శబరిమలపై కోర్టు తీర్పుపై మహిళా కుడ్య కార్యక్రమం ఒక రెఫరెండమ్ కాదని సీపీఐ(ఎం) కేరళ రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణన్ వ్యాఖ్యానించారు. ప్రభుత్వ నిధులను ఈ కార్యక్రమం కోసం ఉపయోగించలేదని అన్నారు. లింగ సమానత్వానికి మద్దతు ఇచ్చేవారందరూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని చెప్పారు.

ఆర్ఎస్ఎస్ గుండాల దాడి



మహిళాకుడ్యం సందర్భంగా కాసరగఢ్ వద్ద సీపీఐ(ఎం) కార్యకర్తలపై ఆర్ఎస్ఎస్ గుండాలు దాడికి దిగారు. కార్యకర్తలను లక్ష్యంగా చేసుకొని రాళ్ళు రువ్వగా పలువురు సీపీఐ(ఎం) కార్యకర్తలకు గాయాలయ్యాయి. పోలీసులు స్పందించి ఆర్ఎస్ఎస్ గుండాలపై లాఠీచార్జీ చేసి ఘర్షణను నివారించారు.

కుంభమేళా, దేవాలయాలతో దేశం అభివృద్ధి చెందదు

బీజేపీ మాజీ నేత సావిత్రిభాయ్ పూలే

లక్నో: యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌పై బీజేపీ మాజీ నేత సావిత్రభాయ్ పూలే విమర్శల దాడి చేశారు. కుంభమేళా, దేవాలయాలతో దేశం అభివృద్ధి చెందదని ఆమె అన్నారు. రాజ్యాంగాన్ని అమలుపరచడం ద్వారానే దేశం ప్రగతి వైపు నడుస్తుందన్నారు. దేవాలయాలు, కుంభమేళకు యూపీ ప్రభుత్వం చేస్తున్న ఖర్చుపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఒక పక్క దళితులు, గిరిజనులు తమ హక్కులు, ఉద్యోగాల కోసం పోరాడుతున్నారు. మరోపక్క, యూపీ ప్రభుత్వం మాత్రం కుంభమేళ, దేవాలయాలంటూ కోట్లరూపాయలు ఖర్చు చేస్తున్నది. దళితులకు, గిరిజనులకు, ముస్లింలకు ఇవి తిండి పెడతాయా? ప్రజల దృష్టిని మరల్చేందుకే కుంభమేళాపై ప్రభుత్వం అధికంగా ఖర్చు చేస్తున్నది' అని పూలే ఆరోపించారు. దేశాన్ని పరిపాలించేది రాజ్యాంగమని.. గుడి, దేవుడు కావని అన్నారు. యూపీ శాంతి భద్రతల విషయంలో యోగి తీరుపై ఆమె విమర్శలు చేశారు. సీఎంగా యూపీని పరిపాలించే సామర్థ్యం యోగికి లేదని, ఆయన వైఫల్యాలపై వస్తున్న పలు నివేదికలే దీనికి నిదర్శనమని అన్నారు. యూపీలోని బహ్రైచ్ నుంచి 2014లో బీజేపీ నుంచి గెలుపొందిన సావిత్రి.. గతనెల 6న ఆ పార్టీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే.

ఆ వర్సిటీ వీసీ ఆర్ఎస్ఎస్ ప్రచారకుడే..

యూపీ డిప్యూటీ సీఎంకు అత్యంత సన్నిహితుడు

లక్నో : 'మీ జోలికి ఎవరైనా వస్తే దాడి చేయండి.. వీలైతే చంపేయండి. ఏం జరిగినా నేను చూసుకుంటా' అంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన పూర్వాంచల్ వర్సిటీ వీసీ రాజారాం యాదవ్ ఆర్ఎస్ఎస్ ప్రచారకుడు అని తేలింది. ఓ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులనుద్దేశించి రాజారాం ఇటీవల చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపిన సంగతి తెలిసిందే. విద్యాబుద్ధులు నేర్పి, విద్యార్థులను సన్మార్గంలో నడిపించాల్సిన వ్యక్తి.. ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడమేంటని అన్ని వర్గాలూ ప్రశ్నించాయి. రాజారాం ఆర్ఎస్ఎస్ ప్రచారకుడే కాక ఉత్తరప్రదేశ్ డిప్యూటీ సీఎం కేశవ్‌ప్రసాద్ మౌర్యకు అత్యంత సన్నిహితుడు కావడం గమనార్హం. ఇందుకు సంబంధించి 2017 మార్చి 23 నాటి ఫేస్‌బుక్ పోస్టు తాజాగా వెలుగులోకొచ్చింది. 1990 నుంచి తాను ఆర్ఎస్ఎస్‌లో కొనసాగుతున్నానని, కేశవ్ ప్రసాద్ మౌర్యకు దగ్గరి వాడినని ఈ పోస్టులో రాజారాం చెప్పుకొచ్చారు. కేశవ్ ప్రసాద్ మౌర్య డిప్యూటీ సీఎం అయిన తర్వాత ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ రాజారాం మరో పోస్టు చేశారు.

'ఎస్ సర్' బదులు జై హింద్.. జై భారత్

పాఠశాలలకు గుజరాత్ ప్రభుత్వ ఆదేశాలు



అహ్మదాబాద్: ఇకపై గుజరాత్‌లోని పలు పాఠశాలల విద్యార్థులు తరగతి గదిలో టీచర్ అటెండెన్స్ తీసుకునే సమయంలో హాజరుని తెలియజేయడానికి 'ఎస్ సర్, ప్రజెంట్ సర్' అనడానికి వీలు లేదు. వీటికి బదులుగా 'జైహింద్', 'జైభారత్' లను వారు పలకాల్సి ఉంటుంది. గుజరాత్ విద్యాశాఖ మంత్రి భూపేంద్రసిన్హ్ చుడసమ తీసుకున్న నిర్ణయం మేరకు అధికారులు ఒక నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. ఈ నిర్ణయాన్ని జనవరి 1 నుంచి అమలు చేయాలని పేర్కొంటూ నోటిఫికేషన్ ప్రతులను రాష్ట్రంలోని వివిధ జిల్లాల విద్యాశాఖాధికారులకు పంపించారు. దీని ప్రకారం.. ఇకపై గుజరాత్‌లోని ఒకటి నుంచి పన్నెండో తరగతి వరకు చదివే విద్యార్థులందరూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తప్పక పాటించాల్సి ఉంటుంది. అయితే విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించడానికే ఈ నిర్ణయం అని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. విద్యార్థుల్లో దేశభక్తిని చిన్నతనం నుంచే పెంపొందించాలని ఓ ఉపాధ్యాయుడి ఇచ్చిన సలహా మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు భూపేంద్ర సిన్హా అన్నారు.

బ్రిట్టో మరణంపై ఏచూరి దిగ్భ్రాంతి

న్యూఢిల్లీ : విద్యార్థి దశ నుంచి తనకు సన్నిహిత మిత్రుడిగావున్న భారత విద్యార్థి సమాఖ్య నేత సైమన్ బ్రిట్టో మరణవార్త తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేఎస్‌యూ(ఐ)కి చెందిన గూండాల కిరాతక దాడిలో ఆయన గాయపడ్డారన్న ఆందోళన నుంచి తాను తేరుకోకముందే ఈ విషాద వార్త తనను కలచి వేసిందన్నారు. బ్రిట్టో మరణించినా ఆయన స్ఫూర్తి మాత్రం సజీవంగానే వుంటుందని ఏచూరి తన ప్రకటనలో పేర్కొన్నారు. గూండాల దాడిలో గాయపడి అశక్తుడైనప్పటికీ లక్ష్యసాధనలో బ్రిట్టో చూపిన ధైర్యం, కృతనిశ్చయం, అంకిత భావం వంటి లక్షణాలు ప్రస్తుత తరానికి ఆదర్శమని ఆయన నివాళులర్పించారు.

కాంగ్రెస్ 18.. జేడీ (ఎస్) 10

- కర్నాటకలో కుదిరిన సీట్ల పంపిణీ

బెంగళూరు : రానున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కర్నాటకలో సంకీర్ణ కూటమి మధ్య సీట్ల పంపిణీ ఖరారైంది. రెండు పార్టీల మధ్య 2:1 నిష్పత్తిలో సీట్ల పంపిణీకి అంగీకారం కుదిరినట్టు జేడీ(ఎస్) సీనియర్ నేత డానిష్ ఆలీ తెలిపారు. బీజేపీని అధికారం నుంచి దించేందుకు కర్ణాటకలో గత ఏడాది మే నెలలో రెండు పార్టీలు పొత్తు కుదుర్చుకున్నాయి. ఆ సమయంలో పార్టీల మధ్య పొత్తు కుదిర్చేందుకు డానిష్ ఆలీ మధ్యవర్తిగా వ్యవహరించారు.

భీమా కోరేగావ్ వార్షికోత్సవం ప్రశాంతం

వేలాదిగా తరలి వచ్చిన దళితులు

- అర్బన్ నక్సల్స్ పేరిట పౌర హక్కుల నేతల అరెస్టు : ప్రకాశ్ అంబేద్కర్



ముంబయి: చారిత్రాత్మక భీమా కోరేగావ్ 201 వార్షికోత్సవం ప్రశాంతంగా ముగిసింది. మహారాష్ట్రలోని పూణెకు సమీపంలో గల భీమా కోరేగావ్‌లో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా వేలాదిగా దళితులు తరలివచ్చి స్మారక స్థూపాని (విజయ్ స్థంభ్)కి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. రెండు రోజుల క్రితమే ఈ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్న పోలీసులు.. సందర్శకులను అడుగడుగునా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమానికి అంబేద్కర్ మనవడు, భరిప బహుజన్ మహాసంఘ్ (బీబీఎం) నాయకుడు ప్రకాశ్ అంబేద్కర్ మంగళవారం ఉదయం నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 'ప్రజలు శాంతి కోరుకుంటున్నారు. ఈ వార్షికోత్సవాన్ని వారు శాంతి, ఆత్మగౌరవంతో జరుపుకోవాలని చూస్తుంటే సర్కారు మాత్రం అడుగడుగునా నిర్బంధ ఆంక్షలు విధించింది. వార్షికోత్సవానికి రెండు రోజుల ముందు అనుమానితుల పేరిట పలువురు దళితులను అరెస్టు చేసింది. అంతేగాక, అర్బన్ నక్సల్స్ పేరిట పౌర హక్కుల కోసం పోరాడుతున్న వారిని అరెస్టులు చేస్తూ ప్రజా వ్యతిరేక చట్టాలను అవలంబిస్తోంది' అని అన్నారు. గతేడాది జనవరి 1న భీమా కోరేగావ్‌లో అల్లర్లు చెలరేగి ఆ ప్రాంతమంతా రణరంగాన్ని తలపించింది. ఈ ఘటనలో ఒకరు చనిపోగా వందలాది మంది దళితులు గాయపడ్డారు. దీంతో, అప్రమత్తమైన మహారాష్ట్ర ప్రభుత్వం ఈసారి శాంతి భద్రతలకు భంగం వాటిల్లకుండా అక్కడ కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టింది. దాదాపు 20 వేల మంది పోలీసులు, 500 సీసీటీవీ కెమెరాలు, 12 డ్రోన్లతో అధికారులు ఈ ప్రాంతాన్ని పర్యవేక్షించారు. భీమా కోరేగావ్ సమీప ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలనూ తాత్కాలికంగా రద్దు చేశారు.

నిరసనలకు భయపడి...

నలుపు రంగు దుస్తువులు, వస్తువులపై నిషేధం

- ఈ నెల 5న జార్ఖండ్‌లో మోడీ సభ



రాంచీ: ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు అందరికీ ఉంది. కానీ, కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హక్కును కూడా కాలరాస్తోంది. ప్రధాని మోడీతో సహా బీజేపీ పాలిత ముఖ్యమంత్రులు పాల్గొంటున్న సభలలో నిరసనకారులు ఏదో ఒక రూపంలో తమ నిరసనను ప్రభుత్వానికి వెల్లడించే ప్రయత్నం చేస్తూ ఉంటే.. బీజేపీ ప్రభుత్వాలు మాత్రం వారిని కట్టడి చేసే విధంగా వ్యవహరించిన ఘటనలు కోకొల్లలు. కాగా, జార్ఖండ్‌లో ఈనెల 5న పలాములో జరగబోయే మోడీ సభకు హాజరయ్యేవారు నలుపు రంగు దుస్తువులు, బ్యాగులు ధరించి రావొద్దని రాష్ట్ర సర్కారు తెలిపింది. నలుపు రంగు ఉన్న ప్రతీ వస్తువుపైనా ముఖ్యమంత్రి రఘుబర్ దాస్ నేతృత్వంలోని బీజేపీ సర్కారు నిషేధం విధించింది. ఈ మేరకు పలమూ ఎస్పీ ఇంద్రజిత్ మెహతా.. లతేహర్, గర్హ్వా, ఛత్ర డిప్యూటీ కమిషనర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఈ ప్రాంతంలో ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉపాధ్యాయులు తమను రెగ్యులరైజ్ చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులతో పాటు తమకూ సమాన వేతనాలు చెల్లించాలని కోరుతూ కొన్ని రోజులుగా డిమాండ్ చేస్తున్నారు. ఇందులో భాగంగానే గత నెలలో రాంచీలో సీఎం పాల్గొన్న ఓ సభలో తమ నిరసనను తెలిపారు. ఈ నేపథ్యంలో వారందరూ మోడీ సభలో పాల్గొని తమ సమస్యలను ప్రధానికి విన్నవించాలని చూసినా సర్కారు మాత్రం ఒప్పుకోలేదు. సభకు హాజరయ్యేవారందరూ తప్పనిసరిగా తమ గుర్తింపుకార్డులు తీసుకురావాలని పోలీసులు ఆదేశాలు జారీ చేశారు. మొదలు నలుపు రంగు బూట్లు, సాక్సులు కూడా ధరించకుండా ఆదేశాలు జారీ చేసినా ఈ నిర్ణయం పట్ల నిరసనకారుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురవ్వడంతో పోలీసులు దీనిపై వెనక్కితగ్గారు.

'నెట్' ఉంటేనే ఫెలోషిప్

దళిత స్కాలర్లకు కేంద్రం మెలిక

న్యూఢిల్లీ : మోడీ సర్కారు పాలనలో దళితులు, మైనార్టీలు అన్ని రంగాల్లోనూ వివక్షకు గురవుతున్నారు. దళిత విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యేలా కేంద్రం తీసుకొచ్చిన కొత్త నిబంధన తీవ్ర వివాదాస్పదమవుతున్నది. దళిత స్కాలర్లు ప్రత్యేక ఫెలోషిప్ పొందాలంటే జాతీయ అర్హత పరీక్ష(నెట్)లో ఉత్తీర్ణత సాధించాల్సిందేనని నిర్ణయం తీసుకున్నది. దీంతో వేలాది మంది దళిత విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం కావాల్సిన దుస్థితి తలెత్తింది. దేశంలో దళితులు, మైనార్టీలు నేటికీ వివక్షకు గురవుతూనే ఉన్నారు. పేదరికంలో మగ్గుతున్న దళిత విద్యార్థినీ విద్యార్థులు పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేయడమే కష్టతరంగా మారుతున్న తరుణంలో నెట్ ఉండాలన్న షరతు వారిని తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నది. నెట్, జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్(జేఆర్ఎఫ్) కోసం చాలా మంది దళిత విద్యార్థులకు కోచింగ్ తీసుకునే స్థోమత లేదు. ఈ క్రమంలోనే వారు జేఆర్ఎఫ్‌కు దూరమవుతున్నారు. జేఆర్ఎఫ్‌కు దూరమైన వీరు ఇంతకుముందు రాజీవ్‌గాంధీ నేషనల్ ఫెలోషిప్ పొందడం ద్వారా స్పెషల్ కోర్సులో రీసెర్చ్ చేసేవారు. ఇందుకు నెట్ ఉండాల్సిన అవసరం లేదు. పీజీ ఉత్తీర్ణత ఆధారంగా రీసెర్చ్ ప్రతిపాదన చేసుకున్న దళిత విద్యార్థులకు ఈ ఫెలోషిప్ మంజూరయ్యేది.

మోడీ ప్రభుత్వం ఈ పథకాన్ని 'నేషనల్ ఫెలోషిప్ ఫర్ ఎస్సీ స్టూడెంట్స్'గా మార్చడంతో పాటు నెట్ అర్హతను తప్పనిసరి చేసింది. ఈ ప్రభావం ప్రతియేటా దాదాపు 1000 మంది దళిత స్కాలర్లపై పడే అవకాశం ఉన్నది. మైనార్టీల విషయంలో కూడా కేంద్రం తీసుకొచ్చిన ఈ నిబంధనపై అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యావ్యవస్థలో ఉన్న మౌలిక హక్కులను కేంద్రం కాలరాస్తున్నదని స్వాతి అనే పోస్టు గ్రాడ్యుయేట్ స్కాలర్ విమర్శించారు. తమది పేదరిక కుటుంబమే కాక, ఒక మహిళగా దేశ రాజధానిలోని ఢిల్లీ యూనివర్సిటీలో పీజీ విద్యనభ్యసించడం అంత సులువైన విషయం కాదని తెలిపారు. పైగా ఇప్పుడు ఫెలోషిప్ పొందాలంటే నెట్ ఉండాలంటూ షరతు విధించడం అన్యాయమని తెలిపారు. దళితులు, మైనార్టీ స్కాలర్లు ఉన్నత విద్య ఫలాలను పొందాలని ఎందుకు కోరుకోవడం లేదంటూ మోడీ సర్కారును ఆమె నిలదీశారు.

మరో 'నిర్భయ'

ఆటోలో సామూహిక లైంగికదాడి

- రోడ్డుపై పడేసివెళ్ళిన కామాంధులు
- నూతన సంవత్సర వేడుకరోజు వెలుగులోకి



న్యూఢిల్లీ : ఢిల్లీలో వైద్యవిద్యార్థినిపై 2012లో జరిగిన భయానక లైంగికదాడి ఘటనను గుర్తుచేసేలా.. మరో నిర్భయ ఘటన వెలుగులోకి వచ్చింది. కదులుతున్న ఆటోలో మహిళ (42)పై సామూహిక లైంగికదాడికి పాల్పడ్డారు. గురుగ్రామ్‌లోని భంగ్‌రోలా గ్రామం నుంచి ఆమెను అపహరించుకొని ఆటోలో తీసుకెళ్ళిన కామాంధులు జాతీయ రహదారి-8పై ఆటోను తిప్పుతూ లైంగికదాడికి పాల్పడ్డారు. ఘటన వివరాల్లోకి వెళితే.. తన భర్త 2013లో మరణించడంతో ఆయన పనిచేసిన కంపెనీ నుంచి ఆర్థిక లావాదేవీలు పరిష్కరించుకునేందుకు బాధితురాలు శనివారం గురుగ్రామ్‌కు వెళ్ళింది.

కాగా, అక్కడి నుంచి తిరిగివస్తుండగా ఆమెపై ఈ దారుణం జరిగింది. ఐఎంటీ మానేసర్ వెళ్లేందుకు మధ్యాహ్నం 2.30 గంటల ప్రాంతంలో జాతీయరహదారి-8 నక్రోలా చౌక్‌లో ఆమె ఆటో ఎక్కింది. ఆమెను గమ్యస్థానం చేర్చకుండా బంగ్‌రోలాకు తీసుకెళ్ళి అక్కడ ఒక గదిలో ఆమెను ఆటో డ్రైవర్ అంకిత్ బంధించాడు. అక్కడ అంకిత్, అతని ముగ్గురు స్నేహితులు ఆమెపై దారుణానికి ఒడిగట్టారు. రాత్రి వరకూ ఆమెను అక్కడి బంధించి వుంచి, మరో ఇద్దరు ఆటో డ్రైవర్లకు ఆమెను అప్పగించారు. వారిద్దరూ ఆమెను ఆటోలో ఎక్కించుకొని జాతీయరహదారిపై తిప్పుతూ దారుణానికి ఒడిగట్టారు. అర్ధరాత్రి దాటిన తర్వాత ఆమెను రామ్‌పుర ఫ్లైఓవర్ సమీపంలోని ఓ ఫుడ్ స్టాల్ వద్ద పడేసి వెళ్ళిపోయారు. బాధితురాలి ఫిర్యాదుమేరకు నిందితులు అంకిత్, దీపక్, మహిపాల్, అజిత్, సున్నులను పోలీసులు అరెస్టుచేశారు. మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు.

పోలవరంపై ఆఖరి పోరాటం

పట్టు బిగిస్తున్న తెలంగాణ, ఒడిషా

ముంపుపై అధ్యయనానికి డిమాండ్

- సుప్రీంలో గట్టిగా వాదించాలని నిర్ణయం
- కేంద్రం ప్రేక్షక పాత్ర



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

పోలవరం ప్రాజెక్టుపై తెలంగాణ, ఒడిషా రాష్ట్రాలు పట్టు బిగిస్తున్నాయి. సుప్రీం కోర్టు వేదికగా న్యాయపోరాటానికి పావులు కదుపుతున్నాయి. 36 లక్షల క్యూసెక్కుల నీటి ప్రవాహానికి బదులుగా 49 లక్షల క్యూసెక్కుల ప్రవాహం కోసం ప్రాజెక్టులో చేసిన మార్పులను రెండు రాష్ట్రాలు ప్రశ్నిస్తున్నాయి. తాజా మార్పుల వల్ల తెలంగాణ ఒడిషా రాష్ట్రాల్లో ముంపు తీవ్రత అధికంగా ఉంటుందని భావిస్తున్న ఈ రెండు రాష్ట్రాలు మళ్లీ సర్వే కోసం డిమాండ్ చేస్తున్నాయి. పోలవరం ప్రాజెక్టుకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టులో దాఖలైన పిటిషన్లపై వాదనలు వినిపించటానికి సీనియర్ న్యాయవాదులను నియమించుకున్న తెలంగాణ, ఒడిషా ముంపునకు సంబంధించిన తాజా అంచనాలతో కూడిన నివేదికలను తయారు చేశాయి. 36 లక్షల క్యూసెక్కుల ప్రవాహాన్ని దృష్టిలో పెట్టుకుని గతంలో ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్ రీసెర్చ్ లేబరెటరీ చేసిన నమూనా అధ్యయన నివేదికతో పాటూ 1986, 2006 సంవత్సరాల్లో గోదావరికి వచ్చిన వరదల వల్ల ముంపునకు గురైన ప్రాంత వివరాలను ఉపగ్రహ ఛాయాచిత్రాల ద్వారా సేకరించిన తెలంగాణ నీటిపారుదల శాఖలోని అంతరాష్ట్ర విభాగం వీటి ఆధారంగా సుప్రీం కోర్టులో వాదనలు వినిపించాలని నిర్ణయించాయి. డిజైన్‌లో చేసిన మార్పుల వల్ల పోలవరం ప్రాజెక్టు పనులు నిలిపివేయాలని తాజా మార్పులకు సంబంధించిన వివరాలను కేంద్ర పర్యావరణ సాధికార సంస్థకు అందించాలని 2011 లో కేంద్ర పర్యావరణ అటవీ మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఆ తర్వాత రాజకీయ కారణాలతో ఈ ఉత్తర్వులపై తాత్కాలిక స్టే విధిస్తూ ప్రతియేటా తాజా ఉత్తర్వులు జారీ చేస్తున్నది. దీనిపై ఒడిషా అభ్యంతరం తెలిపింది. పోలవరం కేసులో ఇటీవల సుప్రీం కోర్టులో వాదనలు జరిగాయి. ముంపుపై తాజాగా అధ్యయనం చేయించటానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేయలేదు.

ప్రాజెక్టు నిర్మాణం తర్వాత 49 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహాలు ఉంటే తెలంగాణలోని భద్రాచలం పట్టణంతో పాటూ ఎగువ ప్రాంతంలోని 100 గిరిజన గ్రామాలు, మణుగూరు బొగ్గగనులు, అశ్వాపురంలోని హెవీ వాటర్ ప్లాంట్, దుమ్ముగూడెం ప్రాజెక్టు హెడ్ వర్క్స్ మునిగి పోతాయని తెలంగాణ ప్రభుత్వం భావిస్తున్నది. ముంపును నివారించటానికి కరకట్టలు కట్టటానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అంగీకరించినప్పటికీ ముంపుపై పూర్తి స్థాయిలో అధ్యయనం జరిగిన తర్వాతే తదుపరి చర్యలపై మాట్లాడతామని తెలంగాణ, ఒడిషా భావిస్తున్నాయి. ఇటీవల జరిగిన పోలవరం ప్రాజెక్టు అథారిటీ సమావేశంలో కూడా తెలంగాణ, ఒడిషా అభ్యంతరాలపై చర్చ జరిగింది. పూణేలోని కేంద్ర జల, పవర్ రీసెర్చ్ స్టేషన్‌తో పోలవరం ముంపుపై మోడల్ స్టడీస్ చేయించటానికి అధికారులు ఈ సమావేశంలో సుముఖత వ్యక్తం చేసినట్టు తెలిసింది.

ముఖ్యమంత్రుల సమావేశానికి చంద్రబాబు ప్రతిపాదన..

పోలవరం ప్రాజెక్టుపై అంతరాష్ట్ర వివాదాల్ని పరిష్కరించుకునే దిశగా ఏపీ సీఎం చంద్రబాబు ప్రయత్నాలు ప్రారంభించారు. ప్రాజెక్టు ముంపు, తదితర సమస్యలను ముఖ్యమంత్రుల స్థాయిలో పరిష్కరించుకోవాలని కేంద్రం సూచించిన నేపథ్యంలో ఒడిషా ముఖ్యమంత్రితో సమావేశం కావాలని చంద్రబాబు నిర్ణయించినట్టు తెలిసింది.



ఫైల్

రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఇటీవల ఒడిషా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌ను కలిసినప్పుడు కూడా పోలవరం ముంపు సమస్యపై ఇరువురి మధ్య చర్చ జరిగినట్టు తెలిసింది. కేసు విచారణ సందర్భంగా సుప్రీం కోర్టులో అనుసరించాల్సి వైఖరిపై కూడా కేసీఆర్ నవీన్ పట్నాయక్‌కు కొన్ని సూచనలు చేసినట్టు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. నవీన్ పట్నాయక్‌ను కేసీఆర్ కలిసిన రెండవ రోజునే ఒడిషా ఎంపీ సౌమ్య రాజన్ పట్నాయక్ అమరావతిలో చంద్రబాబును కలవటం ప్రాధాన్యత సంతరించుకున్నది. వీరిరువురి మధ్య కూడా పోలవరం ప్రాజెక్టు ప్రస్తావన వచ్చినట్టు అధికారులు తెలిపారు. తమ రాష్ట్ర ప్రయోజనాలు ముఖ్యమని భావిస్తున్న నవీన్ పట్నాయక్, కేసీఆర్ పోలవరం విషయంలో ఆచి తూచి అడుగులు వేస్తున్నారు.

గురువారం సుప్రీంలో విచారణ...



పోలవరం ప్రాజెక్టుకు వ్యతిరేకంగా దాఖలైన రిట్ పిటిషన్లపై గురువారం సుప్రీం కోర్టు విచారణ జరపనున్నది. ఈ కేసును గతంలో జస్టిస్ మదన్ లోకూర్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం విచారించింది. ఆయన ఇటీవల పదవీ విరమణ చేయటంతో జస్టిస్ ఏకే సిక్రి నేతృత్వంలోని ధర్మాసనానికి ఈ కేసును అప్పగించారు. ఒడిషా తరపున గోపాల సుబ్రహ్మణ్యం, తెలంగాణ తరపున వైద్యనాథన్, ఏపీ తరపున గంగూలీ, స్వచ్ఛంద సంస్థ తరపున జయంత్ భూషన్ వాదనలు వినిపించనున్నారు. తెలంగాణ రాష్ట్రం తరపున అంతరాష్ట్ర నదీ జలాల చీఫ్ ఇంజినీర్ నర్సింహారావు వైద్యనాథన్‌కు సమాచారం అందించారు.

రామాలయాన్ని, ఆదివాసీలను కాపాడండి: మోడీకి పొంగులేటి లేఖ



పోలవరం బ్యాక్ వాటర్ ప్రభా వంతో భద్రాచలం దేవాలయంతో పాటూ ఆదివాసీలకు భారీ నష్టం వాటి ల్లుతుందని ఎమ్మెల్సీ పొంగులేటి సుధా కరరెడ్డి సోమవారం ప్రధాన మంత్రికి రాసిన లేఖలో పేర్కొన్నారు. దక్షిణ ఆయోధ్యగా పేరుగాం చిన భద్రాచలం దేవాలయాన్ని, కోయ, కొండరెడ్డి ఆదివాసీలను ముంపు నుంచి కాపాడాలని ఆయన కోరారు. పోలవరం డిజైన్‌లో చేసిన మార్పుల వల్ల 371 గ్రామాలు మునిగపోతాయని, తెలంగాణలో కూడా ముంపు ప్రభావం అధికంగా ఉంటుందని ఆయన తన లేఖలో తెలిపారు. ముంపపై పూర్తి స్థాయిలో అధ్యయనం జరపాలని ఆయన కోరారు.

'జీఎంఆర్'వన్నీ ఉల్లంఘనలే

నిబంధనలకు విరుద్ధంగా పంతంగి టోల్‌గేట్

- చుట్టుపక్కల ప్రాంతాల్లో కనిపించని లైటింగ్ వ్యవస్థ
- స్థానికులకు ఉపాధి హామీ హుష్‌కాకి
- స్థానిక ప్రజల నుంచీ 'టోల్' వసూలు

పార్ట్ 3



అంతా చట్టప్రకారమే అని ముందుకెళ్లే మన అధికారులు, పోలీసులు...జీఎంఆర్ ఉల్లంఘనలను మాత్రం విస్మరిస్తున్నారు. నల్లగొండ జిల్లాలో వేయాల్సిన టోల్‌గేట్‌ను...యాదాద్రి భువనగిరి జిల్లాలో వేసినా...టోల్‌గేట్ చుట్టుపక్కల ప్రాంతాల్లో లైటింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయకపోయినా...క్రాస్‌రోడ్డుల వద్ద పదుల సంఖ్యలో చనిపోతున్నా...ఉపాధి కల్పన హామీని తుంగలో తొక్కినా...స్థానిక ప్రజల నుంచీ టోల్ వసూలు చేస్తున్నా...తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ఇదేం అన్యాయం అని ప్రశ్నించిన వారి నోర్లను నొక్కేస్తున్నారు. గట్టిగా నిలదీస్తే రైతులపైనా, స్థానికులపైనా తమ ప్రతాపాన్ని చూపుతున్నారు. అసలు పంతంగి టోల్‌గేట్ వద్ద జరుగుతున్న తతంగంపై నవతెలంగాణ కథనం.

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నేషనల్ హైవే అథారిటీ నిబంధనల ప్రకారం హైదరాబాద్-విజయవాడకు కలిపే జాతీయ రహదారి-65 విస్తరణ పనులను జీఎంఆర్ సంస్థ బీఓటీ(నిర్మించడం-నిర్వహించడం-బదిలీచేయడం)పద్ధతిలో చేపట్టింది. ఇందుకుగానూ టోల్‌గేట్లను పెట్టి వాహనదారుల నుంచి టోల్ చార్జీలను వసూలు చేసుకుని ఆదాయం రాబట్టుకోవడానికి ఒప్పందం కుదుర్చుకున్నది. అందులో భాగంగా ఒక టోల్‌గేట్‌ను గుండ్రాంపల్లి, వెలిమినేడు గ్రామాల మధ్య ఏర్పాటు చేయాలి. మొదట ప్రతిపాదించిన ప్రాంతంలో నల్లగొండ జిల్లాకు చెందిన ఓ ముఖ్య రాజకీయ నాయకునికి చెందిన భూములున్నట్టు, రాజకీయ ఒత్తిళ్లతోనే టోల్‌గేట్‌ను పంతంగి గ్రామానికి మార్చినట్టు ఆరోపణలున్నాయి. ఇక్కడకు మార్చడమే పెద్ద ఉల్లంఘన. ఆ తర్వాత రైతుల నుంచి బలవంతంగా భూములను లాక్కున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే 'ప్రజావసరాల కోసం' అన్న ముసుగు కప్పారు. టోల్‌గేట్ ఏర్పాటు తర్వాత బాధిత రైతుల కుటుంబాలకు, చుట్టుపక్కల గ్రామాల యువతకు ఉపాధి అవకాశాలను కల్పిస్తామని జీఎంఆర్ సంస్థ హామీనిచ్చింది. దానినీ బుట్టదాఖలు చేసింది. టోల్‌గేట్ వద్ద 40 నుంచి 50 మంది పనిచేస్తుం డగా...అందులో స్థానికుడు ఒక్కడే(ఎలక్ట్రీషియన్) ఉన్నాడు.

టోల్‌గేట్‌కు సమీపంలో ఆరెగూడెం, పంతంగి, రెడ్డిబాయి గ్రామాలకు వెళ్లే క్రాస్‌రోడ్లున్నాయి. ఆరు లైన్ల రోడ్లను దాటే సమయంలో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి సమయాల్లోనైతే వారి బాధలు వర్ణణాతీతం. ఇప్పటివరకూ ఆ మూడు గ్రామాల ఎక్స్‌రోడ్ల వద్ద జరిగిన ప్రమాదాల్లో 20 మంది వరకు చనిపోయారు. పదుల సంఖ్యలో అంగవైకల్యం పొందారు. దీనిపై ధర్నాలు, ఆందోళనలు కూడా జరిగాయి. ప్రజలకు సర్కారు నుంచి దక్కిన సహాయం శూన్యం.

చుట్టు పక్కల గ్రామాల వాళ్లు టోల్‌గేట్ మీదుగా రోజుకు ఒకటి, రెండు సార్లు వచ్చి వెళ్తుంటారు. టోల్‌గేట్ వేసే సందర్భంలో చుట్టుపక్కల గ్రామాల వారికి పాసులు ఇస్తామని జీఎంఆర్ సంస్థ హామీనిచ్చింది. ఇప్పుడేమో వారి వద్ద నుంచి ముక్కుపిండి మరీ టోల్‌ఫీజు వసూలు చేస్తున్నది. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తమ గుర్తింపు కార్డులు చూపించినా టోల్ కట్టనిదే పంపించట్లేదు. మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు మీటింగ్‌లకూ, అవసరాల రీత్యా అటుఇటూ తిరుగుతుంటారు. వారి వద్ద నుంచి కూడా టోల్ వసూలు చేస్తున్నారు. కొద్దిరోజుల కింద పని నిమిత్తం చౌటుప్పల్ ఎంపీడీఓ రెడ్డిబాయికి వెళ్లింది. ఆ సందర్భంలో ఆ అధికారి నుంచి బలవంతంగా టోల్ వసూలు చేశారు. ప్రభుత్వ అధికారిని అని చెప్పినా వినలేదు.

టోల్ పాస్‌లివ్వట్లేదు : దుర్గం రాజుయాదవ్, ఆరెగూడెం, చౌటుప్పల్ మండలం

'టోల్ వసూలు చేసే దగ్గర స్థానికులమని చెప్పినా వినిపించుకోవట్లేదు. నెల పాస్ అయినా ఇవ్వాలని పోతే...ఓ రోజు సిస్టమ్స్ పనిచేయట్లేదని, ఇంకోరోజు సిబ్బంది లేరని, మరోరోజు ఆధార్ జీరాక్స్ కావాలని తిప్పించుకుంటున్నారే తప్ప పాసు మాత్రం ఇవ్వట్లేదు. దీనిపైన చుట్టుపక్కల గ్రామాల ప్రజలంతా పలుమార్లు ధర్నాలు చేసినా జీఎమ్ఆర్ సంస్థ తనకేమీ పట్టనట్టు ఉంటున్నది.'

సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలి : చీరిక సంజీవరెడ్డి, మాజీ సర్పంచ్, పంతంగి

'టోల్‌గేటు ఇవతల ఉన్న ఆరెగూడెం, పంతంగి క్రాస్‌రోడ్ల వరకు, అవతల ఉన్న రెడ్డిబాయి క్రాస్ రోడ్డు వరకు సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలి. హైవేపై లైటింగ్ వ్యవస్థ సరిగా లేకపోవటం వల్ల పంతంగి క్రాస్‌రోడ్డు వద్దనే పదిమందికిపైగా చనిపోయారు. అయినా, జీఎంఆర్ సంస్థ పట్టించుకోకపోవడం దారుణం.'

సర్వీసు రోడ్లు దారుణం : గోశిక కర్ణాకర్, బీఎల్ఎఫ్ జిల్లా నాయకులు

'చౌటుప్పల్ దగ్గర, హైవేకు ఇరువైపులా ఉన్న గ్రామాల వద్ద సర్వీసు రోడ్లు దారుణంగా ఉన్నాయి. చౌటుప్పల్ బస్టాండు వద్దనైతే మట్టితో వేసి న సర్వీసు రోడ్డు గుంతలమయంగా మారింది. వర్షం పడితే ఆ ప్రాంతం లో నీళ్లు నిలిచి రాకపోకలకు ఇబ్బంది ఎదురవుతున్నది. సర్వీసు రోడ్లను మెరుగుపర్చాలి. టోల్‌గేట్ వద్ద రైతులను నుంచి బలవంతంగా భూము లను లాక్కోవటాన్ని జీఎంఆర్ సంస్థ ఆపేయాలి. దీనిపై పోరాడుతాం.'

కేసీఆర్ కూటమి గురించి తెలీదు: మోడీ



న్యూఢిల్లీ: తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక కూటమి (ఫెడరల్ ఫ్రంట్) ఏర్పాటు కోసం ప్రయత్నిస్తున్నారనే విషయం తన దృష్టికి రాలేదని ప్రధాని నరేంద్ర మోడీ వ్యాఖ్యానించారు. కేసీఆర్ కూటమి ఏర్పాటు గురించి ఇప్పటివరకు తాను ఆలోచించలేదన్నారు. జాతీయస్థాయిలో మహాకూటమి ఏర్పాటు కూడా తనను గద్దె దించడం కోసమే తప్ప దేశం కోసం కాదన్నారు. ప్రజలు, మహాకూటమి మధ్యే 2019 ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. మంగళవారం ఆయన ఏఎన్ఐ ఆంగ్ల న్యూస్ ఏజెన్సీకి ఇచ్చిన ముఖాముఖిలో మాట్లాడుతూ.. "త్రిపుర, కాశ్మీర్‌లోనూ మహాకూటమికి ఘోర పరాభవం ఎదురైంది. తెలంగాణలో మహాకూటమిని ప్రజలు చిత్తుగా ఓడించారు. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేదెవరో వచ్చే ఎన్నికలు చెబుతాయి. ఇప్పుడు బీజేపీకి వ్యతిరేకంగా మాట్లాడుతున్నవారంతా.. కాంగ్రెస్‌ను వ్యతిరేకించినవాళ్లే. ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరుతున్న వాళ్లను ఆ పార్టీ బలిపశువులను చేస్తోంది. దక్షిణభారత దేశంలో భాజపా లేదనడం అసత్య ప్రచారమని మోడీ అభివర్ణించారు.

మద్దతు ధర అమలుకు చర్యలు తీసుకోవాలి

మార్కెటింగ్ శాఖ డైరెక్టరుకు తెలంగాణ రైతు సంఘం విజ్ఞప్తి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధరలు అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర కార్యదర్శి టి. సాగర్, అఖిల భారత కిసాన్ సభ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి మంగళవారం మార్కెటింగ్ శాఖ డైరెక్టరు లక్ష్మీభాయికి వినతి పత్రం అందజేశారు. వరి ధాన్యం, పత్తి, కందులు, మొక్కజొన్న తదితర పంటలకు కేంద్రం ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలు అమలు కావడం లేదని వివరించారు.నాణ్యత లేదనే పేరుతో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కొనుగోలు చేయకుండా తిరస్కరించడంతో అన్ని పంటలకు ధరలు తగ్గించి దళారీలు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. దళారీలు కొనుగోలు చేసిన పత్తిని తిరిగి సీసీఐకి అమ్మి సొమ్ముచేసుకుంటున్నారని పేర్కొన్నారు.ఐకేపీ కేంద్రాలు కూడా కొనుగోలు చేసేందుకు నిరాకరిస్తున్నాయని తెలిపారు. రైతులు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉన్నదని కోరారు.

పంట	కనీస మద్దతు ధర (రూ)	కొనుగోలు ధర (రూ)	క్వింటాలుకు నష్టం
ధాన్యం	1770	1400-1500	370-270
పత్తి	5450	4500	950
కందులు	5675	4000	1675
మొక్కజొన్నలు	1700	1300	400

'టీసేవ' కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

- ఆన్‌లైన్‌లో సమర్పణకు గడువు 26

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

టీ సేవ కేంద్రాల ఏర్పాటుకు స్వయం ఉపాధి పొందేందుకు అర్హత గల అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని టీసేవ కేంద్రం డైరెక్టర్ వెంకటరెడ్డి అడపా మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. టీ సేవ ఆన్‌లైన్ ద్వారా వివిధ బిల్లుల చెల్లింపులు, బస్సు, రైళ్లు, విమానాల టికెట్ల బుకింగ్, పాన్ కార్డు దరఖాస్తు, సవరణ, వివిధ టెలికాం పోస్టు పెయిడ్, ప్రీ పెయిడ్ రీచార్జీలు, అన్ని బ్యాంకుల నగదు లావాదేవీలు, ఆధార్ ఆధారిత బిల్లుల చెల్లింపులు, వినియోగదారులకు మైక్రో ఏటీఎం సేవలు అందించడం, డేటా కార్డులు, ల్యాండ్‌లైన్ బిల్లుల చెల్లింపులు, డీటీహెచ్, ఇన్సూరెన్స్ బిల్లుల చెల్లింపులు వంటి ఆన్‌లైన్ సేవలను వినియోగదారులకు అందించడం ద్వారా అభ్యర్థులు స్వయం ఉపాధిని పొందవచ్చని సూచించారు.

స్వర్ణ తెలంగాణ స్వయం ఉపాధి పథకం కింద దరఖాస్తు చేసుకున్న ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ, ఓబీసీ, ఆర్థికంగా వెనుకబడిన అభ్యర్థులు, వికలాంగులు, ఉద్యోగ విరమణ పొందిన సైనికులు, మహిళా అభ్యర్థులకు రిజిస్ట్రేషన్ ఫీజులో 25 శాతం ప్రత్యేక రాయితీతోపాటు రిపబ్లిక్ ఆఫర్ ద్వారా లక్ష రూపాయల వరకు క్యాష్‌బ్యాక్ సౌకర్యం పొందే అవకాశముందని పేర్కొన్నారు. అర్హత ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 26వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకునేందుకు www.tsevacentre.com వెబ్‌సైట్‌ను చూడాలని కోరారు. పూర్తి వివరాలకు 8179955744, 9505800050 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

సంపాదకీయం

మోడీ గడువు తీరనుందా!

కాలం ఒడిలో.. అనుభవాల ఒరవడిలో... ఒక సంవత్సరం కరిగిపోయింది. అనేక ఆశలు, ఆకాంక్షల మధ్య కొత్త ఏడాదిలోకి అడుగుపెట్టాం. క్యాలెండర్‌లో అంకె మార్పు జరిగి ఆయుష్షు తగ్గిస్తుందన్న భయం వెంటాడినా నూతన సంవత్సరంలోనైనా తమ కష్టాలు తీరతాయన్న ఆశే మనిషికి సగం బలం. కొత్త సంవత్సరమంటే.. 'కొత్త పాతల మేలు కలయిక క్రొమ్మెరుంగులు చిమ్మగా' అని గురజాడ చెప్పినట్టుగా గతించిన నిన్నలో సాధించిన విజయాలు... కమ్మేసిన వైఫల్యాలు... ఈ సమయంలో ఒకసారి నెమరేసుకొని తీపి, చేదు జ్ఞాపకాల నుంచి స్ఫూర్తినీ, గుణపాఠాలను అందుకోవడం భవిష్యత్తుకు చాలా అవసరం. 2018లో ప్రజలకు మోడీ మిగిల్చిన ఆవేదన అంతా ఇంతా కాదు. రైతులు, యువత, మహిళలు, ఏ ఒక్కరూ సంతోషంగా లేరు. అందరిలోనూ నిరాశ, నిస్పృహలే. ఆర్‌ఎస్‌ఎస్ స్వీయదర్శకత్వంలో బీజేపీ ప్రభుత్వం న్యాయానికే తూట్లు పొడుస్తూ రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేయడానికి ప్రయత్నించింది. రాఫెల్ కుంభకోణం, రుణ ఎగవేతదారుల పలాయనం, బ్యాంకుల దివాలాలు, రిజర్వ్‌బ్యాంకు వివాదాలు, సీబీఐ కుమ్ములాటలు, రూపాయి పతనం, చమురుమంటలు

> **అధికారం ఉన్నన్ని రోజులు మాటలతో కాలయాపన చేసిన మోడీ మళ్లీ అధికారమిస్తే ఏవేవో చేస్తామని చెప్పడం మోసపుచ్చడమే. అటువంటి వాటిని నమ్మబోమని ఇటీవలి జరిగిన ఎన్నికల్లోనే ప్రజలు తేల్చిచెప్పారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో ప్రజాకోర్టులో మోడీ ప్రభుత్వం భవిష్యత్తు తేలనుంది.**

మరెన్నో సంఘటనలు. వేలాదిమంది రైతులు తమ సమస్యల పరిష్కారం కోరుతూ దేశ రాజధాని ఢిల్లీలో లాంగ్ మార్చ్, శబరిమల, మీటూ వంటి సున్నితమైన అంశాలపైనా కదులుతున్న మహిళా ఉద్యమాలకు కొదవలేదు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్రధాన న్యాయమూర్తిపై నలుగురు న్యాయమూర్తుల తిరుగుబాటు చేసిందీ ఈ కాలంలోనే. చిట్టచివరి 'మన్‌కీబాత్'లో మోడీ సందేశమిస్తూ, కేంద్రప్రభుత్వం సాధించిన విజయాలు ప్రతి ఒక్కరినీ గర్వించేలా చేశాయని, ప్రగతిపథంలో ఈ పయనం కొత్త ఏడాది కొనసాగుతుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేయడం హాస్యాస్పదం. ఇటీవలి ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో శంగభంగం జరిగినా త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎన్‌డీఏ తిరిగి అధికారంలోకి వస్తుందని చెప్పడం మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శించడమే! ఈ సారి విజయం నల్లేరు మీద నడక కాదని మరోసారి ఓటర్లను మభ్యపెట్టి ఎన్నికల తాయిలాలను ప్రవేశపెట్టేందుకు మోడీ సిద్ధమయ్యారు.


అచ్చేదిన్ వంటి నినాదాలతో అధికారంలోకి వచ్చిన మోడీ నాలుగున్నరేండ్ల పాలనలో ప్రజాస్వామ్యం అపహాస్యం పాలైంది. మతం-కులం పేరిట సమాజంలో విభజనకు పాల్పడుతూ, రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులను కాలరాసే విధంగా బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఆర్‌ఎస్‌ఎస్, సంఘ్ పరివార్ శక్తులు బరితెగించి దుష్టచర్యలకు పాల్పడినా చర్యల్లేవ్. శబరిమలలోకి మహిళలను అనుమతిస్తూ ఇచ్చిన తీర్పు యావత్తూ దేశం హర్షించినా హిందూ మతోన్మాదులు చేస్తున్న రాద్ధాంతం అంతా ఇంతా కాదు. ఈ దాడులను వ్యతిరేకిస్తూ కొత్త ఏడాది ప్రారంభంలోనే మహిళలందరూ ర్యాలీ చేయడం



భవిష్యత్తు ఉద్యమాలకు సూచిక. అయోధ్యలో రామ మందిర నిర్మాణం కేసును ఇప్పటికిప్పుడు విచారించలేమని చెబితే ఆర్డినెన్స్ తేవాలని పట్టుబట్టడం గమనార్హం. రాఫెల్ విషయంలో తీర్పు, ప్రభుత్వం దానిని తప్పుదారిపట్టించిన తీరూ చరిత్రలో నిలిచిపోతుంది. గతేడాది డిసెంబర్ చివరివారంలో ఉత్తరప్రదేశ్‌లో మహిళను వివస్త్రను చేసి నడిబజారులో ఉరికించినా సంబంధింత వ్యక్తులను పట్టుకోలేదు. ఇలాంటి అఘాయిత్యాలెన్నో! ఒకవైపు పోలీసు రాజ్యం నడుపుతూ మరోవైపు ప్రజలకు రక్షణగా ఉంటున్న పోలీసు అధికారులను కాషాయ మూకలు చంపేసినా అటువంటివారి పట్ల యోగి ప్రభుత్వం చేష్టలుడిగింది తప్ప శిక్షించింది లేదు. స్వతంత్రంగా ఉండాల్సిన కేంద్ర దర్యాప్తు సంస్థల్లో కమలనాథులు, పరివార్ శక్తులదే జోక్యమైంది. అన్నదాతల కడగండ్లు తీర్చి, బలవన్మరణాలను అరికట్టడానికి ఉపయోగించాల్సిన డబ్బును పేరు కోసం ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన వల్లభాయ్ పటేల్ విగ్రహాన్ని నిర్మించారు. రాజ్యాంగ పదవుల్లో ఉంటున్న కేంద్రమంత్రులు, ముఖ్యమంత్రులు అభివృద్ధిని మరిచి హనుమంతుడి కులం గురించి వివాదాస్పద వ్యాఖ్యలు చేయడమూ శోచనీయం.

ప్రజల కష్టాలను తీర్చే చర్యలు మోడీ పాలనలో తీసుకోలేదు. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ వంటి అనాలోచిత చర్యలతో సామాన్యుల పరిస్థితి దయనీయంగా మారింది. దేశ ఆర్థికవ్యవస్థ అతలాకుతలమై నిర్థక ఆస్తులు (ఎన్‌పీఏఎలు) పేరుకుపోవడం వల్ల ప్రభుత్వరంగ బ్యాంకులు నష్టాల ఊబిలో కూరుకుపోయి దివాలా అంచులకు చేరుకున్నాయి. మూకోన్మాద దాడులతో అల్ప సంఖ్యాక వర్గాల్లో అభద్రతాభావం చోటు చేసుకుంది. ఆయుష్మాన్‌భారత్ వంటి పథకాలతో, పటేల్ విగ్రహావిష్కరణలతో ప్రపంచ పటం మీద నిలబడ్డామని 'మన్‌కీ బాత్' మాటలు చెబుతున్న మోడీకి నాటి 'అచ్ఛేదిన్' ఇక లేవని తేలిపోయింది. దీంతో కొత్త మంత్రం జపిస్తున్నారు. తాత్కాలిక ఉపశమన పథకాలతో లబ్ది పొందాలని ఎత్తుగడలు వేస్తున్నారు. అందుకే రుణమాఫీలు, నగదు బదిలీ వంటి పథకాలతో మభ్యపెట్టి ముందుకు రావడం కోసం ఇప్పట్నుంచే ప్రచారాస్త్రాలు సిద్ధం చేసుకుంటున్నారు. అధికారం ఉన్నన్ని రోజులు మాటలతో కాలయాపన చేసిన మోడీ మళ్లీ అధికారమిస్తే ఏవేవో చేస్తామని చెప్పడం మోసపుచ్చడమే. అటువంటి వాటిని నమ్మబోమని ఇటీవలి జరిగిన ఎన్నికల్లోనే ప్రజలు తేల్చిచెప్పారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో ప్రజాకోర్టులో మోడీ ప్రభుత్వం భవిష్యత్తు తేలనుంది.

ఎవరికోసమీ 'మహా' మహమ్మారి రహదారి?



ఎన్. వేణుగోపాల్

ఇరవై ఐదేండ్ల కింద బెంగళూరులో గ్రామీణ అధ్యయనాల నిపుణులొకరు పరిశోధక విద్యార్థులకు పాఠం చెపుతూ ఒక ఆసక్తికరమైన విషయం ప్రస్తావించారు. వారి అధ్యయనంలో భాగంగా ఒక గ్రామానికి వెళ్లి గ్రామపటం గీసి చూపమని అక్కడి ప్రజలను అడిగారట. దాదాపుగా మహిళలందరూ ముందు ఒక వృత్తం గీసి, ఆ వృత్తం లోపల చెరువు, కుంటలు, తాము నీళ్లు తెచ్చుకునే స్థలాలు, పంటపొలాలు, నివాస గృహాలు గీశారట. దాదాపుగా పురుషులందరూ మొదట ఒక సరళరేఖ గీసి దాన్ని రోడ్డు అని చెప్పి, ఆ రోడ్డుకు అటూ ఇటూ ఇళ్లూ, పంటపొలాలూ గీశారట. ఇది తాముంటున్న లోకం పట్ల ఆయా మనుషుల దృక్పథానికి నిదర్శనం. కొందరికి తమ అస్తిత్వం నీటితో, నీటి వనరులతో నిర్ణయమవుతుంది, మరికొందరికి పట్టణంతో, మార్కెట్‌తో తమ అనుబంధంతో నిర్ణయమవుతుంది. మొత్తంగా సమాజంలోనే మారుతున్న విలువలకు కూడా ఇది నిదర్శనం. మనుషులకు మనిషే ప్రమాణంగా, మనిషి మనుగడకు ఆధారాలుగా ఉండేవే ప్రమాణంగా ఉండవలసిన చోట ఆ ప్రమాణాలు మారుతున్నాయి. భావజాలం, ప్రచారసాధనాలు, మార్కెట్ మప్పుతున్న ఇతరేతర అంశాలే మన ప్రమాణాలుగా మారుతున్నాయి. మనిషి అభివృద్ధి ప్రధానంగా ఉండవలసిన చోట సరుకుల అభివృద్ధి, సరుకుల రవాణా అభివృద్ధి, సరుకుల వినియోగంలో అభివృద్ధి ప్రధానమైపోతున్నాయి. రోడ్లు, భవనాలు, వంతెనలు, విమానాశ్రయాలు అభివృద్ధికి చిహ్నాలు కావడం చూస్తూనే ఉన్నాం. మనుషుల అభివృద్ధికి కేవలం రోడ్ల అభివృద్ధిగా కుదించిన నిర్వచనం ఇచ్చి రోడ్లనే మనుషుల అభివృద్ధికి సాధనంగా చూపడానికి పాలకులు ప్రయత్నిస్తున్నారు. మనుషులకు ఆహారభద్రత, ఆశ్రయం, ఉపాధి అవకాశాలు, ఆత్మగౌరవం లేకపోయినా ఫర్వాలేదు, రోడ్లు ఉంటే చాలు అని కొత్త అభివృద్ధి పాఠాలు చెపుతున్నారు.

> **హైదరాబాద్‌కు యాభై, అరవై కిలోమీటర్ల దూరంలో సర్పంలా చుట్టుకునే ఈ మహా మహమ్మారి రహదారి పొడవు 338 కిలోమీటర్లట. పదకొండు వేల కోట్ల రూపాయల ప్రాథమిక వ్యయ అంచనాలతో మొదలవుతున్న ఈ రహదారి ముగిసేసరికి ఆ వ్యయం ఎంత పెరుగుతుందో, ఎంత ప్రజాధనాన్ని మింగేస్తుందో గాని, తక్షణమే 4,922 హెక్టార్ల (12,163 ఎకరాల) భూమిని ఆ భూమి యజమానుల నుంచి లాగేసి, మింగేస్తుంది.**

ఈ అభివృద్ధి మాయాజాల భావజాలం దేశంలో ప్రపంచీకరణ తర్వాత విపరీతంగా విస్తరిస్తుండగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోకి దాన్ని బలంగా తీసుకువచ్చినది చంద్రబాబునాయుడు. రాజకీయాల్లో ఆయన శిష్యుడుగా ప్రారంభమైన తెలంగాణ ఏలిక చంద్రశేఖరరావు ఆ భావజాలాన్ని అణువణువునా నింపుకున్నారు. తెలంగాణ పాలనలోనూ అదే భావజాలాన్ని అనుక్షణం పాటిస్తున్నారు. ఈ భావజాలం ప్రకారం, తెలంగాణలో అవసరం ఉన్నా లేకపోయినా, అవసరాన్ని పెద్దది చేసి చూపి అయినా, అదే అవసరం అని ప్రజల్లో భ్రమలు కల్పించి అయినా విపరీతంగా రోడ్ల నిర్మాణం చేపడుతున్నారు. పాలకుల వైపు నుంచి చూసినప్పుడు రోడ్ల నిర్మాణానికి మూడు లాభాలున్నాయి. ఒకటి, రోడ్లే అభివృద్ధి అనే మంత్రజపంతో అమాయకులను మోసం చేసి, తమకు నిత్యజీవితావసరాలు అందకపోయినా, ఉద్యోగాలు రాకపోయినా, ఆత్మగౌరవం లేకపోయినా రోడ్డును చూసి మురిసిపోయే ఒక అమాయక సమూహాన్ని నిర్మించవచ్చు. ఆ అమాయకత్వాన్ని వోట్లుగానూ మార్చుకోవచ్చు. అంటే రోడ్ల నిర్మాణం అంతిమంగా తమను చూసి మైమరిచిపోయే సమూహ నిర్మాణంగా మిగులుతుంది. రెండు, రోడ్ల నిర్మాణం పేరుతో వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని ఆశ్రితులైన కాంట్రాక్టర్లకు అందజేయవచ్చు. అంటే రోడ్ల నిర్మాణం అనేది అంతిమంగా ఆశ్రితుల బొక్కసాల నిర్మాణంగా ముగుస్తుంది. ఆ బొక్కసాల నుంచి ఎంతో కొంత పై నుంచి కింది దాకా ముడుపులుగా ముట్టడం అనే అదనపు ప్రయోజనం ఎట్లాగూ ఉంటుంది. మూడు, రోడ్డు పడిన చోటల్లా రోడ్డుకు అటూ ఇటూ మాత్రమే కాదు, రెండు మూడు కిలోమీటర్లు అటూ ఇటూ కూడ వ్యవసాయ భూమి వ్యవసాయేతర భూమిగా, రియల్ ఎస్టేట్‌గా మారిపోయి, పంట పొలాల స్థానంలో సరిహద్దు రాళ్లూ రియల్ ఎస్టేట్ జెండాలూ లేచి నిలుస్తాయి. అంటే రోడ్ల నిర్మాణ పథకం అంతిమంగా రియల్ ఎస్టేట్ పథకంగా మారిపోతుంది. పాలకుల ఆశ్రితులైన రియల్ ఎస్టేట్ డెవలపర్లు, కాంట్రాక్టర్లు, బ్రోకర్లతో కూడిన ఒక మాఫియా రాజ్యం ప్రారంభమవుతుంది.

హైదరాబాద్ చుట్టూ ఒక రీజినల్ రింగ్ రోడ్డుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపిందని, ఆ ప్రతిపాదనలను అంగీకరిస్తూ, దానికి అవసరమైన భూసేకరణకు అనుమతిస్తూ కేంద్రప్రభుత్వ రహదారుల మంత్రిత్వశాఖ ఉత్తర్వులు జారీ చేసిందని వార్తలు భయం గొలుపుతున్నాయి. అభివృద్ధికి తప్పుడు నిర్వచనం ఇచ్చుకునే అమాయకులకు, రోడ్ల కంట్రాక్టర్లకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ఈ వార్తలు సంతోషాన్ని కలిగించి ఉండవచ్చుగాని వాస్తవంగా ఈ ప్రతిపాదనలు తెలంగాణ ప్రజల మీద, తెలంగాణ వ్యవసాయ ఆర్థిక వ్యవస్థమీద భూకంపం లాంటి ప్రమాద హెచ్చరికలు. ఈ మహా మహమ్మారి రోడ్డు రాజకీయ నాయకులకు, రోడ్డు నిర్మాణ సంస్థలకు, రియల్ ఎస్టేట్ వ్యాపార సంస్థలకు నిస్సందేహంగా ప్రయోజనకరమైనదే. కానీ అదే స్థాయిలో, బహుశా అంతకన్న ఎక్కువ స్థాయిలో తెలంగాణ వ్యవసాయాన్ని దెబ్బ తీసేది. వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా, రియల్ ఎస్టేట్ గా మార్చేది. వ్యవసాయం మీద ఆధారపడిన రైతులకు ఎంతో కొంత తాత్కాలిక తాయిలం చేతిలో పెట్టి శాశ్వత వనరును పోగొట్టేది. వ్యవసాయం మీద ఆధారపడిన లక్షలాది ప్రజానీకపు ఉపాధి పోగొట్టి బిచ్చగాళ్లుగా, వలస కార్మికులుగా మార్చేది.

హైదరాబాద్‌కు యాభై, అరవై కిలోమీటర్ల దూరంలో సర్పంలా చుట్టుకునే ఈ మహా మహమ్మారి రహదారి పొడవు 338 కిలోమీటర్లట. పదకొండు వేల కోట్ల రూపాయల ప్రాథమిక వ్యయ అంచనాలతో మొదలవుతున్న ఈ రహదారి ముగిసేసరికి ఆ వ్యయం ఎంత పెరుగుతుందో, ఎంత ప్రజాధనాన్ని మింగేస్తుందో గాని, తక్షణమే 4,922 హెక్టార్ల (12,163 ఎకరాల) భూమిని ఆ భూమి యజమానుల నుంచి లాగేసి, మింగేస్తుంది. ఈ పన్నెండు వేల ఎకరాలు రహదారి నిర్మాణానికే అవసరం కాగా, ఈ రహదారి దాదాపుగా తెలంగాణ మొత్తాన్నీ చక్రబంధంలో చుట్టివేస్తుంది గనుక తెలంగాణలో అత్యధిక భాగం, కొన్ని లక్షల ఎకరాల విస్తీర్ణం రియల్ ఎస్టేట్ వ్యాపారుల అక్రమ క్రీడాస్థలిగా మారిపోవడానికి అవకాశం ఏర్పడుతుంది.

రంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల్లో 24 మండలాలు ఈ మహమ్మారి రహదారితో ప్రభావితమవుతాయని ప్రాథమిక అంచనాలు తెలుపుతున్నాయి. కేవలం ఈ రహదారికి ఆనుకుని ఉండే గ్రామాలు, పట్టణాలు మాత్రమే కాక రహదారి నుంచి అటూ ఇటూ రెండుమూడు కిలోమీటర్ల మేరనో, ఇంకా ఎక్కువగానో ఈ కొండచిలువ నీడలోకి వస్తాయి. అంటే దాదాపుగా ఈ 24 మండలాల్లో అత్యధిక భాగం భూములు ఈ రహదారి ప్రభావంలోకి వస్తాయి. ఇక అక్కడి వ్యవసాయ భూములు వ్యవసాయానికి మిగలవు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఇప్పటికే అక్కడ గద్దలలాగ వాలి ఉంటారు. ఆ గ్రామాల్లో ఎకరమో రెండెకరాలో ఉన్న రైతులను నయానో భయానో, కోట్లు వస్తాయనే ఆశచూపో, చుట్టూ ఉన్నవారు అమ్మేశారని బెదిరించో ఆ భూముల్లో రియల్ ఎస్టేట్ జండాలు ఎగరేస్తారు. ఆ భూముల్లో వెంచర్లు ప్రారంభించి, రాతి కణీలు పాతి, "రీజినల్ రింగ్ రోడ్డుకు ఒక కిమీ



దూరంలో, రెండు కిమీ దూరంలో" అని ఆకర్షణీయమైన బ్రోచర్లు ఈ పాటికే తయారు కావడం మొదలై ఉంటుంది.


ఈ పరిణామానికి తక్షణ దుష్ఫలితాలు ఎన్నో ఉన్నాయి. మొట్టమొదటిది, ఈ మహమ్మారి ఈ గ్రామాల వ్యవసాయాన్ని దెబ్బతీస్తుంది. ఇప్పటికే ఆహారభద్రతలో ప్రమాదకర స్థితిలో ఉన్న రాష్ట్రం మరింత దిగజారే పరిస్థితి వస్తుంది. రాష్ట్ర ప్రభుత్వ అధికారిక గణాంకాల ప్రకారమే రాష్ట్రంలో తిండిగింజలు పండించే ప్రాంతం 2013-14లో 34.31 లక్షల హెక్టార్లు ఉన్నదల్లా, 2014-15కు 26.13 లక్షల హెక్టార్లకు, 2015-16కు 21.80 లక్షల హెక్టార్లకు దిగజారి, 2016-17లో 27.44 లక్షల హెక్టార్లకు పెరిగింది. వీటిలో మొదటి మూడు అంకెలూ రాష్ట్ర ప్రభుత్వ డైరెక్టరేట్ ఆఫ్ ఎకనమిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ ప్రచురించిన స్టాటిస్టికల్ ఇయర్ బుక్ 2017 (పే.105) లోవి కాగా, చివరి అంకె రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికాశాఖ ప్రచురించిన సోషియో ఎకనమిక్ ఔట్ లుక్ 2018 (పే. 21) లోది. మరొకరకంగా చెప్పాలంటే ఉమ్మడి పాలనలో తెలంగాణ రాష్ట్రం మొత్తం విస్తీర్ణంలో 2010-11లో, 2013-14లో 34.13 శాతం, 34.77 శాతంగా ఉన్న తిండిగింజల సాగుభూమి, రాష్ట్రం ఏర్పడిన తర్వాత 27.37శాతానికి, 23.36శాతానికి పడిపోయింది. ఆ తర్వాత రెండు సంవత్సరాల స్టాటిస్టికల్ ఇయర్ బుక్స్ ఇంకా వెలువడలేదు. పద్ధతి ప్రకారం 2018 అక్టోబర్ నాటికి ఆ సంవత్సరం ఇయర్ బుక్ వెలువడవలసింది గాని అది కూడా వెలువడలేదు. ఈ గణాంకాలను కూడా యథాతథంగా నమ్మడానికి వీలులేదు గాని ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణలో ఆహారధాన్యాల విస్తీర్ణం కన్న ప్రత్యేక రాష్ట్రంలో కనీసం ఆరేడు లక్షల ఎకరాల తరుగుదల ఉందనేది మాత్రం వాస్తవం. ఈ ప్రభుత్వ విధానాల కింద ఒకవైపు వ్యవసాయ భూమిని వ్యవసాయేతర వినియోగంలోకి మార్చే ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతుండడం ఒక కారణం కాగా పత్తి వంటి వాణిజ్య పంటల విస్తీర్ణం పెరిగిపోతుండడం మరొక కారణం. సాగు విస్తీర్ణం తగ్గినా ఉత్పాదకత పెరిగి ఉత్పత్తిలో మార్పురాని స్థితి కూడా ఉంటుంది గాని తెలంగాణలో ఉత్పాదకత పెరుగుదల కూడా లేదు. స్టాటిస్టికల్ ఇయర్ బుక్ 2017 (పే. 128-29) చెపుతున్న ప్రకారమే, 2010-11 కూ 2015-16కూ మధ్య వరి ఉత్పత్తి సూచి (2007-08 ప్రాతిపదిక సంవత్సరంలో 100 ఉందనుకుంటే), 2010-11లో 98.07 ఉన్నదల్లా 2015-16 నాటికి సగానికి సగం పడిపోయి 45.3 అయింది. ఇదే సమయంలో పత్తి ఉత్పత్తి సూచి 119.59 నుంచి రెట్టింపు కన్న ఎక్కువ అయి 288.12కు చేరింది. రాష్ట్ర వ్యవసాయ రంగం ఇటువంటి డోలాయమాన స్థితిలో ఉన్నది గనుకనే వ్యవసాయ రంగం కూడ కలిసిన ప్రాథమిక రంగపు వృద్ధి రేటు విభజనకు ముందు 2012-13లో 8.6 శాతం, 2013-14లో 1.8శాతం ఉన్నదల్లా ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినాక 2014-15లో మైనస్ 5.8 శాతానికి పడిపోయింది, ఆ తర్వాతి సంవత్సరం 2015-16లో కాస్త మెరుగుపడి మైనస్ 2.9 శాతం దగ్గర ఆగింది. ఆ తర్వాతి సంవత్సరం 2016-17లో మొదటి సవరించిన అంచనాలు 12.2 శాతం వృద్ధిని, 2017-18లో ముందస్తు అంచనాలు 6శాతం వృద్ధిని చూపుతున్నాయని సోషియో ఎకనమిక్ ఔట్‌లుక్ 2018 (పే. 11) అంటుంది గాని ఈ ఆశాభావం నిజమవుతుందా లేదా రానున్న నివేదికల్లో చూడవలసిందే.

రెండు, ప్రస్తుతం అంతగా గిట్టుబాటు కాని వ్యవసాయంలో ఉన్న రైతులు ఈ రియల్ ఎస్టేట్ ఒత్తిడికి లొంగిపోయి తమ భూములు వదులుకోవచ్చు. కాని వారిలో అత్యధికులకు వచ్చే తాత్కాలిక ప్రతిఫలం పప్పు పుట్నాలు అయిపోగా, శాశ్వత జీవనోపాధి వనరు, గ్రామంలో గౌరవ హేతువు శాశ్వతంగా చేజారిపోతుంది. అలా తెలంగాణ సమాజంలో ఒక గణనీయమైన భాగం ఆస్తికీ, ఉపాధికీ, ఆత్మగౌరవానికీ దూరం కావడానికి ఈ మహమ్మారి రహదారి కారణమవుతుంది.

మూడు, వ్యవసాయం మీద ఆధారపడిన, భూమిలేని కూలీలు, వృత్తి పనివారు ఈ గ్రామాల్లో వ్యవసాయం విధ్వంసం కావడంతో నిర్వాసితులైపోతారు. రోడ్డు నిర్మాణ పనిలో కూలి కొన్నాళ్లు దొరకవచ్చు గాని, ఆ తర్వాత అది కూడ కరువై వారు పొట్టచేతపట్టుకుని పట్నాల్లో కూలీ అడ్డాల్లో పడిగాపులు పడవలసి వస్తుంది. మహమ్మారి రహదారి వారిని అక్కడ మింగి పట్నపు బిచ్చగాళ్లుగా, పనికోసం వెతుకులాడే కూలీలుగా జారవిడుస్తుంది.ఇవాళ తెలంగాణ సమాజం అడగవలసిన ప్రశ్న ఇంతకీ ఈ మహా మహమ్మారి రహదారి అవసరమేనా అని. ఒకవేళ అవసరమే అనుకుంటే ఎవరి అవసరమది? ఎవరిని మింగబోతున్నదది?

సెల్: 9848577028

హ్యాపీ 'వ్యూ' ఇయర్..!



ఇ.దుర్గాప్రసాద్

హ్యాపీ న్యూ ఇయర్ అంటూ పలకరించుకొంటున్న వ్యక్తులే ఎక్కువ. నూటికో కోటికో అన్నట్టు కొందరు మినహా అనేక మంది ఆంగ్ల నూతన సంవత్సరాదిని ఓ ఉత్సవంలా జరుపుకొన్నారు. కడపటి కేలండరు కాలగతిలో కలిసిపోయి..కొత్తది గోడల మీద, బల్లల పైన ప్రత్యక్షమైంది. కేలండరు మారడానికి ప్రతిసారీ 365/366 రోజుల సుదీర్ఘ కాలం పడుతుంది. కేలండరు మారుతున్న క్షణాల్లోనే ఆనందం కేరింతలు కొడుతుంది. గ్రామీణ సందులు మొదలు నగరాల్లో కాలనీల వ్యాప్తంగా డిసెంబరు 31 అర్ధరాత్రి నుంచి జనవరి 1 వేకువజాము వరకూ సందడే సందడి నమోదైంది. ఒక్కో సమూహం ఒక్కోలా న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ నిర్వహించుకున్నాయి. ఆబాల గోపాలం ఆడిపాడింది. సంక్రాంతికి ముందే ముగ్గుల ముచ్చట్లు ఇల్లూ వాకిళ్లకు కొత్త కళ తెచ్చాయి. మొత్తానికి వివిధ రకాల ఏర్పాట్లు, ముస్తాబులు న్యూ ఇయర్ స్పిరిట్‌ను టెంప్ట్ చేసేశాయి. వ్యక్తులు, కుటుంబాలు, గల్లీలు, ఊళ్లూ, మండలాలు, పట్టణాలు, సిటీలు ఆనంద డోలికల్లో మునిగితేలాయి. ఆ సమయంలో కష్ట నష్టాలు, బరువు బాధ్యతల్లాంటివి మానవాళికి కాస్తంత విశ్రాంతినిచ్చాయి. ఎట్ ది సేమ్ టైం 2019 వచ్చీ రావడంతోనే ఊరడింపునూ ఉత్తేజాన్ని పంచింది. గడిచిన ఏడాదిలో మంచి చెడులు బేరీజు వేసుకోనిచ్చింది. సరికొత్త లక్ష్యాలు, ఆశయాల్ని నిర్దేశించుకునే అవకాశానికి బాటలేసింది. వ్యక్తిగతంగానూ, సంస్థల పరంగానూ ఇట్లాంటివి అనేక చోట్ల 'తలపు'తట్టాయి. ధనవంతులను తప్పిస్తే, తక్కిన అందరికీ వ్యయాలకు తగ్గ ఆదాయ మార్గాలపై నిత్యాన్వేషణ అనివార్యమైంది. జీవన ప్రమాణాల మెరుగు కోసం మరింత శ్రమించే ప్రేరణకు కొత్త సంవత్సర వేడుకలు దోహదం చేశాయి. రాబడికి, ఖర్చులకూ రాను రాను అగాధం వృద్ధి చెందుతుండడమే లక్షలాది కుటుంబాలకు, కోట్లాది బడుగూ, బలహీన వర్గాల వారి ఎదుగుదలకు అతి పెద్ద అవరోధంగా పరిణమించింది. ముఖ్యంగా ఇంధన ధరలే అన్నింటికీ మూల కారణం. ఇప్పుడంటే.. రాబోయే లోక్‌సభ ఎన్నికల కాలం కాబట్టి కాబోలు.. పెట్రోలు రేట్లు కొంచెం దిగుతున్నట్టు కనిపిస్తున్నది. కానీ, అది ఎల్లకాలం తగ్గుతూ వస్తుందనే నమ్మిక ఎవరికీ లేదు. కానీ, అదే ముడి చమురు రేట్లు సగానికి సగం తగ్గితే గనుక నిజంగా పండుగే. ఎందుకంటే ప్రతి వినిమయ వస్తువు రేటు గరిష్టంగా రవాణాపైనే ఆధారపడి ఉంటుంది. అసలు అక్కడే సమస్య మొదలవుతుంది. ఆకాశన్నంటుతోన్న నిత్యావసర ధరలు సగటు జీవికి అందుబాటులోకి రావాలంటే, పెట్రోలు, డీజిలు రేట్లకు పగ్గాలు పడాలి. అదే సమయంలో ప్రతి ఒక్కరి తలసరి ఆదాయం పెరగాలి. నిరుద్యోగం కనిష్టానికి పడిపోవాలి. అలాగైతేనే ఆర్థిక అంతరాలు సమసిపోయే చాన్సుంటుంది. అయితే ప్రస్తుత పాలక పార్టీల మనసంతా ఎంతసేపూ అధికారాన్ని నిలబెట్టుకునే, దక్కించుకునే యావ చుట్టే చక్కర్లు కొడుతున్నది. ఎన్నికలప్పుడు జనాన్ని బోల్తా కొట్టించే ఎత్తుగడలనే ముద్దాడుతున్నాయి. అట్లా గట్టెక్కి, ఆనక తమ విశ్వరూపాలను ప్రదర్శిస్తున్నాయి. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వాధిపతి విధానాలు ఇందుకు దగ్గరగా ఉన్నట్టు లోకమంతా గ్రహించింది. అందుకే కావొచ్చు, 'ప్రధాని అభ్యర్థి'పై నాగపూర్(సంఘ్) పునరాలోచనలో పడినట్టు తాజాగా కబుర్లొస్తున్నాయి. వాస్తవానికి ప్రభుత్వాలు ఆర్థిక, సామాజిక అసమానతల తొలగింపునకు త్రికరణ శుద్ధితో పాలిస్తే ఈ దుస్థితి ఉండేదే కాదు. నరేంద్రమోడీపై ఎన్నో ఆశలు పెట్టుకొన్న దేశ, రాష్ట్ర ప్రజలు దారుణంగా భంగపడ్డారు. ఈ 2019లోనే పార్లమెంటు ఎన్నికలుంటాయి. గత, వర్తమానాలను గమనంలో ఉంచుకొని ఓటర్లందరూ తగిన తీర్పు ఇచ్చే ముహూర్తం ఎంతో దూరం లేదు. చక్కటి సమసమాజ నిర్మాణానికి వ్యక్తులు, సమూహాలుగా పూనుకునే తరుణమిదే. పెద్ద డినామినేషన్ నోట్లరద్దు, జీఎస్టీ వంటి హేతుబద్ధత లేని, అసంబద్ధ విధానపరమైన నిర్ణయాలతో రకరకాల సవాళ్లను జనం మీదకు ప్రభుత్వమే విసరడం అత్యంత హేయం, శోచనీయం. ఈ పీడలను అధిగమించడానికి అనునిత్యం పోరాడడం సమాజానికి తప్పనిదైంది. చైతన్యవంతమైన సమాజం శక్తియుక్తులను కూడదీసుకొని ప్రభుత్వాల పాపపు చర్యలను ఎండగడుతున్నది. వ్యక్తులుగా మనమంతా స్వీయ క్రమశిక్షణతో లక్ష్యాల గమ్యాన్ని సజావుగా చేరుకోడానికి పూనికబూనాలి. అట్లే అనాలోచితంగా, తిక్కపూరితంగా పిడికెడంత మందికి అంతులేని లబ్ది చేకూర్చేలా మన తలరాతలను ఇష్టారీతిన రాస్తోన్న కార్పొరేట్ హితకారులైన పాలక పార్టీలకు కనువిప్పు కలిగేలా శపథం చేసి ఆచరించాలి. మొత్తంగా మనకూ సమస్త సమాజానికీ 2019 హ్యాపీ 'వ్యూ' ఇయర్‌గా 2020 ఆగమనంకల్లా భాసిల్లి, వాసికెక్కే కీలక ఏడాది కావాలని అభిలషిద్దాం!

సెల్: 9440850384

మలి ప్రభుత్వ తొలిశాసనం ఎవరి కోసం?



ఎస్. వినయకుమార్

తెలంగాణకు రెండవసారి ముఖ్యమంత్రి అయిన కల్వకుంట చంద్రశేఖరరావు వారం తిరక్కుండానే సామాజికన్యాయంపై విషబాణం విసిరారు. పంచాయతీరాజ్ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 34శాతం నుంచి తగ్గిస్తూ తొలిశాసనం చేశారు. నోరువాయిలేని బలహీనులపై తన సత్తా చూపారు. సుప్రీంకోర్టు తీర్పును సాకుగా చూపెట్టి హడావిడిగా రిజర్వేషన్ల కోటా 50శాతం మించరాదంటూ ఆర్డినెన్సు తెచ్చారు. కొత్త శాసనసభ ఇంకా ఉనికిలోకి రాకముందే, మంత్రివర్గం ఏర్పాటు కాకముందే ముఖ్యమంత్రిగా తనకున్న అధికారాన్ని ఉపయోగించి ఆర్డినెన్సు జారీ చేసి శాసనసభ హక్కునూ హరించారు. తాను అంతకు ముందు పలు సందర్భాలలో ఉద్ఘాటించినట్టు బీసీలకు 34శాతం రిజర్వేషన్ పరిరక్షణ పట్ల ఏమాత్రం శ్రద్ధ చూపలేదు. విద్యా, ఉద్యోగాల్లో బీసీలకు ఉన్నపాటి 25శాతం రిజర్వేషన్‌కు కూడా అవకాశమివ్వలేదు. ఆర్డినెన్స్ ఫలితంగా 22శాతమే బీసీలకు పంచాయితీరాజ్‌లో రిజర్వేజషన్లు లభిస్తాయి. ఇలా బీసీలపై ఉక్కుపాదం మోపి రాష్ట్రాలకు హక్కులు కావాలంటూ దేశాటన మొదలు పెట్టారు.

తెలంగాణలో వెనుకబడిన తరగతుల జనాభా ఎక్కువైనప్పటికీ పరిపాలనలో వారి భాగస్వామ్యం పరిమితం. దీన్ని దృష్టిలో ఉంచుకొని గత ప్రభుత్వాలు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34శాతం రిజర్వేషన్లను అమలు చేశాయి. 1995, 2001, 2006, 2013లో జరిగిన పంచాయితీరాజ్ ఎన్నికల్లో 34శాతం కోటాను అమలు జరిపాయి. అన్ని రకాల రిజర్వేషన్లు 50శాతం మించరాదన్న కోర్టు తీర్పులపై మినహాయింపులు పొంది ఆ పని చేయగలిగాయి. కానీ టీఆర్ఎస్ ప్రభుత్వం ఆ పని చేయలేకపోయింది. 34శాతం కోటాను అనుమతించాలంటూ సుప్రీం కోర్టు ముందుకు పూర్తి సన్నద్ధతతో వెళ్లలేదు. వివరాలు సమర్పించడానికి, వాదనలు విన్పించడానికి తెలంగాణ ప్రభుత్వం సమయం కోరి ఉండాల్సింది. గతంలో న్యాయస్థానాలు కోరిన బీసీ జనగణన పక్కాగా పూర్తి చేసుకొని సిద్ధంగా ఉండాల్సింది. ఆ పని చేయకుండా కేసును డిస్పోజ్ చేయమంటరా, ఉపసంహరించుకొంటారా అని కోర్టు అడిగితే ఉపసంహరించుకొంటామని చెప్పింది. పరిపాలనలో అన్ని సామాజిక తరగతులకు తగిన భాగస్వామ్యం ఉండాలని కోరుకునే ప్రభుత్వాలేవీ ఆ పని చేయరాదు.

వార్డు స్థాయి నుంచి పార్లమెంట్ వరకు ఎన్నికల్లో డబ్బు పాత్ర నానాటికి పెరిగిపోతోంది. ఫలితంగా కోట్లకు పడగలెత్తినవారే ఎన్నికల్లో గెలుస్తున్నారు. దీని పర్యవసానంగా రిజర్వు కాని స్థానాల్లో సంపన్నులైన ఆధిపత్య కులాలకు సంబంధించిన వారే ఎక్కువగా ఎన్నికవుతున్నారు. తెలంగాణలో బీసీల నుంచి 1999లో శాసనసభకు 26మంది ఎన్నికయ్యారు. 2004లో 17మంది 2009లో 25మంది ఎన్నికయ్యారు. గత శాసనసభలో 19మంది బీసీ సభ్యులుండగా ఇప్పుడు వారి సంఖ్య 23కు పెరిగింది. ఎన్నికల్లో నెగ్గిన బీసీలు కూడా కోట్లకు పడగలెత్తిన వారే. ఇది కూడా పరిశీలించదగిందే. బీఎల్ఎఫ్ తరపున పోటీ చేసిన బీసీ, ఎస్సీ, ఎస్టీలు మాత్రమే దీనికి మినహాయింపు. చట్టసభల్లో ఒకనాడు ప్రాతినిధ్యం వహించినంత సంఖ్యలో బీసీ ప్రాతినిధ్యం లేదు. రిజర్వేషన్లు తగ్గితే స్థానిక సంస్థల్లోనూ బీసీల ప్రాతినిధ్యం తగ్గిపోతుంది. అన్ రిజర్వ్‌డ్ కేటగిరిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ తరగతులకు చెందిన వారు ఎన్నిక కావడం సులభం కాదు. తెలుగుదేశంతో పోటీ పడటానికి కాంగ్రెస్ కూడా అప్పట్లో బీసీలకు ప్రాతినిధ్యం కల్పించాల్సి వచ్చింది. ఇప్పుడా స్థితి లేదు. గెలుపు గుర్రాల పేరుతో సంపన్నులకు మాత్రమే పాలకవర్గ పార్టీలు టికెట్లిచ్చాయి. ఇదేస్థితి స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఉండబోతున్నది. రిజర్వు చేయని జనరల్ స్థానాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీలు పోటీకి నిలబడే సంఖ్యే తగ్గిపోతుంది.

బీసీ కోటాను 34శాతం కొనసాగించాల్సిందేనని కేసిఆర్ కూడా మొదట్లో వాదించారు. తమిళనాడు కర్నాటకల్లో 50శాతానికి మించి రిజర్వేషన్లను అమలు చేయడం న్యాయమైతే 56శాతం బీసీల జనాభా ఉన్న తెలంగాణలో 34శాతం రిజర్వేషన్లు ఎలా తప్పవుతాయని కూడా ఆయన ప్రశ్నించారు. మొత్తం



రిజర్వేషన్లు 50శాతానికి మించరాదని రాజ్యాంగంలో ఎక్కడా చెప్పలేదన్నారు. శాసనసభ ఎన్నికల ముందు ఇలాంటి వాదనలన్నీ చేసిన కేసిఆర్ చప్పున చల్లారి పోయారు. ఏరు దాటాక బోడి మల్లన్న అన్నట్టు చేశారు. బీసీ రిజర్వేషన్లను తగ్గిస్తూ హడావుడిగా శాసనం తెచ్చారు. తన మాటలకు చేతలకు పొంతన ఉండదని ఆయనే మారోసారి చాటిచెప్పారు. రిజర్వేషన్లు 50శాతం మించరాదంటూ హైకోర్టులో పిటిషన్ వేసినవారిలో ఒకరు టీఆర్ఎస్ సర్పంచు మరోకరు కాంగ్రెస్ ఎంపీటీసీ కావడం గమనార్హం! ఇప్పుడు కాంగ్రెసు, బీజేపీ వంటి పార్టీలు కూడా 34శాతం రిజర్వేషన్ పునరుద్ధరించాలని డిమాండు చేస్తున్నాయి. వీరికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా తక్షణం పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టి, చట్టసవరణ చేయవచ్చు. అప్పుడు కోర్టు తీర్పులు కూడా ఆటంకం కాజాలవు. ఇప్పటికే పార్లమెంటు సమావేశాలు నడుస్తున్నాయి. బీజేపీ, కాంగ్రెసులు తలుచుకుంటే 34శాతం రిజర్వేషన్ కాపాడవచ్చు. వారి చేతుల్లో ఉన్న విషయం వదిలిపెట్టి డిమాండు చేసి చేతులు దులుపుకోవటం అవకాశవాదం.

ఎబిసిడిఇ వర్గీకరణ మాటేమిటి?

కోర్టు విధించిన పరిమితి వల్ల బీసీ రిజర్వేషన్లను తగ్గించాల్సి వచ్చిందని అంటున్న కేసీఆర్‌కు మొత్తంగానే సామాజిక న్యాయం పట్ల ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో తెలియచెప్పడానికి బీసీ వర్గీకరణను ప్రస్తావించవచ్చు. రిజర్వేషన్ల శాతం 50కి మించరాదని షరతు విధించిన న్యాయస్థానం బీసీల్లో ఎ,బి,సి,డీ,ఇ వర్గీకరణ రాష్ట్ర ప్రభుత్వ ఇష్టమని చెప్పింది. కోర్టు చెప్పిన ఈ మాటను విననట్టే తెలంగాణ సీఎం నటిస్తున్నారు. అన్ని సామాజిక తరగతుల వారికి పరిపాలనలో ప్రాతినిధ్యం ఉండాలన్న సామాజిక న్యాయ దృష్టి ఆయనకు ఉంటే వర్గీకరణ అమలుకయినా పూనుకొని ఉండేవాడు. విద్యా, ఉద్యోగాల్లో ఎ,బి,సి,డీ వర్గీకరణను 1972లోనే సుప్రీం కోర్టు కూడా అంగీకరించింది. అదే పద్ధతిని స్థానిక సంస్థల ఎన్నికల్లో అమలు చేయడానికి కాంగ్రెస్, తెలుగుదేశం ప్రభుత్వాలు శ్రద్ధ చూపలేదు. అదే బాటలో కేసీఆర్ ప్రభుత్వమూ నడుస్తోంది. వెనుకబడిన తరగతుల్లో అత్యంత వెనుకబడిన కులాల దగ్గరకి వచ్చే సరికి ఒక్క సీపీఐ(ఎం) తప్ప అన్ని రాజకీయ పార్టీలదీ ఒకే ధోరణి. విద్యా, ఉద్యోగాల్లో న్యాయమైన వర్గీకరణ స్థానిక సంస్థలో ఎందుకు న్యాయమైంది కాదో ఆ పార్టీలు వివరించవు. విడివిడిగా చూసే తక్కువ జనాభా గల కులాలకు పరిపాలనలో భాగస్వామం అనవసరమని అవి చెబుతాయి. ఇక్కడ మాత్రం కోర్టు తీర్పులు అడ్డుపడుతున్నాయనీ, సమయం సరిపోవడం లేదనీ చెప్పడానికి వీల్లేదు. బీసీ వర్గీకరణపై న్యాయస్థానాల్లో ఎదురైన ఆటంకాలను అధిగమించడానికి ఆ ప్రకారం గ్రామ పంచాయతీలను ఇతర స్థానాలను రిజర్వు చేయడానికి బోలెడంత సమయం కేసీఆర్ ప్రభుత్వానికి ఉండింది. కానీ అది ఆ పని చేయలేదు. ఎంబీసిలను గుర్తించడంలోనూ కేసీఆర్ ఆషామాషీగానే వ్యవహరించారు. తమిళనాడులో ఓబిసిలో సామాజికంగా ఆర్థికంగా మరింతగా వెనుకబడిన వారిని, సంచార జాతులను అక్కడి ప్రభుత్వం ఎంబీసిలుగా గుర్తించింది. మొత్తంగా 63శాతం రిజర్వేషన్లు అక్కడ అమలు చేస్తున్నారు. కర్నాటకలో విద్యారంగంలో బీసీలకు 32శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నారు. కేటగిరి 1కు 4శాతం, కేటగిరి 2ఎ కు 15శాతం, కేటగిరి 2బి కి 4శాతం, కేటగిరి 3ఎ కు 4 శాతం, కేటగిరి 3బి కి 5 శాతం అమలు చేస్తున్నారు. మోస్ట్ బ్యాక్‌వర్డ్ కేటగిరిలో 95 కులాలున్నాయి. మోర్ బ్యాక్ వర్డ్ కేటగిరి కింద 102 కులాలు 2ఎ లో ఉన్నాయి. ముస్లింలు 2 బి కింద ఉన్నారు. వృత్తి కులాలు ఎక్కువ భాగం 2ఎ లో ఉన్నాయి. వాటి జనాభా ఎక్కువ. వక్కలిగ తదితర కులాలు 3 ఎ కింద లింగాయత్‌లు 3బి కింద ఉన్నారు. కర్నాటక పంచాయితీరాజ్ ఓబిసి కోటాలో 80శాతం బీసీ(ఎ) 20శాతం బీసీ(బి) కింద అమలు చేస్తున్నారు.అంటే వర్గీకరణ అమలు చేస్తున్నారు.

తెలంగాణలో వర్గీకరణ ఊసులేదు. సంచార కులాలను మాత్రమే ఎంబీసిగా గుర్తించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అది కూడా వర్తించదు. విద్యా, ఉద్యోగాల్లో ఎలాగూ ఎ,బి,సి,డి,ఇ వర్గీకరణ అమలవుతోంది. గనుక సంచార జాతులను మాత్రము ఎంబీసీలుగా గుర్తించాలన్న తమ నిర్ణయం వారికి ఆర్థికసాయం చేయడానికేనని టీఆర్ఎస్ ప్రభుత్వం వాదిస్తున్నది. ఎంబీసీలుగా గుర్తించిన వారికయినా ఎద్దైనా ఉపయోగకరమైన పథకాన్ని ప్రవేశపెట్టారా? అంటే అదీ లేదు. పంచాయితీరాజ్ ఆర్డినెన్స్ జారీ చేయడానికి ముందు ముఖ్యమంత్రి రాజకీయ పార్టీలతో, వివిధ సంఘాలతో సమావేశం జరపలేదు. వారి అభిప్రాయాలను తెలుసుకోలేదు. మొత్తంగా టీఆర్ఎస్ ప్రభుత్వం సామాజిక న్యాయం పట్ల వ్యతిరేక వైఖరితోనే ఉందనేది స్పష్టం. ■

మానవి
నవతెలంగాణ

మమత గారాలపట్టి తన్వి. తనకు ఆరునెలలు పూర్తవగానే తన పాలు మాత్రమే కాకుండా, బయటి ఆహారం కూడా ఇవ్వడం మొదలు పెట్టింది. అన్నీ పెట్టాలనే ఆత్రుతలో పూటకో ప్రయోగం చేసేది. అయితే ఓ రోజు పాపకు ఉన్నట్టుండి శరీరం మొత్తం దద్దుర్లు తేలాయి. అది సీరియస్‌గా మారింది. దీంతో కంగారు పడిన మమత హాస్పిటల్ వెళ్లగానే అన్ని టెస్టులు చేసి పాపకి ఫుడ్ ఎలర్జీ ఉందని చెప్పారు. పాపకి ముందు రోజు తినిపించిన జీడిపప్పు పడకపోవడం వల్లే ఆ సమస్య వచ్చిందనీ... మందులతో తగ్గిపోతుందని చెప్పడంతో మమత ఊపిరి పీల్చుకుంది.



ఒకేసారి వద్దు

- ఆరు నెలలు పూర్తికాగానే తమ పిల్లలకి ఇచ్చే ఆహారం గురించి తల్లిపడే ఆరాటం అంతాఇంతాకాదు. ఏది తినిపిస్తే తన పాపకి బాగుంటుందోనని ఎన్నో రకాల ఆహార పదార్థాలు తయారు చేస్తూనే ఉంటుంది. అయితే ఒక్కోసారి అది విఫలం కావచ్చు. పిల్లల ఆరోగ్య సమస్యలకు దారితీయవచ్చు. అందుకే ఇలా చేసే ముందు కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. ఎందుకంటే అప్పటి వరకు తల్లి పాలు మాత్రమే తాగిన పాపాయికి ఒకేసారి ఘన ఆహారం తీసుకోవడం ఇబ్బందిగా ఉంటుంది. అంతేకాదు పాపాయికి ఏ ఆహారం పడుతుందో పడదో కూడా చూసుకోవాలి. కొన్ని సందర్భాల్లో ఇచ్చే ఆహారం పడకపోవడం వల్ల అది ఫుడ్ఎలర్జీకి దారితీస్తుంది. సీరియస్‌గానూ మారవచ్చు. ఫుడ్ ఎలర్జీ అనేది ఆహారం ఇచ్చిన వెంటనే రావచ్చు లేదా కొన్ని గంటల్లోనూ రావచ్చు.
- పిల్లలకి మొదటిసారి ఘన ఆహారం ఇస్తున్నట్లయితే... మనం వారికి ఇచ్చే ఆహారంపై పూర్తి అవగాహన ఉండాలి. బయట షాప్‌లలో దొరికే వాటికంటే ఇంట్లో తయారుచేసుకున్న ఆహారమైతే బాగుంటుంది. బయటి నుంచి తెచ్చిపెట్టే పౌడర్‌లతో తొందరగా ఫుడ్ ఎలర్జీ వచ్చే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా పాలు, గుడ్లు, నట్స్ (ముఖ్యంగా పల్లీలు), ధాన్యాలు, గోధుమలు, నువ్వులు, ఓట్స్ వంటి వాటివల్ల ఫుడ్ ఎలర్జీ త్వరగా వచ్చే అవకాశం ఉంటుందని వైద్యులు సూచిస్తున్నారు. ఎక్కువగా ఫుడ్ ఎలర్జీకి కారణమవుతున్న వాటిల్లో పాలు, గుడ్లు మొదటి స్థానంలో ఉన్నాయని వారు చెబుతున్నారు.
- పిల్లలకి ఒక కొత్త ఆహారం ఇచ్చినపుడు వారిలో వచ్చే మార్పులను గమనించాలి. అంటే సరిగా జీర్ణం అవుతుందో లేదో చూసుకోవాలి. కొంతమంది పిల్లలకి బయటి పాలు పట్టినపుడు వారు ఇబ్బందిపడుతుంటారు. కడుపు నొప్పితో ఏడుస్తుంటారు. కొన్ని సందర్భాల్లో వాంతులు, విరేచనాలు కూడా కావచ్చు. పాలకు సంబంధించిన ఇతర పదార్థాలను తేలిగ్గా జీర్ణం చేసుకోగలిగినా పాలను మాత్రం జీర్ణం చేసుకోకపోవచ్చు. వారిలో జీర్ణక్రియకు అవసరమైన ఎంజైమ్‌లు తక్కువగా విడుదలయినపుడు ఈ పరిస్థితి వస్తుంది. అది తల్లి ఇచ్చే ఆహారంపై ఆధారపడి ఉంటుంది.





- పిల్లల్లో ఫుడ్ ఎలర్జీ వల్ల కలిగే మార్పులను వెంటనే గుర్తించవచ్చు. అంటే ఆహారం పడకపోయినట్లయితే వాంతులు, పొట్టనొప్పి, దద్దుర్లు, ముక్కు కారడం, డయేరియా, గొంతు వాపు, శ్వాసతీసుకోవడంలో ఇబ్బంది వంటి మార్పులు వెంటనే కనిపిస్తాయి. ఇవి ఆహారం తీసుకున్న కొన్ని నిమిషాల్లోనే కనిపిస్తాయి. అయితే ఒక్కొక్కరిలో ఒక్కోలా ఉంటుంది. ఒక్కో ఆహారపదార్థం తీసుకున్నపుడు ఒక్కో రకమైన ఫుడ్ ఎలర్జీ కలగవచ్చు. అందుకే పిల్లల డైట్‌ను ప్రతిరోజూ జాగ్రత్తగా గమనించాలి. ఏవైనా మార్పులు వచ్చినపుడు వెంటనే పిల్లల వైద్యులని కలవాలి. ఫుడ్ ఎలర్జీకి కారణమైన ఆ ఆహారపదార్థాలు మళ్లీ వారి ఆహారంలో లేకుండా చూసుకోవాలి.
- పిల్లలకి నెమ్మదినెమ్మదిగా... పరిమితంగా ఒక్కోపదార్థాన్ని అలవాటు చేయాలి. ప్రతి కొత్త ఆహార పదార్థం పరిచయం చేయడానికి ముందు కనీసం నాలుగు నుంచి ఐదు రోజుల సమయం ఉండాలి. అంతేకాదు ఇస్తున్న ఆహారం వారు సులువుగా జీర్ణం చేసుకునేందుకు మెత్తగా, గుజ్జులాగా ఇవ్వడం మంచింది. అలా చేస్తే వారు ఆహారం మింగడానికి కూడా సులువుగా ఉంటుంది.
- అయితే కొన్ని సందర్భాల్లో ఎలర్జీలు అనేవి జన్యుపరంగా కూడా రావచ్చు. పిల్లల్లో ఏవయినా ఎలర్జీలు వచ్చినపుడు అవి ఆహారం వల్ల వచ్చినవో కాదు కూడా తెలుసుకోవాలి. పీడియాట్రీషియన్‌ను కలిసినపుడు మనం వారికి అందించిన ఆహారం గురించే కాకుండా... మన కుటుంబంలో ఎవరికైనా ఇలాంటి ఆరోగ్య సమస్యలు ఉన్నా చెప్పాలి. ఆరునెలల అనంతరం పిల్లలకు తల్లిపాలతో పాటుగా ఘన ఆహారం అందించడం వల్ల అది వారి శారీరక పెరుగుదలకు తోడ్పడమే కాకుండా రోగనిరోధక శక్తిని పెంపొందించడంలో కూడా ఉపయోగపడుతుంది. అయితే వారికి ఆహారం ఇవ్వడం ప్రారంభించాలనుకునేముందు ఒకసారి పిల్లల వైద్యనిపుణులను కలిసి సలహాలు తీసుకోవడం మంచిది.

పిల్లల్లో ఫుడ్ ఎలర్జీ వచ్చినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- వారికి ఏయే ఆహారం ఇస్తున్నామో, అది వారికి సరిపడుతుందో లేదో చూసుకోవాలి.
- మనం బయట ఏదయినా ఆహారపదార్థాలను కొనేముందు అవి తయారు చేసిన తేదీని, నాణ్యతని చూసి తీసుకోవాలి.
- ప్రయాణాలు చేస్తున్నపుడు వీలయినంతవరకు ఇంట్లో తయారు చేసిన ఆహారపదార్థాలని వెంట తీసుకువెళ్లాలి. అత్యవసరమైనపుడు ఫోన్ చేయడానికి వైద్యుల నెంబర్‌ను దగ్గర ఉంచుకోవాలి.
- వారికి ఆహారం తినిపిస్తున్న పాత్రల్ని శుభ్రంగా ఉంచాలి.
- రెగ్యులర్‌గా వైద్యుడిని సంప్రదిస్తూ ఉండాలి. ఒకసారి ఎలర్జీకి కారణమైన ఆహారాన్ని మళ్లీ ఇవ్వకపోవడం మంచిది.

జంబుల రమాదేవి



కమ్మనైన అమ్మభాష కనుమరుగుకాకుండా కాపాడుతున్న సాహిత్యవేత్తలు ఎందరో ఉన్నారు. ఒకరుఒకరు గా భాషబంధంలో బలపడుతూ అందుబాటులోకి వచ్చిన సాంకేతిక విజ్ఞానంతో కొత్తరూపు సంతరించు కుంటూ తెలుగుకు విదేశీ తెగులు తగలకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అలాంటివారిలో ఒకరు **ఎన్. లక్ష్మిఅయ్యర్.** సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ రాజస్థాన్‌లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా, హిందీ డిపార్ట్‌మెంట్ హెడ్‌గా సేవలందిస్తూ.. తెలుగుభాషాభివృద్ధికోసం కృషి చేస్తున్నారు. రాష్ట్రీయ, జాతీయ స్థాయిలో ఎన్నో అవార్డులు అందున్నారు. తమిళం, తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో కవితలు, కథలు, వ్యాసాలు రాస్తూ బహుముఖప్రజ్ఞాశాలిగా ప్రశంసలందుకుంటున్నారు. తమిళనాడు వయా తెలుగు టూ రాజస్థాన్ వరకు సాగిన సాహిత్యజీవనయానం ఆమె మాటల్లోనే..

ఆన్‌లైన్‌లో అమ్మభాష..

మీ గురించి చెప్పండి?

నాన్న నటరాజన్ అయ్యర్, అమ్మ తారాబాయి. మా సొంతూరు తమిళనాడులోని తిరుచిరాపల్లిలోని మయిల్రంగం అనే గ్రామం. నాన్నకు 1945 లో రైల్వేస్‌లో అసిస్టెంట్ స్టేషన్ మాస్టర్ గా ఆంధ్రలో ఉద్యోగం రావడంతో తిరుపతికి వచ్చాం. మా తాతయ్య(అమ్మనాన్న) లాల్ గుడి లో జగదీష్ అయ్యర్ పేరుమోసిన క్రిమినల్ లాయర్. ఆయనకు తారాబాయి, ఝాన్సి లక్ష్మిబాయి అంటే చాలా ఇష్టం. అందుకే అమ్మకు తారా అని పేరు పెట్టారట. నేను పుట్టిన తర్వాత నా పేరు లక్ష్మి అని పెట్టారు. నాన్నగారికి ప్రతిమూడేండ్లకు బదిలీ అయ్యేది. దాంతో మేం విజయవాడ, గుంటూరు, గుంతకల్, కడప, ముద్దనూరు ఇలా అనేక ఊర్లలో వున్నాం. నేను ముద్దనూరులోని ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో, ఇంటర్, డిగ్రీ తిరుపతిలోని పద్మావతి కాలేజిలో చదివాను. శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయంలో ఎంఏ హిందీ, మీరాబాయి, తరిగొండ వెంగమాంబ రచనలలో శ్రీ కష్ణుడు అన్న అంశంపై ఎంఫిల్, కొచ్చిన్ యూనివర్సిటీ లో హిందీ విభాగంలో 'క ష్ణ భక్త కవులు, తమిళ ఆళ్వార్ కవుల పాశురాలు – భక్తిశాస్త్రాల ఆధారంపై తులనాత్మక అధ్యయనం' పై పిహెచ్‌డి పూర్తిచేశాను.

హిందీ అధ్యాపకులు కావడానికి మీకు స్ఫూర్తి?

ప్రొఫెసర్ కావడానికి స్ఫూర్తి , సాహిత్య ప్రేరణ అంతా నా తల్లితండ్రులు, స్నేహితులు, మార్గ దర్శనం చేసిన నిస్వార్థ గురువులే. మాతృభాష తమిళం. ఇంట్లోనే మాట్లాడేవాళ్లం. పెరిగిందంతా ఆంధ్రప్రదేశ్ కావడంతో స్నేహితులు అందరూ తెలుగువారే. తీయనైన తెలుగు నాకు ఎంతో ఇష్టం. నాకు తెలుగు తమిళం భాష ల్లో సాహిత్యాన్ని పరిచయం చేసిన తొలి గురువు మా అమ్మ. ఆమె చిన్నచిన్న కథలు చదివి నాకు చెప్పేవారు. అవి ఎంతో నచ్చడంతో పాటు సాహిత్యంపై మక్కువ పెంచాయి. డిగ్రీ తర్వాత ఎంఏ (హిందీ) చేశాను. అన్న మలై యూనివర్సిటీ నుంచి బి.ఎడ్ చేసిన తర్వాత హిందీ అనువాదంలో పి.జీ డిప్లొమా, మద్రాస్ డి.బి.హిందీ ప్రచార్ సభ నుంచి రాష్ట్రీయ భాష ప్రవీణ్ పూర్తి చేశాను. పిహెచ్‌డి చేసిన తర్వాత చెన్నై విఐటి యూనివర్సిటీ క్యాంపస్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా జాయిన్ అయ్యాను. దక్షిణభారత్ హిందీ ప్రచార్ సభ, చెన్నైలో హిందీ రీడర్‌గా చేసిన తర్వాత మస్కట్‌లో రెండేండ్లు హిందీ టీచర్‌గా పనిచేశాను. ఆ తర్వాత సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ రాజస్థాన్‌లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా చేరాను. ప్రస్తుతం హ్యూమానిటీస్, లాంగ్వెజెస్ డిపార్ట్‌మెంట్ హెడ్‌గా ఉన్నాను.

మొదటికథ ఎప్పుడు రాశారు. ఇతర భాషల్లో రచనలు చేయడం ఎప్పుడు ప్రారంభించారు?

తమిళం మా అమ్మ నేర్పించిన భాష. పదవతరగతి వరకు తెలుగు, హిందీ ఒక సబ్జెక్‌గా చదువుకున్నాను. మా గురువులు చెప్పే విధానం ఆయా భాషలు నేర్చుకోవడానికే కాదు ఆసక్తి పెంచుకునేలా ఉండేది. రాగయుక్తంగా పద్యాలు పాడుతూ సాహిత్యప్రక్రియలపై అభిరుచి పెంచారు. అందుకే తమిళం, తెలుగు, హిందీ ఇంగ్లీష్ భాషల్లో కథలు, కవితలు, వ్యాసాలు రాస్తాను. ఐదోతరగతిలో ఉన్నప్పుడు పాఠశాల విద్య పత్రికలో ప్రచురణ కోసం ఒక కథ రాసాను. ఆ కథకు మొదటి బహుమతి వచ్చింది. మొదటికథకే బహుమతి రావడం, అందరు మెచ్చుకోవడంతో నాలో సాహిత్యపిపాస పెరిగింది. ఆ తర్వాత హిందీలో కవితలు కథలు రాస్తున్నాను . ఇప్పటివరకు హిందీలో ఆరు పుస్తకాలు, తమిళంలో రెండు పుస్తకాలు వచ్చాయి. మరో రెండు పుస్తకాలు త్వరలో వస్తాయి.

తెలుగులోఇప్పటివరకు వివిధ పత్రికల్లో, వెబ్‌పేజీల్లో ప్రచురింప బడ్డ కథలు మనసు విరిగెనేని (నవ తెలంగాణా) ఆత్మస్థైర్యం, నిర్మల ఆకాశం(గో తెలుగు.కం), వందేమాతరం (విశాలాంధ్ర)

విప్లవం వర్ధిల్లాలి, పునాది రాళ్ళు (జాబిల్లి), మొన్న పడ్డ ఆత్మకు కులమేది (అమ్మనుడి),

తమిళసినిమా ఉద్భవం –వికాసం (పరిశోధనాత్మక వ్యాసం, మిసిమి). మొదలైనవి.

తమిళంలో దాదాపు ఓ పది కథలు , వ్యాసాలు రాశాను. .హిందీలో 100 కు పైగా పరిశోధన వ్యాసాలు, కొన్ని కథలు రాశాను. ఇంగ్లీష్‌లోనూ కవితలు, వ్యాసాలు రాశాను.

మీ మూలాలు తమిళనాడులో ఉన్నాయి. ఒక రకంగా తమిళం మీ మాతృభాష. మరి తెలుగుభాషపై ఇంత మక్కువ కలగడానికి కారణం.

తెలుగంటేనాకు ప్రాణం .రాజస్థాన్ తెలుగు అసోసియేషన్ మెంబరుగా ఉన్నాను. సెంట్రల్ యూనివర్సిటీ లో దక్షిణ దేశపు భాషల విభాగాలు ప్రారంభించాలన్నది నా ఆకాంక్ష. ఇందుకోసం



భీష్మ ప్రతిజ్ఞ చేశాను. అది నిజమైన తర్వాతనే దక్షిణ భారత్‌లో స్థిరపడతాను.(నవ్వుతూ) ఎక్కడా తెలుగు వాసన లేని చోట తెలుగు పత్రికల ద్వారా సాహిత్యపరిమళాలు వెదజల్లుతున్నవారు ఎందరో ఉన్నారు. ఆంజనేయ శర్మ గారు ,అమ్మనుడి రమేష్ గారు, ఎస్‌వియూలో మా ఆచార్యులు కే. జే .మునిరత్నంగారు, తెలుగు బనారస్ విశ్వా విద్యాలయం ప్రొఫసర్ శ్రీ రామ మూర్తి గారు ఎందరో తెలుగుపై మక్కువ పెరిగేలా చేశారు. స్నేహితుల ప్రోత్సాహం ఎంతో ఉంది. వీరందరి స్ఫూర్తితో, అందుబాటులోకి వచ్చిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఆన్‌లైన్‌లో అమ్మభాష నేర్పాలన్నది నా ఆశ.



మీ కథల్లో సామాజికసమస్యలే ఇతివృత్తాలుగా ఉంటాయి. నేటి సమాజంలో మహిళల స్థానం మీ అభిప్రాయం.

మహిళలు లేకుంటే జీవితం శూన్యం .ఇది మగవారు తెలుసు కోవాలి . తెలియ జెప్పే బాధ్యత మహిళదే.

ఈరోజు అన్నిట్లో పై చేయి మహిళదే. స్త్రీలు ఎప్పుడు తమను తాము తక్కువగా అంచనా వేసుకోకూడదు. ఏ రంగంలో ఉన్నా ఉన్నత చదువులు చదవాలి. ఈ కాలం అమ్మాయిలు చాలా చురుకుగా వున్నారు. వారిలో ధైర్యం పెంచేలా ఆత్మరక్షణవిద్యలు నేర్పించాలి. ప్రభుత్వం స్త్రీలకు భద్రత కోసం ఎన్నో చట్టాలు తెచ్చినప్పటికి మహిళలకు సముచిత స్థానం లభించడం లేదు. ఉన్నత విద్యను అభ్యసించి, ఉన్నత ఉద్యోగాల్లో కొనసాగుతున్నా భర్త, బంధువుల మానసిక వేధింపులకు బలవుతున్న మహిళలు కోకొల్లలు. పోలీస్‌ల దగ్గరకు వెళ్ళాలంటే కేసులతో తిప్పలు..వాయిదాలతో కోర్టు చుట్టూ తిరగడాలు. అందుకే రాజీ పడి బతుకుతున్నారు. మధ్యతరగతి మహిళలు, ఉద్యోగులు కష్టాలన్నీ కళ్ళారా చూస్తున్నాను. చాలావరకు నా కథల ఇతివృత్తాలన్నీ సమాజసమస్యల చుట్టూనే ఉంటాయి. బాల్య వివాహాలు, పరదాలు వున్నా సమాజంలో మనం జీవిస్తున్నాం.

తెలుగుభాషాభివృద్ధి కోసం మీరిచ్చే సూచనలు?

ఇంగ్లీష్ మీడియం పాఠశాలల్లో తెలుగు కు ప్రాధాన్యత అంతంత మాత్రమే ఉండడంతో విద్యార్థులకు తెలుగు రాయడం చదవడం కూడా సరిగా రావడం లేదు . దానికి తోడు ఇంట్లో మాట్లాడే తెలుగులో సగం ఇంగ్లీష్ ఉంటోంది. డిగ్రీ, ఇంజనీరింగ్ , మెడికల్, మేనెజ్‌మెంటు తదితర కోర్సుల్లో తెలుగు ను ఓ అనివార్య భాష గా ప్రవేశ పెడితే కొంతవరకు తెలుగు నేర్చుకుంటారు. ప్రైవేటు కాలేజీల్లో విదేశీభాషలు చోటు చేసుకుంటున్నాయి. తెలుగుభాషకు బదులు సంస్కృతం పెట్టడం, అందులో నూటికి నూరు లేక అత్యధిక మార్కులు తెచ్చుకునే అవకాశం ఉండడంతో తెలుగు పరిస్థితి మరింత దిగజారింది. మాత భాష పట్ల ఏమాత్రం అభిమానం లేనిది ఆంధ్రులకే అన్నది జగమెరిగిన సత్యం. ఈ అపవాదు మనకు పోవాలి . ఇంగ్లీషు ,హిందీ భాషలు నేర్చుకోవాలి, బతుకుతెరువు కోసం ఎన్నో తిప్పలు పడాలి .కానీ మన భాషను బతికించుకోవాలి కదా ! యుద్ధ ప్రాతిపదికపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

వి. యశోద

రంగ వల్లులు



ఆకుతోట హరిచందన
హసన్ పర్తి,
వరంగల్ అర్బన్



23 చుక్కలు,
11 వచ్చే వరకు
మధ్య చుక్కలు

మా చిరునామా
మానవి,నవతెలంగాణదినపత్రిక, ఎం.హెచ్. భవన్, 21/1, అజామాబాద్, హైదరాబాద్-20. ఇ-మెయిల్: manavi@navatelangana.com

సమస్యలు తలెత్తకుండా..!



ఇటీవల కాలంలో చాలామంది సీనియర్ సిటిజన్స్ తీవ్రమైన డిప్రషన్‌కు లోనవుతున్నారు. ముఖ్యంగా విదేశాల్లో ఉన్న పిల్లలు తల్లిదండ్రుల సంరక్షణా బాధ్యతను బంధువులు లేదా పనివాళ్ల చేతుల్లో పెట్టేస్తున్నారు. సీనియర్ సిటిజన్లలో పెరుగుతున్న డిప్రషన్‌కు ఇది ప్రధాన కారణమని మానసిక శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. పిల్లల దగ్గర లేక పనివాళ్ల దయాదాక్షిణ్యాల మీద సీనియర్ సిటిజన్లు ఆధారపడవలసి వస్తుంది. ఫలితంగా తీవ్రమైన ఒంటరితనాన్ని అనుభవిస్తున్నారు. కొందరు వృద్ధులైతే ఆ ఒంటరితనాన్ని భరించలేక ఆత్మహత్యలకు సైతం పాల్పడుతున్నారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులు పిల్లల నుంచి ప్రేమ, వాత్సల్యాలు, అండదండలు కోరుకుంటారని నిపుణులు చెబుతున్నారు.

చండీఘడ్‌లో ఇలాంటి సీనియర్ సిటిజన్ బాధితుల సంఖ్య రెట్టింపు అయిందని గణాంకాలు చెప్తున్నాయి. చండిఘడ్‌లోని పోస్టు గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ సంస్థకు చెందిన సైకియాట్రిస్టు నిపుణులు మాట్లాడుతూ గత తొమ్మిదేళ్ల కాలంలో చండీఘడ్‌లో ఒంటరితనంతో బాధపడుతున్న సీనియర్ సిటిజన్ల సంఖ్య రెట్టింపు అయిందని వెల్లడించారు. గతంలో పిల్లలతో ఆసుపత్రికి వచ్చే సీనియర్ సిటిజన్లు ఇప్పుడు సర్వెంట్లతో వస్తున్నారు. మానసిక సమస్యలతో పాటు ఆరోగ్య సమస్యలు కూడా వీరిని బాధిస్తుంటాయి. దీంతో ఒంటరిగానే వైద్యుల వద్దకు వీళ్లు వెళ్లాల్సివస్తోంది అని మానసిక వైద్యులు తెలిపారు. అలాగే సీనియర్ సిటిజన్లు ఎక్కువగా డెమన్షియా అనే మానసిక సమస్యతో బాధపడుతున్నారు. ఇలాంటి సమస్యలు తలెత్తకుండా ఉండాలంటే సీనియర్ సిటిజన్లకు నిత్యం ఫిజికల్ యాక్టివిటీ, మెంటల్ యాక్టివిటీ అవసరం. కథలు చెప్పడం, కొత్త సాంకేతిక పరికరాలను వాడడం వంటి పనుల్లో వారి మెదళ్లను బిజీగా ఉంచితే వారు ఒంటరితనాన్ని అధిగమించగలరు.

టీఎస్‌యూటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

- రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా సిహెచ్.రాములు, చావ రవి
- 135మందితో జంబో టీం ఏకగ్రీకంగా ఎన్నిక
- భవిష్యత్ కార్యాచరణ అమలు చేయాలని తీర్మానం



చావ రవి, సిహెచ్.రాములు

నవతెలంగాణ-ఖమ్మం ప్రతినిధి/ఖానాపురం హవేలి

మూడురోజుల పాటు ఖమ్మం నగరంలో జరిగిన తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర తృతీయ మహాసభలు మంగళవారంతో ముగిశాయి. రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా సిహెచ్.రాములు, చావ రవి తిరిగి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర కార్యవర్గ ఎన్నికకు సీనియర్ నాయకులు దత్తు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. నూతనంగా ఎన్నికైన రాష్ట్ర కార్యవర్గం సమావేశమై 21మంది ఆఫీస్ బేరర్‌లను, ఆరుగురు సభ్యులతో కూడిన రాష్ట్ర ఆడిట్ కమిటీని, ఏడుగురు సభ్యులతో 'వాయిస్ ఆఫ్ తెలంగాణ టీచర్' పత్రిక సంపాదక వర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ఉపాధ్యక్షులుగా సిహెచ్ దుర్గా భవాని, కె.సోమశేఖర్, కోశాధికారిగా ఎన్.కిష్టయ్య, కార్యదర్శులుగా బి.నరసింహారావు, టి.లక్ష్మారెడ్డి, వెంకట్, రాజశేఖర్‌రెడ్డి, ఎం.ఆంజనేయులు, జి.అశోక్, కె.జంగయ్య, వి.శాంతికుమారి, ఆర్.శారద, జి.సమ్మారావు, డి.సత్యానంద్, ఎస్‌వై.కొండలరావు, ఈ.గాలయ్య, కె.రంజిత్ కుమార్, బి.రాజు, జి.నాగమణి ఎన్నికయ్యారు. రాష్ట్ర ఆడిట్ కమిటీలో కన్వీనర్‌గా ఏ.శ్రీనివాస్, సభ్యులుగా సీహెచ్.రాజన్ బాబు, ఎం.వెంకటప్ప, యాకయ్య, మహబూబ్ అలీ, లక్ష్మణరావు ఎన్నికయ్యారు. వాయిస్ ఆఫ్ తెలంగాణ పత్రిక సంపాదకవర్గంలో ప్రధాన సంపాదకులుగా పి.మాణిక్ రెడ్డి, సంపాదకులుగా రామకష్ణ, జి.వందన, ఎం.శ్రీధర్, సీ.హెచ్.రవి, ఏ.నర్సిరెడ్డి, ఏ.విద్యాదేవి ఉన్నారు.

విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి: సీహెచ్ రాములు, చావ రవి

విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తామని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.రాములు, చావ రవి అన్నారు. కమిటీ ఎన్నిక అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. సమస్యలపై త్వరగా కార్యాచరణ రూపొందించి పోరాడుతామన్నారు. భవిష్యత్ కర్తవ్యాల విజయవంతానికి కృషి చేస్తామని తెలిపారు. పాఠశాల విద్యారంగంలో సానుకూల సంస్కరణల అమలుకు తల్లిదండ్రుల భాగస్వామ్యంతో గ్రామీణ విద్యా సదస్సులు నిర్వహించాలన్నారు. పాఠ్య పుస్తకాలు సిలబస్ సీసీఈ తదితర అంశాలన్నీ అధ్యయనం చేసి లోపాల సవరణకు ప్రాతినిధ్యం ద్వారా కృషి చేయాలన్నారు. నల్లగొండ నియోజకవర్గం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి నర్సిరెడ్డిని, కరీంనగర్ నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి బి.కొండల్‌రెడ్డిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. అన్ని స్థాయిల్లో కార్యకర్తలకు శిక్షణ ఇచ్చి స్టడీ సర్కిల్స్ నిర్వహించాలన్నారు.

ప్రాజెక్టుల నిర్మాణానికి కట్టుబడి ఉన్నాం

- ఆకుపచ్చ తెలంగాణే ప్రభుత్వ లక్ష్యం: రిటైర్డ్ సీఈ శ్యాంప్రసాద్‌రెడ్డి
- పాలమూరు- రంగారెడ్డి పనులు పరిశీలన



అధికారులకు సూచనలు చేస్తున్న శ్యాంప్రసాద్‌రెడ్డి

నవతెలంగాణ- మహబూబ్‌నగర్ ప్రతినిధి

ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ శ్యాంప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆకుపచ్చ తెలంగాణ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఆ దిశగానే ప్రాజెక్టుల నిర్మాణాన్ని వేగవంతం చేస్తోందన్నారు. మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాలో చేపడుతున్న పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పనులను మంగళవారం ఇంజినీరింగ్ బృందంతో కలిసి ఆయన పరిశీలించారు. నిర్మాణ పనుల్లో అలసత్వం వహించొద్దని సిబ్బందికి, అధికారులకు సూచించారు. నార్లాపూర్, ఏదుల, వట్టెం, పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం ఆదేశాల మేరకు ప్రాజెక్టుల పనుల పరిశీలనకు వచ్చామని చెప్పారు. పనుల్లో వేగం పెంచితే అనుకున్న సమయానికి సాగు నీరందించే అవకాశముందన్నారు. పాలమూరు ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మాణం చేస్తున్న టన్నెల్ ఇంకా 200 మీటర్లు పూర్తి చేయాల్సి ఉందని తెలిపారు. మిగతా 40 ఎకరాల భూమి సేకరణ వెంటనే చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రాజెక్టులో నెలకొన్న సమస్యలు గుర్తించి ప్రభుత్వానికి తెలియజేయడం వల్ల సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. బిజినపల్లి మండలం వట్టెం దగ్గర రిజర్వాయర్ ప్రధాన కాల్వ పనులు మందకొడిగా కొనసాగుతుండటం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. రేవల్లి మండలం ఏదుల వద్ద కొనసాగుతున్న రిజర్వాయర్ పనులు 80శాతం పూర్తి కావడంతో సంతృప్తిని వ్యక్తం చేశారు. ఏదులలో జరుగుతున్న పనుల మాదిరిగానే మిగతా చోట్ల పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట సీఈ ముత్యంరెడ్డి, ఇంజినీర్లు వెంకటేష్, కాంట్రాక్టర్లు, అధికారులు ఉన్నారు.

ఎస్టీయూ డైరీ ఆవిష్కరించిన గవర్నర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నూతన సంవత్సరం డైరీని తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ మంగళవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో ఆవిష్కరించారు. ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దడానికి ఉపాధ్యాయులు శ్రమిస్తున్నారని నరసింహన్ కితాబిచ్చారు. మరింత శ్రమించి నాణ్యమైన విద్యను అందించాలని కోరారు. ఎస్టీయూటీఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి భుజంగరావు, జి సదానందంగౌడ్ ఓ ప్రకటన విడుదల చేశారు. గురుకుల విద్యాసంస్థల తరహాలో ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఆ వసతులు కల్పించాలని సూచించారు. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అర్హత గల ఉపాధ్యాయులందరికీ ఏకీకృత సర్వీసు నిబంధనల సమస్యను పరిష్కరించి పదోన్నతులు ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూటీఎస్ నాయకులు ఎవి సుధాకర్, ఎస్ ప్రభాకర్‌రావు, పి బ్రహ్మాచారి, కరుణాకర్‌రెడ్డి, నరసింహారెడ్డి, ఇఫ్తకారుద్దీన్, ప్రవీణ్‌కుమార్, పరుషోత్తంరెడ్డి, బి వెంకటేశ్వర్లు, పాండురంగారెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థుల ఆకలి కేకలు

నూతన సంవత్సర వేళ...

- ప్రయివేటు సంస్థకు అప్పగించిన ఫలితం
- హోటల్ నుంచి భోజనం తెప్పించిన ఉపాధ్యాయులు



తూర్పుగోదావరి: నూతన సంవత్సరం రోజు ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అందక విద్యార్థులు ఆకలితో అలమటించిన సంఘటన తూర్పుగోదావరి జిల్లా కాట్రేనికోన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు, విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం 2018 డిసెంబర్ నెలాఖరు వరకూ పాఠశాలల్లోనే ఉపాధ్యాయుల పర్యవేక్షణలో మధ్యాహ్న భోజన నిర్వహణ కార్మికుల ద్వారా భోజనాలు తయారుచేసి వడ్డించేవారు. మండలంలోని 83 పాఠశాలలకు గానూ, మొదటివిడతగా 30 పాఠశాలలకు మధ్యాహ్న భోజన నిర్వహణ బాధ్యతను జనవరి 1 నుంచి ఏక్తాశక్తి ఫౌండేషన్‌కు ప్రభుత్వం అప్పగించింది. మొదటిరోజు మంగళవారం 30 పాఠశాలలకు గానూ ఐదు పాఠశాలలకు భోజనమే సరఫరా కాలేదు. దీంతో, విద్యార్థులు ఆకలితో అలమటించి రోడ్డెక్కారు. మిగిలిన పాఠశాలల్లో భోజనం సరఫరా అయినప్పటికీ చాలీచాలని భోజనాన్ని సరఫరా చేయడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యారు. మెనూ ప్రకారం గుడ్డు పెట్టాల్సి ఉన్నా, పెట్టలేదని, సాంబారుకు, కూరకు తేడాలేకుండా నాసిరకంగా వంటలు ఉన్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మండల కేంద్రమైన కాట్రేనికోన జిల్లా పరిషత్ హైస్కూల్‌కు మధ్యాహ్నం 2 గంటలు దాటినా భోజనాలు రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యారు. ఉపాధ్యాయులు స్థానిక హోటల్ నుంచి భోజనాలు రప్పించి విద్యార్థులకు పెట్టారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ ప్రయివేట్ సంస్థలకు అప్పగించడం వల్లనే ఇలా జరిగిందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పాతవిధానాన్ని కొనసాగించి, విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరారు.

భోజనాలు సక్రమంగా రాకపోవడం వాస్తవమే

మండలంలోని 30 పాఠశాలలకు ఏక్తాశక్తి ఫౌండేషన్ ద్వారా సరఫరా కావాల్సిన భోజనాలు సక్రమంగా పాఠశాలలకు చేరకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. కొన్ని పాఠశాలలకు పూర్తిగా భోజనాలు వెళ్లలేదు. అటువంటి పాఠశాలలకు విద్యాశాఖ ఆధ్వర్యాన పులి హోర వంటి పదార్థాలు విద్యార్థులకు అందించాం. పూర్తిస్థాయిలో విద్యార్థులందరికీ భోజనాలు సరిపోలేదు. మెనూ ప్రకారం కోడిగుడ్డు, కూరలు, సాంబారు నాశిరకంగానే ఉన్నాయి. వీటిపై నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తాను.

సిహెచ్‌వివి.సత్యప్రసాద్, ఎంఈఓ, కాట్రేనికోన

ప్రయివేటు సంస్థలను నిషేధించాలి

మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ బాధ్యతలను ప్రయివేట్ సంస్థలకు అప్పగించరాదు. సక్రమంగా, స్థానికంగా పాఠశాలలవద్దే మధ్యాహ్న భోజనం తయారయ్యే విధానాన్ని కొనసాగించాలి. ఏక్తాశక్తి ఫౌండేషన్‌ను మధ్యాహ్న భోజనం నిర్వహణ బాధ్యతల నుంచి పూర్తిగా తొలగించాలి. లేనిపక్షంలో జిల్లాస్థాయిలో ఉద్యమం చేపట్టుతామం. నాసిరకంగా కూరలు, భోజనాలు తయారుచేయడం మా దృష్టికి వచ్చింది. వీటిపై అధికారులు స్పందించకుంటే ఉద్యమం తప్పదు.

జి.దుర్గాప్రసాద్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి

కొత్త ఏడాది రోజున భారత్‌లో 70వేల జననాలు!

యూనిసెఫ్ వెల్లడి



అగర్తలాలో

న్యూఢిల్లీ: న్యూఇయర్ రోజున భారత్ 69,944 మంది చిన్నారులకు ఆహ్వానం పలకనున్నట్టు అంచనా. ప్రపంచ వ్యాప్తంగా ఇదే అత్యధికమని ది యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ చిల్డ్రన్ ఎమర్జెన్సీ ఫండ్(యునిసెఫ్) మంగళవారం నివేదికలో వెల్లడించింది. భారత్ తర్వాత స్థానాల్లో చైనా(44,940), నైజీరియా(25,684) ఉన్నాయని తెలిపింది. చిన్నారుల హక్కుల పరిరక్షణ కోసం కొద్ది సంవత్సరాలుగా యూనిసెఫ్ వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తుంది. పుట్టే ప్రతిబిడ్డకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించాలని ఆ సంస్థ వెల్లడించింది. 'ఈ కొత్త సంవత్సరం రోజున ప్రతి చిన్నారి హక్కును కాపాడాలని అందరం నిర్ణయించుకుందాం. మొదట వారి జీవించే హక్కును కాపాడదాం' అని యూనిసెఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిలుపునిచ్చారు. స్థానిక వైద్య సదుపాయాలను మెరుగుపరచడం వల్ల వారు సురక్షితమైన చేతుల్లో జన్మిస్తారన్నారు. 'జనవరి ఒకటిన ప్రపంచ వ్యాప్తంగా అనేక మంది అలెగ్జాండర్లు, అయేషాలు, జైనబ్‌లు జన్మించనున్నారు. కానీ చాలా దేశాల్లో వారు పుట్టిన రోజునే మరణిస్తున్నారు. 2017లో పుట్టిన రోజునే అనేకమంది చిన్నారులు మరణించారు. మొదటి నెలలో 25 లక్షల మంది మరణించారు. చాలా మంది చికిత్సతో తగ్గిపోయే చిన్నపాటి జబ్బుల కారణంగా చనిపోవడం బాధాకరమని యూనిసెఫ్ ఆ నివేదికలో తెలిపింది. 2019 మొదటి రోజున ప్రపంచ వ్యాప్తంగా 3,95,072 మంది చిన్నారులు పుట్టగా.. భారత్ లోనే ఆ సంఖ్య 69,944(18శాతం) అని వివరించింది.

విద్యార్థి మృతదేహంతో ఆందోళన

పిడుగురాళ్ల : 'లక్షలకు లక్షలు ఫీజులు వసూలు చేసిన కాలేజీ యాజమాన్యం విద్యార్థులు కాలేజీ సమయంలో బయటకు వెళ్తుంటే ఎందుకు ఆపలేదని ఆపి ఉంటే ఈ రోజు నా కొడుకు చనిపోయి ఉండేవాడుకదా' అంటూ లాలపూరం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విద్యార్థి తండ్రి, అతని బంధువులు గుంటూరు జిల్లా పిడుగురాళ్ల పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద మంగళగవారం నిరసన తెలిపారు. సోమవారం గుంటూరు నగరం లాలాపురం వద్ద జరిగిన

ఆర్‌విఆర్ అండ్ జేసీ కళాశాలపై చర్యలు తీసుకోవాలని రహదారిపై నిరసన

ఘోర రోడ్డు ప్రమాదంలో పిడుగురాళ్లకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి షేక్ గఫూర్ మృతి చెందిన విషయం విదితమే. మంగళవారం కుటుంబ సభ్యులు గఫూర్ మృత దేహాన్ని పిడుగురాళ్ళ పోలీస్ స్టేషన్ ఎదుట ఆర్.వి.ఆర్ ఆండ్ జేసీ కాలేజీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని నిరసన తెలిపారు. మృతుడు షేక్ గఫూర్ సామాజిక తరగతికి చెందిన వారు పెద్ద సంఖ్యలో పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకున్నారు.

శత్రుఘ్నకు వీఐపీ హోదా ఉండదిక...

పాట్నా ఎయిర్‌పోర్టు డైరెక్టర్ స్పష్టీకరణ

పాట్నా: బీజేపీ రెబెల్ నేత, ఎంపీ శత్రుఘ్న సిన్హాకు పాట్నా విమానాశ్రయంలో వీఐపీ హోదా ఇక నుంచి ఉండబోదని డైరెక్టర్ రాజేంద్రసింగ్ లౌహారియా సోమవారం స్పష్టం చేశారు. ఇంతకుముందు ఆయన కారును ఎయిర్‌పోర్టులోకి నేరుగా అనుమతించడంతో పాటు భద్రతాపరమైన తనిఖీలు కూడా ఉండేవి కాదు. కాగా.. ఇక నుంచి ఆయనకు ఇలాంటి ప్రత్యేక సదుపాయాలేమీ ఉండవని లౌహారియా తెలిపారు. అంతేకాక.. వీఐపీ హోదా పొడగింపునకు సంబంధించి తమకు ఇంతవరకు ఎలాంటి ఆదేశాలు అందలేదని ఆయన వెల్లడించారు.

అతి విశ్వాసంతోనే ఘోర పరాజయం

ఉత్తమ్, రమణ లైట్‌గా తీసుకున్నారు

- ఓటమికి ఈవీఎంలను సాకుగా చూపటం సరికాదు
- రాజకీయ కారణాలను విశ్లేషించుకోవాలి
- సీట్ల సర్దుబాటు తేలకపోవడం కూడా ఒక కారణం: మీడియాతో చిట్‌చాట్‌లో టీజేఎస్ అధినేత కోదండరామ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకత్వంలోని ప్రజా కూటమికి తగిలిన ఎదురు దెబ్బ నుంచి కూటమి పార్టీలు ఇంకా తేరుకున్నట్టు కనిపించడం లేదు. ఓటమి నుంచి కాంగ్రెస్ కాస్త తేరుకుని సమీక్షలు చేస్తుండగా, భాగస్వామ్య పక్షాలు మాత్రం కాంగ్రెస్ తీరుతోనే ఓటమి పాలయ్యామనే భావనలో ఉన్నాయి. ఇప్పటికే సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి కాంగ్రెస్ పార్టీ తీరుతోనే నష్టపోయామనే అభిప్రాయం వ్యక్తం చేయగా, తెలంగాణ జన సమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరామ్ కూడా ఇంచుమించు ఇదే విషయాన్ని చెప్పారు. మంగళవారం హైదరాబాద్‌లో మీడియాతో ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడారు. కూటమి ఓటమికి గల కారణాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీ సమీక్షల్లో అసలు అంశాలపై కాకుండా ఇతర అంశాలపై చర్చలు చేస్తున్నదని మండిపడ్డారు. ప్రజాకూటమిలోని కొంతమంది నేతల అతివిశ్వాసం కొంపముంచిందన్నారు. ఓటమికి ఈవీఎంలను బూచిగా చూపడం సరికాదన్నారు. ఫలితాలు వచ్చినప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీ ఈవీఎంలపై తప్పు నెట్టడంలో అర్థం లేదన్నారు. అసలు కారణాలను సమీక్షించకుండా ఇతర కారణాలను విశ్లేషణ చేయడం వల్ల లాభం లేదన్నారు. తాను కేసీఆర్‌తో పదేండ్లపాటు కలిసి పనిచేశానని, కేసీఆర్ ప్రచారశైలి గురించి ఎన్నోసార్లు కూటమి పార్టీ నేతలకు హెచ్చరించినా ఉత్తమ్, ఎల్.రమణ వినిపించుకోలేదన్నారు. 'కేసీఆర్ ఎన్నికల ప్రచార సరళి ఎలా ఉంటుందో నాకు తెలుసు' అని చెప్పినా వినిపించుకోలేదని పైగా రకరకాల కామెంట్స్ చేశారని వ్యాఖ్యానించారు. కూటమి భాగస్వామ పక్షాలు ఓటమికి గల కారణాలను జన సమితి విశ్లేషణ చేస్తున్నదన్నారు. రాజకీయపరమైన వైఫల్యాలను చర్చించకుండా సమీక్షలు జరపడం సరికాదన్నారు. సీట్ల సర్దుబాటు త్వరగా తేల్చండి అని తాను ఎంత చెప్పినా వినిపించుకోలేదన్నారు. నెలకు పైగా సమయం ఉంటే తప్ప కేసీఆర్‌ను ఎదుర్కోలేమని చెప్పానని, అయినా ఆలస్యం చేశారన్నారు. పైగా ప్రచారానికి 'మూడు వారాలు చాలు' అని ఉత్తమ్ అన్నారని, అంతెందుకు రెండు వారాలు చాలు అని టిడిపి నేతలు అన్నారని వివరించారు. ఇంటింటి ప్రచారం అనేది జరగలేదని, కేవలం సభలు, సమావేశాలతోనే పుణ్యకాలం గడిచిపోయిందన్నారు. దీంతో ప్రచారానికి సమయం సరిపోక జనాల్లోకి వెళ్లలేకపోయామన్నారు. కూటమి ఎజెండా, మ్యానిఫెస్టో బాగానే ఉన్నా... ప్రజల్లోకి తీసుకెళ్లడంలో విఫలమయ్యామన్నారు. 'ప్రచారంలో ఎవరు ఎక్కడ పాల్గొనాలి' అనేదానిపైనా అంచనాకు రాలేకపోయామని తెలిపారు. ముఖ్యమైన నేతలను కూడా రాహుల్ సభల్లో ప్రసంగాలు చేయించడం వరకే పరిమితం చేశారని అన్నారు. సీట్ల సర్దుబాటులో ఆలస్యం చేయడం వల్ల కూడా నష్టం జరిగిందన్నారు. టీఆర్‌ఎస్ కుటుంబ పాలనను, కేసీఆర్ వైఫల్యాలను ఎన్నికల ప్రచారంలో సరైన రీతిలో ప్రజల్లోకి తీసుకెళ్లలేకపోయామన్నారు. కేసీఆర్ రాజకీయ చతురతను అంచనా వేసి ఎదుర్కోవడంలో విఫలమయ్యామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నుంచి రాజ్యసభ సీటు ఆఫర్ ఇచ్చినట్టు వచ్చిన వార్తల్లో ఏమాత్రం నిజం లేదన్నారు. ఆ దిశగా తమ మధ్య చర్చలు కూడా జరగలేదన్నారు. అయితే రాష్ట్రంలో ప్రజా కూటమి కొనసాగుతుందని వెల్లడించారు. రానున్న పార్లమెంటు ఎన్నికలపై త్వరలోనే సమావేశమై చర్చిస్తామని వివరించారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ కూటమి దిశగా సాగుతున్నందున ఇక్కడ కూడా కూటమి ఉండే అవకాశమే ఉందన్నారు.



ఫైల్

ఫెడరల్ ఫ్రంట్ సాధ్యం కాదు

కేసీఆర్ తెర మీదకు తెచ్చి హడావిడి చేస్తున్న ఫెడరల్ ఫ్రంట్ అనేది సాధ్యం కాదని అన్నారు. అయితే ఫెడరల్ ఫ్రంట్ రెండు కారణాల ద్వారా సక్సెస్ అయ్యే అవకాశముందన్నారు. ఒకటి దేశాన్ని ప్రభావితం చేసేలా సమస్యలను లేవనెత్తాలి లేదా నాలుగైదు రాష్ట్రాలు కలిపి తమ సమస్యలను లేవనెత్తాలని వ్యాఖ్యానించారు. కానీ కేసీఆర్ ఇంతవరకు ఆ ప్రధాన సమస్యను గుర్తించలేదన్నారు. కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్ వెనక ఎవరున్నారో భవిష్యత్తులో తెలుస్తుందన్నారు.

'కుల' హత్యలను సీరియస్‌గా తీసుకోండి

- నిందితులకు కచ్చితంగా శిక్ష పడేలా చర్యలు చేపట్టాలి : సీపీలు, ఎస్పీలకు డీజీపీ కార్యాలయం నుంచి ఆదేశాలు

నవ తెలంగాణ- ప్రత్యేక ప్రతినిధి



రాష్ట్రంలో కుల దురహంకార హత్యలను సీరియస్‌గా పరిగణించిన డీజీపీ మహేందర్‌రెడ్డి ఇక ముందు అలాంటివి జరగకుండా చర్యలు తీసుకోవడంపై దృష్టి సారించారు. గత రెండేండ్లలో ప్రేమించి కులాంతర వివాహం చేసుకున్న వారిపై వారి పెద్దలు కత్తిగట్టి దారుణంగా హత్యలు చేస్తుండటం ఆందోళనకర పరిణామంగా మారింది. సోమవారం ఒక పక్క డీజీపీ 2018 సంవత్సరం రాష్ట్రంలో శాంతి భద్రతలు, నేరాలపై వార్షిక నివేదికను ఇచ్చిన రోజున కూడా శివార్లలోని అల్వాల్ పోలీసుస్టేషన్ పరిధిలో కుల దురహంకార హత్య చోటు చేసుకుంది. ఇప్పటికే నల్లగొండ, జగిత్యాల, భువనగిరి, మిర్యాలగుడ, వికారాబాద్ మొదలైన జిల్లాల్లో ఒక దాని వెనుక మరొకటిగా పరువు హత్యలు చోటు చేసుకోవడం, కొన్ని హత్యలను కిరాయి హంతకులను రంగంలోకి దింపి మరీ హత్యలు చేయిస్తున్న ఘటనలు ఒకవైపు.. మరోవైపు నేరుగా వారి తండ్రి, అన్నలే పూనుకుని హత్యలు చేయడం వంటి ఘటనలు పోలీసు ఉన్నతాధికారులను సైతం ఆందోళనకు గురి చేస్తున్నాయి. కరడుగట్టిన నేరస్తులు మొదలుకుని సాధారణ నేరగాళ్లను సైతం పసిగట్టి పట్టుకోవడానికి కొన్ని ఆధారాలు దొరుకుతున్నాయి, కానీ కుల దురహంకార హత్యలకు పాల్పడుతున్న వారిని ముందుగానే గుర్తించి ఘాతుకాలను నివారించడానికి ముందస్తుగా ఎలాంటి సమాచారమూ లభించడం లేదని దాంతో ఈ ఘటనలు జరుగుతున్నాయని అధికారులు చెబుతున్నారు. ఎటువంటి నేరాలకు పాల్పడని వారు సైతం ఇలాంటి ఘాతుకాలకు పాల్పడటం కూడా పోలీసు అధికారులను విస్మయానికి గురి చేస్తున్నది. అయితే కుల దురహంకారంతో రగిలిపోతున్న వారి ముందు కరడుగట్టిన నేరస్తులు సైతం బలాదూర్ అనేలా పరువు హత్యలు జరుగుతున్నాయని వారు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో కమ్యూనిటీ పోలీసింగ్ వ్యవస్థను మరింతగా పటిష్ట పరచడం ద్వారా ఆయా బస్తీలు, కాలనీలు, గ్రామాలలో స్థానికంగా ఏర్పడుతున్న ఈ విష సంస్కృతిని అరికట్టడానికి వీలవుతుందని డీజీపీ భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో పోలీసుస్టేషన్‌ల వారీగా కులదురహంకార పరువు హత్యల గురించి అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించాలని నగర సీపీలు, జిల్లాల ఎస్పీలకు అంతర్గత ఆదేశాలు డీజీపీ కార్యాలయం నుంచి వెళ్లినట్టు తెలిసింది. ఇలాంటి క్రూర చర్యలకు పాల్పడ్డ నిందితులకు ఖచ్చితంగా శిక్షలు పడేలా గట్టి ఆధారాలను సేకరించాలని, దర్యాప్తులో ఎక్కడా నిర్లిప్తం కూడదని కూడా పేర్కొన్నట్టు తెలిసింది. ఘటన జరిగితే దానిపై స్థానిక పోలీసులపైనే భారం వేయకుండా జిల్లా, నగర ఉన్నతాధికారులు సైతం రంగంలోకి దిగి సమర్థవంతమంగా దర్యాప్తు సాగేలా చూడాలని కూడా అధికారులకు ఆదేశాలు వెళ్లినట్టు సమాచారం.

పది లక్షల గృహాలు ఇంకా అంధకారంలోనే..

లక్ష్యానికి సుదూరంగా 'అందరికీ విద్యుత్తు' పథకం



న్యూఢిల్లీ: తాము అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలోని గృహాలన్నింటికీ విద్యుత్తు సౌకర్యం కల్పించామని గత కొన్ని రోజులుగా ప్రధాని మోడీతో పాటు ఆయన సహచర మంత్రులందరూ ప్రచారం చేసుకుంటున్నారు. కానీ, మోడీ సర్కారు చేపట్టిన 'అందరికీ విద్యుత్తు' పథకం లక్ష్యానికి సుదూరంగా నిలుస్తోంది. గతేడాది డిసెంబర్ 31 నాటికే దేశంలోని అన్ని గృహాలకు విద్యుత్తు అందిస్తామని బీజేపీ సర్కారు హామీ ఇచ్చింది. కానీ, నేటికీ విద్యుత్తు సదుపాయం అందుబాటులో లేని కుటుంబాలు నాలుగు రాష్ట్రాలలో 10 లక్షల 50 వేల (1.05 మిలియన్లు)కు పైనే ఉన్నాయి. ఈ విషయాన్ని స్వయంగా కేంద్ర ప్రభుత్వమే వెల్లడించడం గమనార్హం. మోడీ సర్కారు 'ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో' సోమవారం విడుదల చేసిన నివేదికలో ఈ విషయం రూఢీ అయ్యింది.

2014లో అధికారం చేపట్టాక 2019 జనవరి 1 నాటికి దేశంలోని ప్రతీ ఇంటికి విద్యుత్తు సదుపాయం కల్పిస్తామని మోడీ సర్కారు హామీ ఇచ్చింది. ఈ స్కీంను పూర్తి చేయడానికి గతేడాది డిసెంబర్ 31ని టార్గెట్‌గా నిర్ణయించింది. కానీ.. ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, అసోం, మేఘాల యాలలో మాత్రం ఈ పథకం లక్ష్యాన్ని చేరుకోలేదు. ఉత్తరప్రదేశ్‌లో కూడా ఇది ఇంకా పూర్తి స్థాయిలో అమలుకాలేదు. అందరికీ విద్యుత్తును అందుబాటులోకి తీసుకొచ్చిన తర్వాత ఈ ఏడాది మార్చి 31 నాటికి అంతరాయం లేని నాణ్యమైన కరెంటును అందరికీ సరఫరా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ, ఈ పథకంలో ఇప్పటికీ మొదటి లక్ష్యాన్ని కూడా చేరుకోలేకపోవడం ప్రస్తావనార్హం. ఇప్పటికే యువతకు ఉద్యోగా లు, రైతుల ఆదాయం రెట్టింపుతో పాటు పలు హామీలను నెరవేరుస్తా మని హామీ ఇచ్చిన మోడీ సర్కారు.. వాటిని గాలికొదిలి ఇంటా బయటా విమర్శలు ఎదుర్కొంటోంది. కాగా, మరికొద్ది రోజుల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అందరికీ విద్యుత్తు పథకం కూడా బీజేపీ సర్కా రుపై ప్రభావం చూపనుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

బడ్జెట్ లక్ష్యాలను చేరడంలో రాష్ట్రాలు విఫలం

- విద్య, ఆరోగ్యంపై నిర్లక్ష్యం
- అట్టడుగులో బీహార్, యూపీ : తాజా నివేదికలో వెల్లడి



ఫైల్

న్యూఢిల్లీ: బడ్జెట్ లక్ష్యాలను చేరుకోవడంలో రాష్ట్రాలు విఫలమవుతున్నాయి. కీలకమైన విద్య, ఆరోగ్యం వంటి రంగాల్లో తక్కువ వ్యయంతో పలు రాష్ట్రాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయి. ఈ విషయం పీఆర్‌ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ విడుదల చేసిన తాజా నివేదికలో వెల్లడైంది. 2015-19 మధ్య కీలక రంగాలైన విద్యపై రాష్ట్రాలు చేసిన వ్యయం 1.3శాతానికి తగ్గింది. అదేవిధంగా మరోముఖ్య రంగమైన ఆరోగ్యంపై రాష్ట్రాల వ్యయం 0.3శాతం మాత్రమే పెరగడం గమనార్హం. 2011-19 మధ్య దేశంలోని 26 రాష్ట్రాల బడ్జెట్ వ్యయాలను విశ్లేషించి తాజా నివేదికను తయారు చేశారు. ఈ నివేదిక ప్రకారం.. 2011-17 మధ్య రాష్ట్రాలు బడ్జెట్‌లో కేటాయించిన మొత్తం కంటే తక్కువగా ఖర్చు చేశాయి. పైన తెలిపిన సమయంలో అది నాలుగు నుంచి 11 శాతానికి పెరిగింది. అంటే ఒక పక్క అంచనా వ్యయాలు, వాస్తవ బడ్జెట్ వ్యయం లెక్కలు పెరిగిపోగా.. మరోపక్క, బడ్జెట్ లక్ష్యాలను రాష్ట్రాలు చేరేకోలేదు.

అలాగే 2011-17 మధ్య పట్టణాభివృద్ధిపై రాష్ట్రాలు కేటాయించిన బడ్జెట్‌లో కంటే 26శాతం తక్కువగా ఖర్చు చేశాయి. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాల సంక్షేమంపై 16శాతం, గ్రామీణాభివృద్ధిపై 15శాతం, నీటి పారుదల రంగంపై 14 శాతం, గృహనిర్మాణాలపై 12శాతం, వ్యవసాయంపై 10 శాతం, ఆరోగ్యంపై 10శాతం, విద్యపై తొమ్మిది శాతం, నీటి సరఫర, శానిటేషన్‌పై ఆరుశాతం తక్కువగా ఖర్చు చేశాయి.

విద్యపై

2011-15 మధ్యకాలంలో రాష్ట్రాలు విద్యపై సగటున 17.3శాతం ఖర్చు చేశాయి. ఇది 1.3శాతం తగ్గింది. ఇందులో సర్వశిక్ష అభియాన్, మధ్యాహ్న భోజన పథకం, పాఠశాల బిల్డింగ్‌ల నిర్మాణం, నిర్వహణ, జీతాలు, పెన్షనల చెల్లింపులు వంటివి విద్యపై చేసిన ఖర్చులో ఉన్నాయి. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ లెక్కల ప్రకారం.. రాష్ట్రాలు సగటున ఒక్కో వ్యక్తిపై(ఆరు నుంచి 23 ఏండ్ల మధ్య వయస్సు) చేసిన ఖర్చు రూ. 6,471గా ఉన్నది. విద్యపై తలసరి ఖర్చు విషయంలో బీజేపీ, ఎన్డీయే పాలిత రాష్ట్రాలు వెనుకంజలో ఉన్నాయి. ఈ జాబితాలో బీహార్ (రూ.3,821), జార్ఖండ్(రూ.4,327), యూపీ(రూ.3,821) లు ఉన్నాయి.

ఆరోగ్యంపై

ఆరోగ్యంపై రాష్ట్రాలు సగటు వ్యయం స్వల్పంగా పెరిగింది. 2011-15 మధ్య 4.1శాతంగా ఉండగా అది 2015-19 మధ్య 4.4శాతానికి చేరింది. ఇందులో జాతీయ ఆరోగ్య పథకం, ఆస్పత్రుల నిర్మాణం, నిర్వహణ, జీతాలు, పెన్షన్ల చెల్లింపులు వంటివి ఉన్నాయి. ఆరోగ్యంపై రాష్ట్రాల తలసరి ఖర్చు సగటున రూ. 785గా ఉంది. ఇందులోనూ బీజేపీ, ఎన్డీయే పాలిత రాష్ట్రాలైన బీహార్(రూ.381), యూపీ(రూ.459) అట్టడుగు స్థానంలో ఉన్నాయి. కాగా, సిక్కిం తలసరి వ్యయం రూ.4,480తో ముందుస్థానంలో ఉన్నది.

‘మాట నిలుపుకోకపోతే...!

మా దారి మాది...!!

అమెరికాకు కిమ్ హెచ్చరిక

సియోల్: ప్రపంచదేశాల ముందు అమెరికా మాకు ఇచ్చిన మాటను నిలుపుకోపోతే... మా దేశ ప్రయోజనాల పరిరక్షణకు మా దారి మేం చూసుకుంటాం’ అంటూ ఉ.కొరియా అధినేత కిమ్‌జోంగ్ ఉన్ అమెరికాను హెచ్చరించారు. మంగళవారం ఆయన తమ దేశ ప్రజలనుద్దేశించి చేసిన నూతన సంవత్సర సందేశం ప్రసంగంలో ‘అమెరికా ఇంకా మా దేశంపై ఆంక్షలతో వత్తిడి పెంచాలని చూస్తే.. మా దారి మేం చూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది’ అని స్పష్టం చేశారు. అంతర్జాతీయ సమాజం స్వాగతించే సత్ఫలితాలను రాబట్టటం కోసం తాను ట్రంప్‌తో ఎక్కడైనా, ఎప్పుడైనా భేటీ కావటానికి సిద్ధంగా ఉన్నానని ఆయన చెప్పారు. తమ దేశంపై అమలు చేస్తున్న ఆంక్షల నుండి సత్వర విముక్తి కల్పించాలని డిమాండ్ చేస్తున్న ఉ.కొరియా, కొరియా అణు నిరాయుధీకరణపై అమెరికా వైఖరి గ్యాంగ్‌స్టర్‌లను తలపిస్తోందని వ్యాఖ్యానించింది. అయితే అమెరికా మాత్రం కొరియాలో స్పష్టమైన పూర్తి స్థాయి అణు నిరాయుధీకరణ పూర్తయ్యే వరకూ తాము ఆంక్షల వత్తిడి కొనసాగిస్తామని చెబుతోంది. ఈ నేపథ్యంలో ట్రంప్‌తో గత ఏడాది తన భేటీతో ప్రారంభమైన శాంతి చర్చల ప్రక్రియలో పురోగతి లేకపోవటం పట్ల కిమ్ తన ప్రసంగంలో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అమెరికా తమకు సానుకూలమైన చర్యలు తీసుకుంటుందన్న ఆశతోనే తాము అణ్వస్త్ర పరీక్షా కేంద్రాన్ని పేల్చివేయటంతో పాటు ఇతర చర్యలు తీసుకున్నామని, అయితే అమెరికా నుండి మాత్రం సానుకూల స్పందన కరువైందని ఆయన అన్నారు. తమ దేశంలో వున్న సోషలిస్టు ఆర్థిక వ్యవస్థను మెరుగుపర్చాలన్న తన లక్ష్యానికి అమెరికా అమలు చేస్తున్న ఆంక్షలు అడ్డంకిగా మారాయని ఆయన చెప్పారు. తాము ఇకపై అణ్వస్త్ర పరీక్షల నిర్వహణ, అణ్వస్త్ర వినియోగం, ఉత్పత్తి వంటి కార్యకలాపాలను పూర్తిగా నిలిపివేస్తామని ఆయన



ప్రకటించారు. అయితే అందుకు ప్రతిగా అమెరికా ‘తగిన చర్యలు’ తీసుకోవాలని కిమ్ పిలుపునిచ్చారు.

దోషిగా నమోదయినా రాజీనామా చేయను..!

- నెతన్యాహు స్పష్టీకరణ



జెరూసలేం: ప్రస్తుతం తనపై కొన సాగుతున్న అవినీతి కేసుల విచారణలో దోషిగా నిర్ధారణ అయినప్పటికీ తాను పదవికి రాజీనామా చేసే ప్రసక్తే లేదని ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెత న్యాహు స్పష్టం చేశారు. తనపై నేరాభియోగాలు నమోదు చేయాలని అటార్నీ జనరల్ కార్యాలయం సిఫార్సు చేస్తుందన్న అంశం నెతన్యాహును కలవర పెడుతోందని, అందువల్లే ఆయన రాజీనామాకు వెనుకంజ వేస్తున్నారని పరిశీలకులు చెబుతున్నారు. చట్ట నిబంధనల ప్రకారం విచారణ ప్రక్రియ కొనసాగుతున్న సమయంలో ప్రధాని తన పదవికి రాజీనామా చేయాల్సిన అవసరం లేదని ఆయన గుర్తు చేశారు. ఈ కేసులో తన వాదన కూడా విననంత వరకూ ఈ విచారణకు ముగింపు రాదన్నారు. అయితే నెతన్యాహు, ఆయన నేతృత్వంలోని లికుడ్ పార్టీ త్వరలో ఎన్నికలను ఎదుర్కోవాల్సి వుండటంతో ఆయనపై నేరాభియోగాలనమోదు ప్రక్రియను ఎన్నికల ఫలితాలు వెలువడే వరకూ అటార్నీ జనరల్ జాప్యం చేసే అవకాశం వుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. నెతన్యాహు, ఆయన భార్య అవినీతికి పాల్పడ్డారని తమ వద్ద తగినన్ని ఆధారాలున్నాయని ఇజ్రాయిలీ పోలీసులు చెబుతున్న విషయం తెలిసిందే.

ఆసియా వాణిజ్య ఒప్పందంపై భారత్‌తో చర్చలు

- ఆసక్తిచూపుతున్న చైనా



బీజింగ్: అమెరికాతో కొనసాగుతున్న వాణిజ్యపోరు నేపథ్యంలో కొత్త మార్కెట్ అవకాశాల కోసం అన్వేషిస్తున్న చైనా ఇప్పుడు భారత్‌పై దృష్టి సారించింది. ప్రాంతీయ సమగ్ర ఆర్థిక సహకార ఒప్పందం (ఆర్‌సీఈపీ) ఒప్పందం కుదుర్చుకునేందుకు భారత్‌తో చర్చలు జరిపే అంశంపై తమ దేశం ఆసక్తి చూపుతున్నట్టు చైనా ప్రభుత్వ వర్గాలు చెప్పాయి. ‘ఆసియా వాణిజ్య ఒప్పందం’ పేరుతో కుదుర్చుకునే ఈ ఒప్పందం ద్వారా 2019 చివరి నాటికి ఆసియాలోని 16 దేశాలతో వాణిజ్య బంధం బలోపేతం చేసుకోవాలని చైనా భావిస్తోందని ఈ వర్గాలు వివరించాయి. అయితే చైనా తయారీ వస్తువుల ప్రవాహంపై భారత్ వ్యక్తం చేస్తున్న ఆందోళన, తమ సాంకేతిక నిపుణుల కోసం ఇమిగ్రేషన్ నిబంధనలను సడలించాలంటూ చైనా చేస్తున్న డిమాండ్ ఈ ఒప్పందానికి అవరోధాలుగా నిలుస్తున్నాయని ఈ వర్గాలు చెబుతున్నాయి. ఆసియా వాణిజ్య ఒప్పందం ద్వారా ఈ ప్రాంత దేశాలపై తన ప్రభావాన్ని విస్తరించుకునేందుకు చైనా ప్రయత్నిస్తోందన్న అనుమానాలు కూడా ఈ ఒప్పందానికి అవరోధంగా మారుతోందని ఈ వర్గాలంటున్నాయి. ఆసియా ఒప్పందంపై చర్చల ప్రతిపాదనపై స్పందన కోరుతూ చైనా పంపిన సందేశానికి భారత విదేశాంగశాఖ వెంటనే స్పందించలేదు. ఈ ఒప్పందంపై ఈ నెల చివరిలో చర్చలు జరుగుతాయని తెలుస్తోంది. అయితే చైనాతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునే విషయంలో తమకు ఎదు రయ్యే సమస్యలపై భారత ప్రభుత్వం ఇప్పటికే ఒక జాబితాను రూపొందించింది.

మనిషి చూడని ఖగోళ రాశి!

- 640 కోట్ల కిలోమీటర్ల దూరంలో..



హూస్టన్: అమెరికా స్పేస్ ఏజెన్సీ నాసాకు చెందిన స్పేస్‌క్రాఫ్ట్ న్యూ హారిజాన్స్ ఇప్పటి వరకు మనిషి చూడని ఓ ఖగోళ రాశిని ఫొటోలు తీసింది. ఆ ఖగోళ రాశి పేరు అల్టిమా టూలీ. కొత్త ఏడాది ప్రారంభం రోజునే తమ స్పేస్‌క్రాఫ్ట్ సాధించిన ఈ ఘనతను నాసా బయటి ప్రపంచానికి వెల్లడించింది. భూమికి ఏకంగా 640 కోట్ల కిలోమీటర్లు.. సౌర కుటుంబంలో చివరిది, ఒకప్పుడు గ్రహం హోదా కలిగిన ప్లూటోకు 160 కోట్ల కిలోమీటర్ల దూరంలో.. క్యూపర్ బెల్ట్‌లో ఈ అద్భుతమైన ఖగోళ రాశి కనిపించింది. మేరీలాండ్‌లోని జాన్స్ హాప్‌కిన్స్ ఐప్లైడ్ ఫిజిక్స్ లేబొరేటరీ కాలమానం ప్రకారం 12:33 గంటలకు న్యూ హారిజాన్స్ ఈ ఖగోళ రాశి పక్కగా వెళ్లింది. ఇప్పటివరకు మనిషి పంపిన స్పేస్‌క్రాఫ్ట్‌లలో ప్లూటో వరకు వెళ్లడమే గొప్ప అనుకుంటే.. ఇప్పుడు దానికి కూడా ఎంతో దూరంలో క్యూపర్ బెల్ట్‌లో ఉన్న ఖగోళ రాశి కనిపించడం నాసా సాధించిన గొప్ప ఘనతగా చెబుతున్నారు. అల్టిమా టూలీ పక్కగా హారిజాన్స్ వెళ్లినప్పుడే సంబంధిత వీడియో చూడటం అసాధ్యం. ఎందుకంటే భూమి నుంచి స్పేస్‌క్రాఫ్ట్‌కు సిగ్నల్ వెళ్లడానికి ఆరు గంటలు, అక్కడి నుంచి భూమికి తిరిగి రావడానికి మరో ఆరు గంటల సమయం పడుతుంది.

దీంతో దాదాపు 12 గంటల తర్వాత ఈ ఫుటేజీ నాసాకు చేరింది. విశ్వంలో గంటకు 32 వేల మైళ్ల వేగంతో న్యూ హారిజాన్స్ దూసుకెళ్తున్నది. ఈ స్పీడులో ఆ స్పేస్‌క్రాఫ్ట్ అల్టిమా టూలీ ఉపరితలానికి 2200 మైళ్ల దగ్గరగా వెళ్లడం విశేషం. ఇది సౌర కుటుంబం మొదట్లో ఏర్పడిన ఖగోళ రాశి అని, దీనిని అధ్యయనం చేస్తే మిగతా గ్రహాల స్థితిగతులు తెలుసుకోవచ్చని నాసా సైంటిస్టు బ్రియాన్ మే చెప్పారు. అల్టిమా టూలీ పూర్తిగా గడ్డ కట్టిపోయి ఉందని ఆయన తెలిపారు. ఇది 12 నుంచి 20 మైళ్ల చుట్టుకొలతతో ఉన్నట్లు సైంటిస్టులు గుర్తించారు. దీనిని మొదట హబుల్ టెలిస్కోప్ 2014లో గుర్తించింది.

డిజిటల్ సంస్థలపై భారీ పన్నుపోటు..!

ఫ్రాన్స్ చొరవ...



పారిస్: ఇంటర్నెట్ ఆధారిత డిజిటల్ కార్యకలాపాలు నిర్వహించే టెక్నాలజీ సంస్థలపై భారీ పన్నుపోటును ఫ్రాన్స్ విధించింది. డిజిటల్ సంస్థలపై పన్ను విధింపు ప్రతిపాదనను అమలులోకి తెచ్చే అంశాన్ని ఐరోపా కూటమి (ఈయూ) పరిశీలిస్తున్న సమయంలో ఈయూ నిర్ణయం కోసం ఎదురు చూడకుండా తానే ముందు ఈ పన్నును అమలులోకి తెచ్చేందుకు ఫ్రాన్స్ చొరవచూపటం గమనార్హం. గాఫా టాక్స్ పేరుతో గూగుల్, యాపిల్, ఫేస్‌బుక్, అమెజాన్ తదితర ఇంటర్నెట్ దిగ్గజ సంస్థలపై విధించిన ఈ పన్ను మంగళవారం నుండి అమలులోకి వచ్చింది.

ఈ పన్ను ద్వారా దాదాపు 50 కోట్ల యూరోల ఆదాయాన్ని ఆశిస్తున్నట్లు ఫ్రాన్స్ ఆర్థిక ఆర్థిక మంత్రి బ్రూనో లీ మెయిర్‌చెప్పారు. ఈ పన్ను విధింపు విషయాన్ని ఫ్రాన్స్ సర్కారు గత నెలలోనే ప్రకటించిన విషయం తెలిసిందే. ఏది ఏమైనా ఈ పన్నును తాము అమలు చేసి తీరుతామని ఆయన అప్పట్లోనే స్పష్టం చేశారు. ఐరోపా కూటమి దేశాలలో టెక్నాలజీ సంస్థలపై పారదర్శక పన్ను విధానాన్ని అమలు చేయాలని ఫ్రాన్స్ గత కొంతకాలం నుంచి ఈయూపై వత్తిడి తెస్తోంది. అయితే ఈ అంశంపై కూటమి సభ్యదేశాలలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావటంతో ఈ ప్రక్రియపై ప్రతిష్టంభన ఏర్పడింది. ఈయూలో ఏ మార్పులు చేసినా వాటికి సభ్యదేశాలు ఏకగ్రీవంగా ఆమోద ముద్ర వేయాల్సి వుంటుంది. ఐరోపా దేశాలలో భారీయెత్తున ఆర్జిస్తున్న టెక్నాలజీ సంస్థలు తమ లాభాలను తక్కువ పన్ను విధించే దేశాలకు తరలించేందుకు ఆయా దేశాలలో ఉన్న విధానపరమైన సంక్లిష్టతలను ఉపయోగించుకుం టున్నాయన్న విమర్శలు ఇటీవలి కాలంలో వెల్లువెత్తుతున్నాయి. అయితే అమెరికాకు చెందిన ఈ టెక్నాలజీ సంస్థలపై పన్ను భారం పెంచితే అమెరికా తమపై ప్రతీకార పన్నుపోటుకు పాల్పడుతుందన్న భయాందోళనలను ఐర్లండ్ నేతృత్వంలోని కొన్ని దేశాల గ్రూపు వ్యక్తం చేస్తోంది. ఈ డిజిటల్ కంపెనీల ఆదాయంపై మూడు శాతం పన్ను విధించాలన్న ప్రతిపాదనపై ఈయూ సభ్యదేశాల మధ్య దీర్ఘకాలంగా చర్చ కొనసాగుతున్న విషయం తెలిసిందే. అయితే ఈ చర్చల్లో ఎటువంటి పురోగతి లేకపోవటంతో పన్ను విధింపు విషయంలో ఫ్రాన్స్ ముందస్తు చొరవ చూపటం విశేషం.

మహాకుంభమేళా.. భద్రత ఎలా?

అరవై శాతం కూడా పూర్తికాని ఐసీసీసీ పనులు.. మౌలిక సదుపాయాల ఏర్పాటు అంతంతమాత్రమే!

సాధువుల్లో పెరుగుతున్న ముఠా తగాదాలు.. పట్టించుకోని అధికారులు

- భక్తులు బస చేసే ఫంక్షన్ హాళ్లు, అతిథి గృహాలు, హొటళ్ళలో కానరాని భద్రతా ప్రమాణాలు
- తాగునీరు, వైద్యం, అగ్నిమాపక తదితర విభాగాల సమన్వయలేమి.. కంట్రోల్ సెంటర్ల అనుసంధానం అసంపూర్తి
- తాజ్ మహల్ సహా జౌనాపూర్, ప్రతాప్ ఘర్, మహొబా, ఖైమూర్, వారణాసి, కౌశంబి ప్రాంతాల్లో సెక్యూరిటీ నిల్
- ప్రయాగ్‌రాజ్ మహాకుంభమేళా ఏర్పాట్లపై ‘నవతెలంగాణ’ క్షేత్రస్థాయి పరిశీలన..





జై (ప్రయాగ్‌రాజ్ నుంచి)

పుష్కరకాలంలో ప్రతి నాలుగేండ్లకు ఒకసారి ఒక్కో ప్రాంతంలో.. పుష్కరం పూర్తయ్యాక మహాకుంభమేళా మహొత్సవంగా జరిగే అతిపెద్ద జనజాతరకు ఈ నెల 15న ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ (అలహాబాద్) వేదిక కానుంది. 45రోజుల పాటు జరిగే ప్రయాగ్‌రాజ్ కుంభమేళా, చుట్టుపక్కల పర్యాటక ప్రదేశాల్లో ప్రస్తుతం ఉన్న సెక్యూరిటీ వ్యవస్థపై ‘నవతెలంగాణ’ క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టింది.

ప్రణాళికలు సరే.. ఆచరణ ఉండాలి

సుమారు 45 కి.మీ విస్తీర్ణంతో వివిధ ప్రముఖ ఆధ్యాత్మిక ప్రాంతాలను కలుపుకొని జరిగే ఈ మహాకుంభమేళాను ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ) సాయంతో నిరంతరం 1407 హై డెఫినేషన్ సీసీ టీవీ కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తామని అధికారులు గతంలో ప్రకటించారు. ఐతే, ఆయా పనులు కనీసం అరవై శాతం కూడా పూర్తికాకపోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. 450 ఏండ్లలో ఎన్నడూ లేనివిధంగా ‘అక్షయవాట్’, ‘సరస్వతి కూప్’లో కూడా పూజలు చేసుకునే అవకాశాన్ని ఈసారి కల్పిస్తున్నామని యూపీ సర్కారు గర్వంగా ప్రకటించుకున్నప్పటికీ, ఆయా ప్రాంతాల్లో భద్రత, మౌలిక సౌకర్యాలు ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. మేళాకు హాజరయ్యే సన్యాసులు, భక్తులు గుర్తింపు కార్డులను తీసుకురావాలని, వారి వివరాలు నమోదు చేసేం దుకు రిజిస్టర్లు సిద్ధం చేశామని అధికారులు చెబుతున్నా.. పదిహేను కోట్ల మంది ప్రజల వివరాలను నమోదు చేసుకునే సిబ్బంది, వ్యవస్థ ఇంకా సిద్ధం కాలేదు. ఇక, కుంభమేళా సమయంలో ప్రయాగ్ రాజ్ నగరంలోని ఫంక్షన్ హాళ్లు, అతిథి గృహాలు, హొటళ్ళు, వివిధ గార్డెన్స్ కు ఎక్కువ డిమాండ్ ఉంటుందని.. కాబట్టి, కుంభమేళా రోజుల్లో హాల్స్‌ను శుభకార్యాలు, సెలబ్రేషన్స్, పెండ్లిండ్లకు అద్దెకు ఇవ్వకూడదని అధికారులు ఆయా హాల్స్ యాజమానులకు నోటీసుల్లో సూచించారు. లక్షల సంఖ్యలో భక్తులు రానున్న దృష్ట్యా వారికి ఫంక్షన్ హాళ్లు, అతిథి గ హాల్లో బస ఏర్పాటు చేసేందుకే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసు కున్నట్టు సమాచారం. ఐతే, ఆయా హాల్స్ లో కనీస సౌక ర్యాలు, భద్రతా ప్రమా ణాలు, సీసీ టీవీ కెమెరాల పనితీరు తీసికట్టుగా ఉన్నదన్న విషయం క్షేత్రస్థాయి పరిశీలన చేస్తేగానీ తెలియరాలేదు. కుంభమేళాకు వచ్చే భక్తులు, పర్యాటకులు విమాన, రహదారి, నదుల ద్వారా ప్రయా ణించి వచ్చేలా మొదటిసారి ఏర్పాట్లు చేస్తున్నట్టు అధి కారులు పేర్కొన్నప్పటికీ, నదీ మార్గాల్లో వచ్చే భక్తులకు అను కోని ప్రమాదాలు జరిగితే, వెంటనే స్పందించేందుకు అవసర మైన క్రూ సిబ్బంది, గతంలో చెప్పినట్టు 1100 లైఫ్ గార్డుల నియామకం ఇంకా తుదిరూపునకు రాలేదు. తాగు నీరు, వైద్యం, అగ్నిమాపక తదితర విభాగాల సమన్వయం, కంట్రోల్ సెంటర్ల అనుసంధానం వగైరా ఇంకా పూర్తి కాలేదు.

మరికొన్ని నిజాలు

- కుంభమేళాలో భాగంగా గంగా నదిని పరిశుభ్రంగా ఉంచే లక్ష్యంతో కాన్పూర్‌లోని తోళ్ల పరిశ్రమలను గత డిసెంబరు 15 నుంచి ఈ ఏడాది మార్చి 15 వరకూ మూసివేయాలని యోగి సర్కార్ ఇప్పటికే ఆదేశించింది. అయితే, ఈ నిర్ణయం మూలంగా పరిశ్రమకు సుమారు రూ.12వేల కోట్ల మేర నష్టం వాటిల్లనున్నట్టు, దాదాపు మూడు లక్షల మంది కార్మికులు ఇప్పటికే వీధిన పడట్టు సమాచారం.
- శాకాహారులు, మద్యం సేవించని, సిగరెట్ తాగే అలవాటు లేని, మర్యాదపూర్వకంగా వ్యవహరించే పోలీసులను మాత్రమే కుంభమేళాలో విధుల్లో నియమించాలని అధికారులు నిర్ణయించారు.
- ప్రయాగ్‌రాజ్ కుంభమేళాకు 25లక్షల మంది విదేశీయులు రానున్నట్టు భావిస్తున్న తరుణంలో.. వాళ్లకు 4వేల లగ్జరీ టెంట్లు, సూట్లను ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో టీవీ సెట్లు, వైఫై, లగ్జరీ టాయ్ లెట్, డబుల్ బెడ్రూం ఇతరత్రా సదుపాయాలు ఉండనున్నాయి.

పర్యాటక ప్రాంతాలు సురక్షితమా...!

కుంభమేళా నిర్వహణకు యూపీ ప్రభుత్వం రూ.5వేల కోట్లతో భారీ ఏర్పాట్లు చేస్తున్నదని, 71 దేశాలకు చెందిన రాయబారులు, 192 దేశాలకు చెందిన ప్రతినిధులు, 25లక్షల మంది విదేశీయులు కుంభ్‌ను సందర్శించనున్నారని అధికారులు చెబుతున్నారు. ఐతే, ప్రయాగ్ రాజ్ కుంభమేళా మరియు దగ్గరలోని పర్యాటక ప్రదేశాలపై తీవ్రవాదులు దాడులు జరిపే అవకాశాలు లేకపోలేదని పలువురు అనుమానిస్తున్నారు. యూపీకి చెందిన యాంటి టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్) సైతం ఇదే అనుమానాన్ని వ్యక్తపరచడం ప్రస్తావనార్హం. కుంభమేళా సెక్యూరిటీతో పాటు ప్రయాగ్ రాజ్ కు దగ్గరలోని జౌనాపూర్, ప్రతాప్ ఘర్, మహొబా, ఖైమూర్, వారణాసి, కౌశంబి, ఫైజాబాద్, అయోధ్య తదితర పర్యాటక ప్రాంతాల్లో భద్రతా



ప్రమాణాలు ఆశించిన స్థాయిలో లేవు. కుంభమేళాకు వచ్చిన ప్రతీ ముగ్గురిలో ఒకరు తప్పక దర్శించాలనుకునే.. ప్రపంచంలోని ఏడు వింతల్లో ఒకటైన తాజ్ మహల్ భద్రత సైతం ప్రశ్నార్థకంగా మారడం విస్మయాన్ని కలిగిస్తోంది. తాజ్ మహల్ భద్రత కోసం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో 65శాతం వరకు సక్రమంగా పనిచేయట్లేదు. ఇదే విషయాన్ని తాజ్ మహల్ సెక్యూరీటి అధికారి మోసిన్ ఖాన్ వద్ద ప్రస్తావిస్తే, త్వరలో సీసీ కెమెరాలు బాగు చేయిస్తామని ‘నవతెలంగాణ’ ప్రతినిధులతో ఆయన చెప్పారు. ఇక, ప్రయాగ్‌రాజ్‌లో కుంభమేళా నిర్వహణలో కీలక పాత్ర నిర్వహించే సాధువుల్లో ముఠా తగాదాలు రోజురోజుకూ ఎక్కువవుతున్నట్టు పరిశీలనలో తేలింది. అధికారులు దీనిపై పెద్దగా ద ష్టి కేంద్రీకరించకపోవడం గమనార్హం.

యాకేష్ దైదకు డాక్టరేట్

- ‘తుది దశ తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టు పాత్ర’పై పరిశోధన

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్




(ఫైల్)

తుది దశ తెలంగాణ ఉద్య మంలో జర్నలిస్టు పాత్ర అనే అం శంపై పరిశోధన చేసినందుకు యాకేష్ దైద డాక్టరేట్ (పీహచ్‌డీ) సాధించారు. తెలుగు యూనివర్సిటీ జర్నలిజం విభాగం నుంచి ప్రొఫె సర్ వి సత్తిరెడ్డి పర్యవేక్షణలో ఆయన పరిశోధన పూర్తి చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నెల్లికుదురు గ్రామంలో, ఒక దళిత కుటుంబంలో జన్మించిన ఆయన ఇంట ర్మీడియట్ అక్కడే చదివారు. డిగ్రీ, పీజీ యూనివర్సిటీలో చదివారు. చదు వుతున్న సమయంలోనే ఆయన క్యాంపస్ ఇంటర్వ్యూలో ఈటీవీ ప్రొడక్షన్ విభాగంలో ఎంపికయ్యారు. తదనంతరం ఆయన ఈటీవీ, టీవీ9, ఎన్‌టీవీ వంటి పలు మీడియా సంస్థల్లో న్యూస్ ప్రొడ్యూసర్‌గా ఉద్యోగం చేశారు. అదే సమయంలో అంబేద్కర్ యూనివర్సిటీ ఎడ్యూకేషన్ మీడి యా విభాగంలో ఉద్యోగం చేస్తూనే ఆయన పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన ఇప్పటి వరకు తెలంగాణ మీద అనేక పరిశోధనలు, సిద్ధాంత వ్యాసాలు సమర్పించినప్పటికి ఆయా దశల్లో ఎంతో కీలకమైన జర్నలిస్టుల పాత్రపై ఎవరు దృష్టి సారించనందున, ఈ అంశాన్ని ఎంపిక చేసుకున్నట్టు ‘నవతెలంగాణ’కు తెలిపారు. ఈ పరిశోధన పత్రం ఫలితాల వల్ల జర్నలిస్టులకు, భావిపరిశోధకులకు, నా పరిశోధన ప్రయోజ నకరంగా ఉండాలనే, నా సంకల్పానికి అండగా నిల్చి సమాచా రాన్ని అం దించిన పత్రిక సంపాదకులకు, గురువులకు, జర్నలిస్టు మిత్రులకు, సామా జిక విద్యావేత్తలకు, మిత్రులకు, కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

బీజేపీ, టీఆర్‌ఎస్‌లను మట్టి కరిపిస్తాం

- ఆదివాసీ విభాగం ఆలిండియా ఉపాధ్యక్షుడు తేజావత్ బెల్లయ్యనాయక్



నవతెలంగాణ– మహబూబాబాద్

స్థానిక సంస్థలు, పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, టీఆర్‌ఎస్‌లను మట్టి కరిపిస్తామని కాంగ్రెస్ పార్టీ ఆదివాసీ విభాగం ఆలిండియా ఉపాధ్యక్షుడు తేజావత్ బెల్లయ్యనాయక్ దీమా వ్యక్తం చేశారు. మహబూబాబాద్ జిల్లాలోని ఆయన క్యాంపు కార్యాలయంలో మంగళవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. గత శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓటికి కొంత సమన్వయ లోపం, ప్రచార లోపమే కారణమన్నారు. ప్రస్తుతం అందరినీ సమన్వయం చేసుకుని మెజారిటీ గ్రామపంచాయతీలు, మానుకోట పార్లమెంట్ స్థానం దక్కించుకుంటామన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయినంత మాత్రాన వెనక్కి తగ్గేది లేదన్నారు. దేశంలో ప్రత్యామ్నాయ రాజకీయాలకు కాంగ్రెస్ విధానాలే పరిష్కారమన్నారు. ప్రధాని మోడీ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని విమర్శించారు. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ మూలంగా దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలైందన్నారు. పారిశ్రామికాభివృద్ధి అటకెక్కిందన్నారు. సన్న, చిన్నకారు రైతులకు, చిరు వ్యాపారులకు మోడీ విధానాలతో రుణాలందట్లేదని అన్నారు. బ్యాంకులు దివాలా తీయడానికి కేంద్ర ప్రభుత్వ విధానాలే కారణమని విమర్శించారు. రాష్ట్రంలో టీఆర్‌ఎస్ నియంతృత్వ పాలన సాగిస్తోందన్నారు. గిరిజనులను మోసం చేసిన కేసీఆర్‌కు రానున్న పంచాయతీ, పార్లమెంట్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. విలేకర్ల సమావేశంలో నాయకులు జిన్నారెడ్డి వెంకటేశ్వర్లు, ఎండీ సలీం కొమ్మారెడ్డి పొదిలి నరసింహారెడ్డి, గుగ్గిళ్ల పీరయ్య, హరిలాల్, శశివర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

సంక్రాంతి సందడికి రెడీ అవుతున్నాయ్


'ఎన్టీఆర్ -కథానాయకుడు' చిత్రంలో బాలకృష్ణ, విద్యాబాలన్


'ఎఫ్ 2'లో వెంకటేష్, తమన్నా, వరుణ్‌తేజ్, మెహరీన్


'వినయ విధేయ రామ' చిత్రంలో కైరా అద్వానీ, రామ్‌చరణ్

ఈ నూతన సంవత్సరంలోనూ సంక్రాంతి పండుగ నేపథ్యంలో పలు చిత్రాలు ప్రేక్షకుల ముందుకొచ్చి సందడి చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నాయి. ప్రతి ఏటా రెండు, మూడు సినిమాలు ఈ పండుగని పురస్కరించుకుని విడుదలైనట్టే ఈ ఏడాది కూడా పలు భారీ చిత్రాలు పోటీ పడుతున్నాయి. ఆడియెన్స్‌కి కావాల్సిన ఆనందాన్ని ఇవ్వడానికి సమాయత్తమవుతున్నాయి.

ఈ ఏడాది సంక్రాంతి పండుగ నేపథ్యంలో సందడి చేయబోతున్న సినిమాల్లో 'ఎన్టీఆర్' బయోపిక్, 'వినయ విధేయ రామ', 'ఎఫ్2' ఉన్నాయి. ఇందులో మొదట ఎన్టీఆర్ బయోపిక్ ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. నందమూరి తారక రామారావు జీవితం ఆధారంగా రూపొందుతున్న చిత్రమిది. క్రిష్ దర్శకత్వం వహించగా, ఎన్టీఆర్‌గా బాలకృష్ణ నటిస్తున్నారు. బసవతారకంగా విద్యాబాలన్, చంద్రబాబు నాయుడుగా రానా, హరికృష్ణగా కళ్యాణ్‌రామ్, ఏఎన్నార్‌గా సుమంత్, సావిత్రి పాత్రలో నిత్యామీనన్, శ్రీదేవిగా రకుల్ ప్రీత్ సింగ్, జయసుధగా పాయల్ రాజ్‌పుత్, జయప్రదగా హన్సిక నటిస్తున్నారు. బాలకృష్ణ నిర్మిస్తున్న ఈ చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుంది. ఇందులో 'ఎన్టీఆర్ -కథానాయకుడు' ఈ నెల 9న విడుదల కానుంది. సావిత్రి బయోపిక్ 'మహానటి' తర్వాత వస్తున్న మరో ప్రతిష్టాత్మక బయోపిక్ కావడం, లెజెండరీ నటుడు, మాజీ సీఎం ఎన్టీఆర్ జీవితం ఆధారంగా రూపొందిన సినిమా కావడంతో దీనిపై సినిమాకి అతీతంగా అందరిలోనూ విపరీతమైన ఆసక్తి నెలకొంది. దీనికితోడు భారీ తారాగణం సినిమాపై మరింత క్రేజ్ నెలకొనడానికి కారణమైంది.

సంక్రాంతి బరిలో మరో భారీ చిత్రం 'వినయ విధేయ రామ' ఉంది. రామ్‌చరణ్ హీరోగా బోయపాటి శ్రీను దర్శకతంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని డి.వి.వి ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై దానయ్య డి.వి.వి నిర్మిస్తున్నారు. కైరా అద్వానీ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో అర్యన్ రాజేష్, ప్రశాంత్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. వివేక్ ఒబెరాయ్ విలన్‌గా నటిస్తున్నారు. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రం ఈ నెల 11న విడుదల కానుంది. 'రంగస్థలం' వంటి బిగ్గెస్ట్ ఇండస్ట్రీ హిట్ అందుకున్న తర్వాత రామ్‌చరణ్ హీరోగా తెరకెక్కిన చిత్రం కావడం, మొదటిసారి మాస్ డైరెక్టర్ బోయపాటి దర్శకత్వంలో చరణ్ నటించడం వంటి కారణాల రీత్యా ఈ సినిమాపై కూడా భారీ అంచనాలున్నాయి. దీనికి తోడు ఈ చిత్రానికి సంబంధించి విడుదలైన ప్రచార చిత్రాలు, టీజర్లు, ట్రైలర్లు రామ్‌చరణ్ అభిమానుల్లోనే కాదు ప్రేక్షకుల్లోనూ మరింత క్యూరియాసిటీ పెంచింది. దీంతో ఈ సినిమా రాక కోసం అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

ఫన్ ఎంటర్‌టైనర్ 'ఎఫ్2' సైతం సందడి చేసేందుకు వస్తోంది. వెంకటేష్, వరుణ్ తేజ్ కలిసి నటిస్తున్న మల్టీస్టారర్ చిత్రమిది. అనిల్ రావిపూడి దర్శకత్వం వహించారు. తమన్నా, మెహరీన్ కథానాయికలుగా నటించారు. దిల్‌రాజు నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ నెల 12న విడుదల కానుంది. తొలిసారి వెంకటేష్, వరుణ్‌తేజ్ కలిసి నటించడం, భార్యాభర్తల విషయంలో నెలకొనే పరిస్థితులను ఆద్యంతం వినోదాత్మకంగా చూపించేందుకు ప్రయత్నం చేయడంతో ఈ సినిమాపైన కూడా అందరిలోనూ మంచి అంచనాలున్నాయి. ప్రేక్షకుల్ని ఫుల్‌గా ఎంటర్‌టైన్ చేసేందుకు ఈ సినిమా సైతం బరిలోకి దిగి అమీతుమీ తేల్చుకునేందుకు రెడీ అవుతోంది.

తమిళనాట కూడా భారీ సందడి..

ఈ ఏడాది సంక్రాంతికి కోలీవుడ్ కూడా భారీ సందడికి సిద్ధమవుతుంది. రెండు భారీ సినిమాలు పోటీ పడి మరీ ఆడియెన్స్‌ని అలరించబోతున్నాయి. అందులో ప్రధానంగా చెప్పుకోవాల్సింది రజనీకాంత్ నటిస్తున్న 'పేట'. గతేడాది చివర్లో '2.0'తో ఆకట్టుకున్న రజనీకాంత్ బ్యాక్ టు బ్యాక్ ప్రేక్షకుల్ని అలరించేందుకు వస్తున్నారు. కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో రూపొందిన 'పేట'లో రెండు భిన్న గెటప్స్‌లో రజనీకాంత్ కనిపించబోతున్నారు. ఆయన సరసన సిమ్రాన్, త్రిష తొలిసారి నటించడం విశేషం. వీరితోపాటు మేఘా ఆకాష్, విజయ్ సేతుపతి, నవాజుద్దీన్ సిద్ధిఖీ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. అనిరుథ్ సంగీతం అందిస్తున్నారు. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ సినిమా ఈ నెల 10న విడుదల కానుంది. ఈ సినిమా తమిళంతోపాటు తెలుగులోనూ విడుదలవుతూ 'ఎన్టీఆర్', 'వినయ విధేయ రామ', 'ఎఫ్2' సినిమాలకు గట్టి పోటీ ఇవ్వనుంది. ఎంటర్‌టైన్‌మెంట్ విషయంలో ఆడియెన్స్‌కి ఇది ఎక్స్‌ట్రా బోనస్ అనే చెప్పాలి.

దీంతోపాటు మరో మాస్ హీరో అజిత్ సినిమా 'విశ్వాసం' సంక్రాంతికి సందడి చేసేందుకు సిద్ధమవుతుంది. 'వీరం', 'వేదాళం', 'వివేగం' వంటి హ్యాట్రిక్ హిట్స్ తర్వాత శివ దర్శకత్వంలో అజిత్ నటిస్తున్న మరో యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రమిది. ఇందులో అజిత్ ద్విపాత్రాభినయం చేస్తున్నారు. నయనతార కథానాయికగా నటిస్తుంది. ఈ సినిమా ద్వారా ఈ నెల 10న ఆడియెన్స్‌కి డబుల్ ట్రీట్‌ని ఇచ్చేందుకు అజిత్ సిద్ధమవుతున్నాడు. ఈ సినిమా కూడా తెలుగులోనూ విడుదలయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరో చిన్న చిత్రం 'ఎల్‌కేజీ' కూడా సంక్రాంతి సందర్భంగానే 9న రిలీజ్ కాబోతుంది.


'పేట' చిత్రంలో రజనీకాంత్, త్రిష


'విశ్వాసం' చిత్రంలో నయనతార, అజిత్

బాలీవుడ్‌లో చిన్న చిత్రాల సందడి..


బాలీవుడ్‌లో సంక్రాంతి సందర్భంగా భారీ సినిమాల హడావుడి ఉండదు. అయినప్పటికీ పలు నోటెడ్ చిత్రాలు ఈ సంక్రాంతి సందర్భంగా ప్రేక్షకుల ముందుకొస్తున్నాయి. అందులో 'ది యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్', 'ఉరి', 'అమావాస్', 'బ్లాంక్', 'క్యాబరే', 'బాంబేరియా', 'రంగీలా రాజా' చిత్రాలున్నాయి. భారత ప్రధాని మన్మోహన్ సింగ్ జీవితం ఆధారంగా, ఆయన ప్రధాన మంత్రి అయ్యే సందర్భం ఇతివృత్తంగా విజయ్ రత్నాకర్ రూపొందిస్తున్న చిత్రం 'ది యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్'. ఇందులో ప్రధానిగా అనుపమ్ ఖేర్ నటిస్తున్నారు. ఈ సినిమా జనవరి 11న విడుదల కానుంది.

అంతకంటే ముందే రిచా చద్దా ప్రధాన పాత్రలో నటించిన 'క్యాబరే' సినిమా ఈ నెల 9న విడుదల కానుంది. ఇక భారత సైనిక స్థావరాలపై ఉగ్రవాదులు దాడి చేశారు. దీనికి ప్రతీకారంగా భారత సైనికులు పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలను నేలమట్టం చేశారు. ఈ కథాంశంతో 'ఉరి: ది సర్జికల్‌స్ట్రైక్' చిత్రాన్ని దర్శకుడు ఆదిత్య ధార్ రూపొందించారు. విక్కీ కౌశల్, పరేష్ రావళ్, యామి గౌతమ్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ సినిమా 11న రిలీజ్ కాబోతుంది.

అలాగే సచిన్‌జోషి, నర్గీస్ ఫక్రీ జంటగా నటించిన హర్రర్ థ్రిల్లర్ 'అమావాస్', సన్నీడియోల్ ప్రధానపాత్ర పోషించిన 'బ్లాంక్', రాధికా ఆప్టే నటించిన 'బాంబే రియా', గోవింద హీరోగా రూపొందిన 'రంగీలా రాజా' చిత్రాలు కూడా ఇదే రోజు ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి.

నవచిత్రం

1983 బ్యాక్‌డ్రాప్‌లో కల్కి


రాజశేఖర్

'గరుడవేగ' వంటి విజయవంతమైన సినిమా తర్వాత డా॥రాజశేఖర్ నటిస్తున్న నయా చిత్రం 'కల్కి'. ఆదాశర్మ, నందితా శ్వేత, స్కార్లెట్ విల్సన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో శివానీ శివాత్మిక మూవీస్ సమర్పణలో హ్యాపీ మూవీస్ పతాకంపై సి.కళ్యాణ్, శివానీ రాజశేఖర్, శివాత్మిక రాజశేఖర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను మంగళవారం విడుదల చేశారు. '1983 బ్యాక్‌డ్రాప్‌లో సాగే విభిన్న కథా చిత్రమిది. పవర్‌ఫుల్ రోల్స్‌తో తనకంటూ ఓ ప్రత్యేకమైన ఇమేజ్‌ని క్రియేట్ చేసుకున్న డా॥రాజశేఖర్ హీరోగా, 'అ..!' వంటి విలక్షణమైన చిత్రాన్ని తెరకెక్కించిన దర్శకుడు ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో ఈ సినిమాని తెరకెక్కించడం ఆనందంగా ఉంది. తాజాగా రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్‌కి విశేష స్పందన లభిస్తుంది. సినిమా కూడా ఆడియెన్స్‌ని అలరిస్తుంది' అని చిత్ర బృందం తెలియజేసింది.

ప్రముఖ బాలీవుడ్ నటుడు ఖాదర్ ఖాన్ కన్నుమూత


ఖాదర్ ఖాన్

ప్రముఖ బాలీవుడ్ నటుడు, స్క్రీన్‌రైటర్ ఖాదర్ ఖాన్ (81) కన్నుమూశారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న ఆయన కెనడాలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సోమవారం మధ్యాహ్నం కోమాలోకి వెళ్ళారు. సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో తుదిశ్వాస విడిచినట్టు ఆయన కుమారుడు సర్ఫరాజ్ మీడియాకి తెలిపారు. ఆయన అంత్యక్రియలు కెనడాలోనే నిర్వహించనున్నట్టు చెప్పారు. ఖాదర్ ఖాన్‌కి ఇద్దరు కుమారులు సర్ఫరాజ్ ఖాన్, షాహనవాజ్ ఖాన్, భార్య అజ్రా ఖాన్ ఉన్నారు. 1937, అక్టోబర్ 22న ఆఫ్ఘనిస్థాన్‌లోని కాబూల్‌లో జన్మించిన ఖాదర్ ఖాన్ 1973లో చిత్ర రంగంలోకి అడుగుపెట్టారు. ఆయన నటించిన తొలి చిత్రం 'ధాగ్'. ఆ తర్వాత వరుసగా 'మేరీ ఆవాజ్ సునో', 'బాప్ నంబ్రీ బెటా దస్ నంబ్రీ', 'అంగార్', 'హిమ్మత్‌వాలా', 'ఆజ్ కా డార్', 'సిక్కా', 'హమ్', 'ఆంఖేన్', 'మై ఖిలాడి తూ అనారి', 'కూలీ నెం.1', 'సాజన్ చలే ససురాల్', 'దిల్ దివానా', 'బుఖ్తీ', 'షాలిమార్', 'మిస్టర్ నట్వర్‌లాల్', 'లూట్‌మార్', 'రాజ్', 'సామ్రాట్', 'లక్ష్మి', 'కూలీ', 'చోర్ పోలీస్', 'గిరాఫ్తార్', 'దిల్‌వాలా', 'అప్నే అప్నే', 'కాలా బజార్', 'చాల్‌బాజ్', 'షాందార్', 'సాజన్', 'త్రినేత్ర', 'హమ్ షకల్', 'హనీమూన్', 'ఆగ్', 'జుడ్వా', 'సూర్యవంశం' వంటి అనేక హిట్ చిత్రాల్లో కీలక పాత్రల్లో నటించి మెప్పించారు. ఎక్కువగా హాస్య తరహా పాత్రలతోపాటు విలన్ పాత్రలతో అలరించారు. అమితాబ్‌తో మంచి అనుబంధం ఉంది. వీరిద్దరు కలిసి 'దో ఔర్ దో పాంచ్', 'ముకద్దర్ కా సికిందర్', 'మిస్టర్ నట్వర్‌లాల్', 'సుహాగ్', 'షహేన్‌షా' వంటి చిత్రాల్లో నటించారు. అమితాబ్‌తోపాటు రాజేష్ ఖన్నా, జితేంద్ర, ఫిరోజ్ ఖాన్, అనిల్ కపూర్, గోవింద వంటి వారితో ఎక్కువగా తెర పంచుకున్నారు. దాదాపు నాలుగున్నర దశాబ్దాల కెరీర్‌లో 300లకుపైగా చిత్రాల్లో నటించి ప్రేక్షకుల్ని అలరించిన ఆయన చివరి చిత్రం 'మస్తీ నహి షస్తి'. బాలీవుడ్ చిత్రాలతోపాటు బెంగాలీ, భోజ్‌పురి చిత్రాల్లోనూ నటించారు. అంతేకాదు 250ల చిత్రాలకు స్క్రీన్‌ప్లే అందించారు. రైటర్‌గానూ మంచి పేరు తెచ్చుకున్నారు. నిర్మాతగా మారి 'శమా' చిత్రాన్ని నిర్మించారు. ఖాదర్ ఖాన్ మృతికి బాలీవుడ్ సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు.

హర్రర్ సస్పెన్స్ థ్రిల్లర్

సమీర్ ఖాన్, శైలజలను హీరోహీరోయిన్లుగా పరిచయం చేస్తూ షేర్ దర్శకత్వంలో చంద్రశేఖరా మూవీస్ పతాకంపై వెంకట్‌రెడ్డి నిర్మిస్తున్న చిత్రం 'కెఎస్100'. నూతన సంవత్సరం సందర్భంగా మంగళవారం చిత్ర టైటిల్ లోగోను విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు షేర్ మాట్లాడుతూ, 'టైటిల్‌కి తగ్గట్టుగానే వైవిధ్యమైన కంటెంట్‌తో తెరకెక్కుతున్న చిత్రమిది. హర్రర్, సస్పెన్స్ థ్రిల్లర్, రొమాంటిక్ జోనర్‌లో ఆడియెన్స్‌ని ఇన్‌స్పైర్ చేసేలా తీశాం. యూత్‌ని, మహిళా ఆడియెన్స్‌ని ఆకట్టుకుంటుంది. అంతర్జాతీయ మోడల్ సమీర్ ఖాన్‌ని హీరోగా ఈ సినిమాను రూపొందించడం ఆనందంగా ఉంది. అంతేకాదు ఈ సినిమాలో చాలా మంది మోడల్స్‌ని పరిచయం చేస్తున్నాం. ఇలా చేయడం తెలుగులో ఇదే తొలిసారి. సినిమా చిత్రీకరణ పూర్తయ్యింది. గోవా, హైదరాబాద్, మహారాష్ట్రలోని హిరంబుల్‌లో షూటింగ్ జరిపాం. ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం' అని అన్నారు. అక్షిత, అషి, సునీత, శ్రద్ధా, నందిని, కల్పన అజీమ్, పూరివి, సుమన్ ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: వంశీ, ఎడిటర్: లోకేష్ చందు, నాగార్జున, మ్యూజిక్: నవనీత్ చారి.


'ఆర్.ఎస్. 100' చిత్రంలో శైలజ, సమీర్‌ఖాన్

మరో భిన్న చిత్రం ఆవిరి


'ఆవిరి' కాన్సెప్ట్ పోస్టర్

వైవిధ్యమైన చిత్రాలను రూపొందించడంలో దర్శక, నటుడు రవిబాబు దిట్ట. ఇటీవల ఆయన త్రీడీ లైవ్ యాక్షన్ యానిమేషన్ ప్రధానంగా ప్రయోగాత్మకంగా 'అదుగో' చిత్రాన్ని రూపొందించి ప్రశంసలందుకున్నారు. తాజాగా 'ఆవిరి' పేరుతో మరో విభిన్న కథను తెరకెక్కించబోతున్నారు. కొత్త సంవత్సర కానుకగా ఈ చిత్ర టైటిల్‌ని కన్ఫమ్ చేస్తూ కాన్సెప్ట్ పోస్టర్‌ని విడుదల చేశారు. గాజు సీసాలో ఓ అమ్మాయి డాన్స్ చేస్తున్నట్టుగా ఉన్న ఈ పోస్టర్ ఆకట్టుకుంటుంది. 'తాజా పోస్టర్ సినిమాపై అంచనాలను పెంచింది. ఇదొక ఆఫ్ బీట్ చిత్రం. త్వరలోనే నటీనటుల వివరాలు, సినిమాకు సంబంధించిన అప్‌డేట్ ఇస్తామ'ని చిత్ర బృందం తెలియజేసింది. ఈ సినిమాను ఫ్లయింగ్ ఫ్రాగ్స్ పతాకంపై రవిబాబు నిర్మిస్తున్నారు.

మరో సైన్స్ ఫిక్షన్..


శంకర్, హృతిక్ రోషన్

శంకర్, రజనీకాంత్ కాంబినేషన్‌లో వచ్చిన సైన్స్ ఫిక్షన్ '2.0' ఘన విజయం సాధించింది. ప్రపంచ వ్యాప్తంగా ఇది సుమారు రూ.600 కోట్లకుపైగా కలెక్షన్లను రాబట్టింది. ఈ నేపథ్యంలో శంకర్ మరో సైన్స్ ఫిక్షన్ చిత్రాన్ని బాలీవుడ్ హీరో హృతిక్ రోషన్‌తో చేయాలని భావిస్తున్నారు. ఇప్పటికే ఈ స్క్రిప్ట్‌ని హృతిక్‌కి శంకర్ నెరేట్ చేశారట. ఆయన సుముఖత వ్యక్తం చేశారని, శంకర్ ఓ టెలివిజన్ రియాలిటీ షోలో తెలిపినట్టు బాలీవుడ్ మీడియా కోడై కూస్తోంది. శంకర్ ప్రస్తుతం కమల్ హాసన్ హీరోగా 'భారతీయుడు 2'ని రూపొందిస్తున్నారు.

వాస్తవ సంఘటనలు..

'బెజవాడ', 'నాయక్', 'ఇద్దరమ్మాయిలతో', 'జెండాపై కపిరాజు' చిత్రాలతో అమలాపాల్ తెలుగు ఆడియెన్స్‌ని అలరించింది. ఇందులో 'నాయక్' తప్ప మరే చిత్రం ఆమెకు విజయాన్ని అందించలేదు. దీంతో తెలుగు చిత్రాలకు దూరంగా ఉంటూ పూర్తిగా తమిళం, మలయాళ, కన్నడ చిత్రాలకే పరిమితమయ్యింది. ప్రస్తుతం రెండు తమిళ చిత్రాల్లో నటిస్తున్న అమలా పాల్ తాజాగా ఓ లేడీ ఓరియెంటెడ్ చిత్రంలో నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు తెలుస్తుంది. తమిళం, మలయాళ బైలింగ్వల్‌గా రూపొందనున్న నయా చిత్రంలో నటించేందుకు ఓకే చెప్పారట. ఈ సినిమాకు అనూప్ దర్శకత్వం వహిస్తుండగా, ఇందులో ఆమె ఫోరెన్సిక్ సర్జన్‌గా కనిపించనున్నట్టు తెలుస్తుంది. కేరళకు చెందిన విశ్రాంత పోలీస్ సర్జన్ డాక్టర్ ఉమా నిజ జీవితంలో జరిగిన ఘటనల ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఉమా పాత్రలో అమలాపాల్ కనిపించనున్నారట. ఈ చిత్రం త్వరలోనే ప్రారంభం కానుంది. ప్రస్తుతం ఆమె తమిళంలో 'అదో అందా పరవై పోలా', 'ఆదై', మలయాళంలో 'ఆడుజీవితమ్' చిత్రంలో నటిస్తూ బిజీగా ఉంది.


అమలా పాల్

ఆద్యంతం వినోదాత్మకంగా రామచక్కని సీత


ఇంద్ర, సుకృత వాగ్లే

ఇంద్ర, సుకృత వాగ్లే జంటగా శ్రీ హర్ష మండ దర్శకత్వంలో క్రొకోడైల్ క్రియేషన్స్, లియో సెల్యులాయిడ్స్ పతాకాలపై విశాలక్ష్మి మండ, జి.ఎల్. ఫణికాంత్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'రామ చక్కని సీత'. ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను నూతన సంవత్సరం సందర్భంగా మంగళవారం విడుదల చేశారు.

ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ, 'మహాకవి వాల్మీకి రాసుకున్న రామాయణం నిజం అయితే నా కథ కూడా నిజమే. సినిమా ఆద్యంతం వినోదాత్మకంగా అన్ని వర్గాలను ఆకట్టుకునేలా ఉంటుంది. ఈ సినిమా ఇప్పటికే 70 శాతం చిత్రీకరణ పూర్తి చేసుకుంది. తాజాగా రిలీజ్ చేసిన ఫస్ట్‌లుక్‌కి విశేష స్పందన లభిస్తుంది' అని అన్నారు. ప్రియదర్శి, కాశీ విశ్వనాథ్, అభయ్, బుల్లెట్ భాస్కర్, జబర్దస్త్ అప్పారావు, మధు మణి, రాహుల్ సిప్లిగంజ్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: కేశవ కిరణ్, కెమెరా: మురుగన్ గోపాల్, ఎడిటింగ్: గ్యారీ బి హెచ్.

తెలంగాణ హైకోర్టు షురూ...



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ హైకోర్టు తొలి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్ మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో వైభవంగా జరిగిన కార్యక్రమంలో ఆయన చేత తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ ప్రమాణం చేయించారు. ఇంగ్లిషులో దైవ సాక్షిగా ప్రమాణం చేశారు. రాజ్యాంగానికి లోబడి న్యాయబద్ధంగా తీర్పులు వెలువరిస్తామని, హైకోర్టు విధులు నిర్వహిస్తామని జస్టిస్ రాధాకృష్ణన్ ప్రమాణం చేశారు. వేదికపై గవర్నర్, ప్రధాన న్యాయమూర్తితోపాటు ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఆశీనులయ్యారు. ప్రమాణ స్వీకార అనంతరం జస్టిస్ రాధాకృష్ణన్‌కు గవర్నర్, సీఎంలు పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందనలు తెలిపారు. అనంతరం వారు ముగ్గురు వేదిక దిగి కింద ఆశీనులైన సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్. సుభాష్‌రెడ్డి, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులతో కరచాలనం చేశారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రజాప్రతినిధులు, న్యాయవాదులు, న్యాయమూర్తుల కుటుంబ సభ్యులు హాజరయ్యారు.

అనంతరం హైకోర్టు ప్రాంగణంలోని ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలంగాణ హైకోర్టుకు కేటాయించిన 12 మంది న్యాయమూర్తులతో ప్రధాన న్యాయమూర్తి ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు కూడా హాజరయ్యారు. అనేక మంది న్యాయాధికారులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది వారి కుటుంబ సభ్యులతో వచ్చారు

ప్రధాన న్యాయమూర్తి కాకుండా తెలంగాణ హైకోర్టుకు 24 మంది న్యాయమూర్తులు ఉండాలి. అయితే ఇప్పుడు 12 మంది మాత్రమే న్యాయమూర్తులు తెలంగాణ హైకోర్టుకు ఉన్నారు. ప్రమాణ స్వీకారం అనంతరం కోర్టు దర్బార్ హాల్లో న్యాయమూర్తులను సీఎం కేసీఆర్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. బుధవారం నుంచి తెలంగాణ హైకోర్టు కేసుల్ని విచారిస్తుంది. మూడు రోజులపాటు కోర్టు పనిచేశాక ఈ నెల 5 నుంచి 20 వతేదీ వరకూ హైకోర్టుకు సంక్రాంతి సెలవులు. సెలవుల సమయంలో అత్యవసర కేసుల విచారణకు ప్రత్యేక కోర్టులు (వెకేషన్ కోర్టులు) పనిచేస్తాయి. ఇదిలా ఉండగా ఏపీ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ప్రవీణ్‌కుమార్ విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో ప్రమాణస్వీకారం చేశారు. హైదరాబాద్ నుంచి గవర్నర్ నర్సింహన్ విజయవాడ వెళ్లి ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ, ఏపీ సీఎం చంద్రబాబు ఇతరులు హాజరయ్యారు. అనంతరం ఆ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు 14 మందితో తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి ప్రమాణం చేయించారు. రాజ్యాంగ బద్ధంగా విధులు నిర్వరిస్తామని ఇరు రాష్ట్రాల న్యాయమూర్తులు ప్రమాణం చేశారు. కొత్తగా ప్రమాణం చేసిన ప్రధాన న్యాయమూర్తులకు ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు పుష్పగుచ్ఛాలిచ్చి అభినందనలు తెలియజేశారు.

హైకోర్టు అధికారులు, సిబ్బంది విభజన

ఇదిలా ఉండగా ఇంతకాలం ఉమ్మడి హైకోర్టులో పని చేసిన అధికారులు, సిబ్బందిని ఏపీ, తెలంగాణ హైకోర్టులకు విభజిస్తూ సోమవారం రాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి. వారు ఇచ్చిన ఆప్షన్ల మేరకు విభజన జరిగింది. ఏపీ హైకోర్టు ఆప్షన్ ఎంచుకున్న వారంతా ఈ నెల 4న ఆ రాష్ట్ర హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌ను కలుసుకోవాల్సివుంటుంది. తెలంగాణ హైకోర్టు ఆప్షన్ తీసుకున్న వారి సంఖ్య ఎక్కువగా ఉన్నందున ఇక్కడ క్యాడర్ పోస్టులు ఖాళీలు లేనందున కొంతమంది ఏపీ హైకోర్టుకు డిప్యూటేషన్‌పై పంపాల్సివచ్చింది. ఇంకా మిగిలిన వారిని తెలంగాణలోని కింది కోర్టులకు కూడా డిప్యూటేషన్‌పై పంపారు. తెలంగాణ హైకోర్టు ఆప్షన్ తీసుకున్న జాయింట్ రిజిస్ట్రార్ పి.శ్రీధర్‌రావును ఏపీ హైకోర్టుకు డిప్యూటేషన్‌పై పంపారు. ఇదే విధంగా12 మంది అసిస్టెంట్ రిజిస్ట్రార్ స్థాయి అధికారులను, 51 మంది సహాయ అధికారులను, 13 మంది డిప్యూటీ సెక్షన్ స్థాయి అధికారులను, 36 మంది అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్లు, ఏడుగురు ఎగ్జామినర్ క్యాడర్ అధికారులను ఏపీ హైకోర్టుకు డిప్యూటేషన్‌పై పంపారు. ఇంతేకాకుండా 67 మంది అసిస్టెంట్ క్యాడర్ పోస్టులు, 151 ఆఫీస్ సబార్డినేట్ క్యాడర్ పోస్టుల్లోని వారి తెలంగాణ రాష్ట్రంలోని సబార్డినేట్ కోర్టుల్లో పనిచేయాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి. డిప్యూటేషన్‌పై ఏపీ హైకోర్టుకు వెళ్లిన వారి సర్వీసులకు అనుగుణంగా తగిన పోస్టుల్లో నియామకాలు జరుగుతాయి. వీరంతా వారి క్యాడర్ పోస్టులు ఖాళీ అయినప్పుడు తిరిగి తెలంగాణ రాష్ట్రానికి వస్తారు. గతంలో ఉన్న మార్గదర్శకాలకు అనుగుణంగా పోస్టుల భర్తీ జరుగుతుంది.

ఏపీ హైకోర్టు తాత్కాలిక సీజేగా ప్రవీణ్‌కుమార్



- ప్రమాణస్వీకారం చేయించిన గవర్నర్ నరసింహన్
- మరో 13 మంది న్యాయమూర్తులు కూడా..
- 56 ఏండ్ల తర్వాత ఏపీకి హైకోర్టు'

విజయవాడ : ఆంధ్రప్రదేశ్ నూతన హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ చాగరి ప్రవీణ్ కుమార్ ప్రమాణ స్వీకారం చేశారు. చీఫ్ జస్టిస్‌తో సహ 13మంది న్యాయమూర్తులతో గవర్నర్ నరసింహన్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రులు, సుప్రీం కోర్టు న్యాయమూర్తి ఎన్వీ రమణ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. చరిత్రను తిరగరాయడానికి ఇది మంచి సందర్భం అని కొనియాడారు. సమయం తక్కువగా ఉన్నప్పటికి.. వసతులు పూర్తిగా లేనప్పటికీ ఎలాంటి లోటు లేకుండా హై కోర్టు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఆంధ్రప్రదేశ్ హై కోర్టును దేశంలోనే అత్యున్నత హై కోర్టుగా తీర్చిదిద్దుకోవాలని విజ్ఞప్తి చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాజధాని నిర్మాణం కోసం రైతులు 33 వేల ఎకరాల భూమి ఇచ్చారని ప్రశంసించారు. హైకోర్టు ప్రారంభంలో కొన్ని ఇబ్బందులు ఉంటాయని తెలిపారు. ప్రభుత్వం వాటిని పరిష్కరించే ప్రయత్నం చేస్తుందని హామీ ఇచ్చారు.

56 ఏండ్ల తర్వాత : ప్రవీణ్ కుమార్

ఏపీకి ప్రత్యేక హైకోర్టు రావడం ఓ చారిత్రక ఘట్టమంటూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తాత్కలిక ప్రధాన న్యాయమూర్తి ప్రవీణ్ కుమార్ ప్రశంసించారు. 56 ఏండ్ల తర్వాత హైదరాబాద్ నుంచి ఏపీకి హైకోర్టు వచ్చిందని తెలిపారు. అందరి సమన్వయంతో హైకోర్ట్ నిర్వహణను ముందుకు తీసుకెళ్తామని వెల్లడించారు. కొత్త చరిత్రను ఇక్కడి నుంచి మొదలు పెడదామని కోరారు. ఇది తమ బాధ్యతను మరింత పెంచిందని తెలిపారు.

తెలంగాణ సంపూర్ణంగా సాకారం

- హైకోర్టు ఏర్పాటుపై టీఆర్ఎస్ ఎంపీ వినోద్‌కుమార్

నవతెలంగాణ - న్యూఢిల్లీబ్యూరో

రాష్ట్రానికి హైకోర్టు ఏర్పడటంతో ప్రత్యేక తెలంగాణ కల సంపూర్ణంగా సాకారమైందని టీఆర్ఎస్ లోక్‌సభ సభ్యుడు బొయినపల్లి వినోద్ కుమార్ అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా కొత్తగా ప్రమాణస్వీకారం చేసిన న్యాయమూర్తులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం వినోద్‌కుమార్ ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. నూతన సంవత్సరం రోజే, తెలంగాణ ప్రత్యేక హైకోర్టు ఏర్పాటు కావడం హర్షించదగ్గ విషయమన్నారు. రాష్ట్ర సాధన స్ఫూర్తితో హైకోర్టును కూడా కొట్లాడి సాధించుకున్నామని వెల్లడించారు. పార్లమెంట్ లోపల, వెలుపల తమ పార్టీ ఎంపీలు చేసిన పోరాటానికి సరైన ఫలితం దక్కిందని అన్నారు. రాష్ట్రంలో హైకోర్టు ఏర్పాటు కావడంతో తెలంగాణలో న్యాయ వ్యవస్థ మరింత పటిష్టమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ హైకోర్టు ఏర్పాటుతో పాటు జిల్లా కోర్టులు, నూతన జిల్లాల్లో సైతం ప్రత్యేక కోర్టులు ఏర్పాటు కానున్నాయని ఆయన తెలిపారు. హైకోర్టుతో పాటు కింది స్థాయి కోర్టుల్లో ఎన్నో కేసులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. దాంతో ప్రజానీకానికి కేసుల విషయంలో న్యాయం పొందేందుకు జాప్యం జరుగుతుందన్నారు.

మార్చికల్లా మేడిగడ్డ పూర్తికావాలి

అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశం

- ప్రాజెక్టు పనుల పరిశీలన

నవతెలంగాణ-భూపాలపల్లి

మార్చి నెలాఖరుకు మేడిగడ్డ పనులు పూర్తి చేయాలని ఇంజినీర్లను ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ఆదేశించారు. సాగునీటి ప్రాజెక్టుల పరిశీలనలో భాగంగా జయశంకర్ జిల్లా మహదేవ్‌పూర్ మండలంలో మేడిగడ్డ, కన్నెపెల్లి పంప్‌హౌజ్ పనులను సీఎం మంగళవారం పరిశీలించారు. బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో బయల్దేరిన ముఖ్యమంత్రి.. కాళేశ్వరం ప్రాజెక్టు పరిశీలనలో భాగంగా తొలుత మేడిగడ్డకు వెళ్లారు. అక్కడ ప్రాజెక్టు పనుల్లో పురోగతిపై ఇంజినీర్లను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు పనులు ఏయే దశల్లో ఉన్నాయి, ఎప్పటిలోగా పూర్తవుతాయనే వివరాలపై ఆరా తీశారు. ప్రస్తుతం జరుగుతున్న పనుల వివరాలను ఇంజినీర్లు సీఎంకు వివరించారు. రికార్డు స్థాయిలో కాంక్రీటు పనుల్ని పూర్తి చేస్తున్నామని అధికారులు



సీఎంకు వివరించారు. పనుల్లో వేగం పెరిగేందుకు సీఎం పలు సూచనలు చేశారు. కాంక్రీటుతో పాటు మోటార్ల బిగింపు తదితర పనులు కూడా సమాంతరంగా జరిగేలా చూడాలని చెప్పారు. పనుల్లో మరింత వేగం పెంచాలని సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి సాగునీరు అందించాలంటే మేడిగడ్డ పూర్తికావడం కీలకమని ఇంజినీర్లతో అన్నారు. పనుల పురోగతిపై ఫొటో ప్రదర్శన ద్వారా ఇంజినీర్లు సీఎంకు వివరించారు. ప్రాజెక్టుపై ఎన్నో అంచనాలు పెట్టుకున్నామనీ, దీనిపై భారీగా వ్యయం చేస్తున్నామన్న సీఎం.. గడువు లోపు పనులు పూర్తి చేయాలనీ సూచించారు. అనంతరం సీఎం మేడిగడ్డ బ్యారేజీ వద్ద పంపు హౌస్ నిర్మాణం పనులను పరిశీలించారు. ఆ తర్వాత కన్నెపెల్లి పంప్‌హౌజ్‌కు చేరుకున్నారు. కేసీఆర్ వెంట సీఎస్ ఎస్కే జోషి, సీఎం కార్యదర్శి స్మితా సబర్వాల్, డీజీపీ మహేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, శ్రీధర్‌బాబు తదితరులు ఉన్నారు.

కరీంనగర్‌కు చేరుకున్న సీఎం కేసీఆర్

కరీంనగర్‌రూరల్: కాళేశ్వరం, మేడిగడ్డ, సుందిళ్ల అన్నారం ప్రాజెక్ట్‌లను పరిశీలించిన అనంతరం సీఎం కేసీఆర్ ంగళవారం రాత్రికి కరీంనగర్ రూరల్ మండలం తీగలగుట్టపల్లిలోని తన నివాసానికి చేరుకున్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, టీఆర్ఎస్ నాయకులు సీఎంకు స్వాగతం పలికి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించినట్టు సమాచారం. బుధవారం ఉదయం 10 గంటలకు కరీంనగర్ నుంచి పెద్దపల్లి జిల్లాకు వెళ్లనున్నారు. అక్కడ నుంచి హైదరాబాద్ వెళ్తారు.

చలికి ఇద్దరు వృద్ధులు మృతి

నవతెలంగాణ- ఆదిలాబాద్

ఆదిలాబాద్ జిల్లాలో చలితీవ్రతను తట్టుకోలేక ఇద్దరు వృద్ధులు మృతిచెందారు. జైనథ్ మండలం గూడ గ్రామానికి చెందిన గంగమ్మ(71), లస్మన్న(80) మంగళవారం తెల్లవారుజామున చలికి తీవ్ర అస్వస్థతకు గురై మరణించారు.

కొత్త సంవత్సర వేడుకల్లో విషాదం

- రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు మృతి

నవతెలంగాణ-బీర్కూర్ / హుజూరాబాద్ / ఎల్లారెడ్డిపేట

న్యూఇయర్ వేడుకల్లో రోడ్డు ప్రమాదాలు విషాదం నింపాయి. సోమవారం అర్ధరాత్రి, మంగళవారం ఉదయం వేర్వేరు చోట్ల జరిగిన ప్రమాదాల్లో ఆరుగురు మృతిచెందారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం కోనాపూర్‌కు చెందిన జెట్టి అజయ్ తన పంట చేను వద్ద సోమవారం అర్ధరాత్రి కొత్త సంవత్సర వేడుకల విందు ఏర్పాటు చేశాడు. అదే గ్రామానికి చెందిన శ్రీకాంత్(20), అవాజ్‌పల్లికి చెందిన దిగంబర్(19) ఆ వేడుకల్లో పాల్గొని రాత్రి బైక్‌పై తిరుగు ప్రయాణమయ్యారు. బైక్ అదుపుతప్పి కల్వర్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శ్రీకాంత్, దిగంబర్ అక్కడికక్కడే ప్రాణం కోల్పోయారు. వెనుకనుంచి వస్తున్న స్నేహితులు గమనించి కుటుంబీకులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న బాన్సువాడ సీఐ మహేష్‌గౌడ్ మంగళవారం ఉదయం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుల కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం పోతిరెడ్డిపల్లెలో సోమవారం రాత్రి ముగ్గురు యువకులు బైక్‌పై పోతూ సిరిసిల్ల మండలం పెద్దూర్ వద్ద రోడ్డు దాటేందుకు నిల్చున్న రెడ్డిమల్ల రేఖను ఢీకొన్నారు. తీవ్రంగా గాయపడిన ఎల్లారెడ్డిపేట మండలం పోతిరెడ్డిపల్లెకు చెందిన చంటి(22), పెద్దూరుకు చెందిన రెడ్డిమల్ల రేఖ(24)ను సిరిసిల్ల ఆసత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో పరిస్థితి విషమించి మృతిచెందారు. రేఖకు గాయాలయ్యాయి.కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం తుమ్మనపల్లి గ్రామ శివారులోని మందాడిపల్లి వరంగల్ రహదారిపై మంగళవారం కారు, లారీ ఢీకొన్నాయి. కారులో ప్రయాణిస్తున్న కేశవపట్నం మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన కోడూరు వెంకటేష్(25), కర్ణాటక రాష్ట్రం మోనాగళూరు హవేలీ తాలూకు చెందిన కె.ఎస్ చెప్రారెడ్డి(31) అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన కారు డ్రైవర్ సందేలా రంజిత్‌ను వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. లారీ డ్రైవర్ ముసు రాథోడ్ హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

పంచాయతీలకు నగారా

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటు చేసినట్టు వివరించారు. మంగళవారం నుంచి రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని చెప్పారు.

నామినేషన్ల ప్రక్రియ ఇలా

మొదటి విడత ఎన్నిలకు సంబంధించి ఈ నెల 7న రిటర్నింగ్ అధికారులు నోటీస్ ఇవ్వనున్నారు. అదే రోజు నుంచి 9వరకు నామినేషన్ల స్వీకరణ, 10న నామినేషన్ల పరిశీలన, 11న ఆర్డీఓలకు అప్పీలు చేసుకునేందుకు అవకాశం, 12న ఆర్డీవోల చేత అప్పీలు పరిష్కారం, 13న నామినేషన్ల ఉపసంహరణ , రెండో విడత ఎన్నికలకు సంబంధించి ఈ నెల 11న నోటీస్, ఆ రోజునుంచి 13వరకు నామినేషన్ల స్వీకరణ 14న నామినేషన్ల పరిశీలన, 15న ఆర్డీఓలకు అప్పీలు చేసేందుకు అవకాశం, 16న ఆర్డీఓలచే అప్పీలకు పరిష్కారం, 17న నామినేషన్ల ఉపసంహరణ చేపట్టనున్నట్టు తెలిపారు. మూడో విడతకు సంబంధించి ఈ నెల 16న నోటీస్ ఆ రోజు నుంచి 18 వరకు నామినేషన్ల స్వీకరణ, 19న నామినేషన్ల పరిశీలన, 20న ఆర్డీఓలకు అప్పీలుకు అవకాశం, 21న ఆర్డీఓల చేత అప్పీళ్లకు పరిష్కారం, 22న నామినేషన్ల ఉపసంహరణ, 30 పోలింగ్ జరుగనుంది.

బ్యాలెట్ పేపర్‌పై నోటా గుర్తు

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో తొలిసారిగా బ్యాలెట్ పత్రంపై నోటా గుర్తును ప్రవేశపెట్టామని నాగిరెడ్డి తెలిపారు. గతంలో బ్యాలెట్ పత్రాలపై అభ్యర్థుల పేర్లు లేనందున ఈ ఎన్నికల్లో కూడా అభ్యర్థుల పేర్లను ముద్రించడం లేదని, కేవలం వారికి కేటాయించిన గుర్తులను మాత్రమే ప్రచారం చేసుకోవాలని సూచించారు. తొలి విడతలో 4480 గ్రామ పంచాయతీలకు, రెండో విడతలో 4137 పంచాయతీలకు, మూడో విడతలో 4115 గ్రామ పంచాయతీలకు పోలింగ్ నిర్వహిస్తామని వెల్లడించారు

ధరావత్తు ఇలా

ఉదయం 7 గంటల నుంచి
మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్
మూడు విడతలుగా నామినేషన్ల స్వీకరణ
మొదటి విడతకు 7 నుంచి 9..
రెండో విడతకు 11 నుంచి 13,
మూడో విడత 16 నుంచి 18 వరకు
తొలిసారిగా బ్యాలెట్ పేపర్‌పై నోటా
అభ్యర్థుల పేర్లు లేకుండానే బ్యాలెట్
అమల్లోకి ఎన్నికల కోడ్

పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే సర్పంచ్ అభ్యర్థులు జనరల్ స్థానాల్లో రూ.2వేలు, రిజర్వుడు కేటగిరిలో రూ.1000, వార్డులకు సంబంధించి జనరల్ స్థానాల్లో రూ.500, రిజర్వుడు స్థానాల్లో రూ.250 చొప్పున డిపాజిట్ చెల్లించాల్సి ఉంది. అభ్యర్థుల ఎన్నికల ప్రచార ఖర్చుకు పరిమితి ఉంటుందని, 5వేల జానాభా దాటిన పంచాయతీల్లో రూ.2.50 లక్షలు 5వేల జనాభా కంటే తక్కువగా ఉన్న పంచాయతీల్లో రూ.1.50 లక్షలకు మించి ఖర్చు చేయరాదని తెలిపారు.పరిమితికి మించి ఖర్చు చేసే అభ్యర్థులు గెలిచిన తర్వాత పదవిని కోల్పోవలసి వస్తుందని హెచ్చరించారు. జనరల్ స్థానాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలు పోటీ చేస్తే రిజర్వుడు స్థానాల్లో ఉన్న ధరావత్తునే చెల్లించాలన్నారు.

ముందుగా వార్డు మెంబర్ కౌంటింగ్

తొలుత వార్డు మెంబర్ల ఓట్ల లెక్కింపు తర్వాత సర్పంచ్ అభ్యర్థుల ఓట్లు లెక్కిస్తామన్నారు. అదే రోజు గెలుపొందిన వార్డు మెంబర్లంతా కలిసి ఉప సర్పంచ్ ఎన్నుకుంటారని చెప్పారు. మొత్తం గ్రామ పంచాయతీ ఓటర్ల సంఖ్య 1,49,52,058 ఉన్నారని నాగిరెడ్డి వెల్లడించారు.

అంబేద్కర్ విగ్రహం ధ్వంసం

నవతెలంగాణ-గోపాల్‌పేట

నూతన సంవత్సర వేడుకల సందర్భంగా అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. ఎనిమిది మంది నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం బుద్దారంలో డిసెంబర్ 31 అర్ధరాత్రి న్యూఇయర్ వేడుక సందర్భంగా కొంతమంది యువకులు తాగిన మైకంలో అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న దళిత సంఘాల నాయకులు మంగళవారం ఉదయం 16 మందిపై అనుమానం వ్యక్తం చేస్తూ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం ఎస్పీ అపూర్వరావును కలిసి విషయాన్ని వివరించారు. ఎస్పీ ఆదేశాలతో పోలీసులు గ్రామంలో విచారణ చేపట్టారు. ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ దళిత సంఘం నాయకులు పానుగంటి చంద్రయ్య, జోగు శాంతన్న, రాజశేఖర్, కుర్మయ్య ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు.

చర్యలు తీసుకుంటాం
సీఐ సూర్యనాయక్- వనపర్తి

అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని పట్టుకుని వారిపై చర్యలు తీసుకుంటామని వనపర్తి సీఐ సూర్యనాయక్ తెలిపారు. సాయంత్రం బుద్దారంలో గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. డీఎస్పీ విచారణ అనంతరం దుండగులపై అట్రాసిటీ కేసు నమోదు చేస్తామన్నారు.

'ముందు నా కులం.. తర్వాతే సమాజం'

- రాజస్థాన్ మంత్రి వివాదాస్పద వ్యాఖ్యలు

జైపూర్: కుల, మతాలకతీతంగా ప్రజలకు సేవ చేస్తామని, బంధు ప్రీతి చూపమని, రాజ్యాంగం ప్రకారం నడుచుకుంటామని చట్టసభ్యులు ప్రమాణం చేస్తారు. కానీ, రాజస్థాన్‌లో ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికలలో ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి పదవి పొందిన మమతా భూపేశ్ మాత్రం.. ముందు తన కులానికి చెందిన ప్రజలను అభివృద్ధి బాటలో నడిపించిన తరువాతే సమాజం గురించి ఆలోచిస్తానని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. రాజస్థాన్ మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రిగా నియమితురాలైన ఆమె.. అల్వార్‌లో జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 'నా తొలి ప్రాధాన్యత నా కులానికే. తర్వాతే సమాజం. తదనంతరం మిగతావన్నీ. అందరి కోసం పనిచేయడమే నా ఉద్దేశం' అంటూ వ్యాఖ్యానించారు.

లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తా..

- ప్రత్యక్ష రాజకీయాల్లోకి ప్రకాశ్‌రాజ్

బెంగళూరు: 'అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు. ఒక కొత్త ప్రారంభం.. మరింత బాధ్యత.. మీ మద్దతుతో నేను రానున్న పార్లమెంటు ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేస్తాను. నియోజకవర్గం వివరాలను త్వరలో ప్రకటిస్తాను' అని విలక్షణ నటుడు ప్రకాశ్‌రాజ్ ట్వీట్ చేశారు. ప్రకాశ్‌రాజ్ అనేక సందర్భాల్లో బీజేపీ వ్యతిరేక వైఖరిని ప్రకటించిన విషయం తెలిసిందే. ఆయన స్నేహితురాలు, ప్రముఖ జర్నలిస్టు గౌరీ లంకేశ్ హత్య ఘటనపై న్యాయం కోరుతూ తన వాణిని వినిపించారు. ఆమె హత్య వెనుక హిందూత్వవాదుల హస్తం ఉందనే ఆరోపణలు వున్నాయి. కేంద్రంలో నరేంద్రమోడీ నేతృత్వంలోని ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నందుకు బాలీవుడ్ తనకు సినీ అవకాశాలను నిలిపివేసిందని కూడా ప్రకాశ్‌రాజ్ ఆరోపించారు.

పాలన గాలికొదిలి పర్యటనలా?

- గల్లీల్లో గాయబ్‌చేసి ఢిల్లీలో కాళ్లు పట్టుకునేటోళ్లు టీఆర్ఎస్ నేతలు : బండ్రు

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు రెండోసారి పట్టం గట్టిన ప్రజలను, వారి సమస్యలను గాలికొదిలి రాష్ట్రాలు పట్టుకుని తిరుగుతున్నారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండ్రు శోభారాణి విమర్శించారు. చంద్రబాబు నాయుడ్ని తిట్టడం ఆపేసి పాలనపై దృష్టి పెట్టాలని సూచించారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్‌లో మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడారు. యథారాజ తథాప్రజ అన్నట్టుగా కేసీఆర్ లెక్కనే టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తయారయ్యారన్నారు. ప్రజలు ఓట్లు వేసింది సమస్యలు పరిష్కరించడానికా? ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడ్ని తిట్టడానికి ఓట్లు వేశారా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంపీగా గెలిచి టీఆర్ఎస్‌లో చేరిన గుత్తా సుఖేందర్‌రెడ్డి ఎక్కడ తన పదవి పోతుందోనన్న భయంతో గులాబి కండువా కూడా కప్పుకోలేదని, అలాంటి వ్యక్తి చంద్రబాబు నాయడ్ని తిట్టడం దారుణమని అన్నారు. గుత్తా, జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యల్ని ఖండిస్తున్నామన్నారు. గల్లీల్లో గాయబ్ చేసి ఢిల్లీలో కాళ్లు పట్టుకునేవాళ్లు టీఆర్ఎస్ నేతలని విమర్శించారు. చంద్రబాబును ఎదుర్కోలేకనే నరేంద్రమోడీ రాష్ట్రానికో శిఖండిని పెట్టుకుని డ్రామా ఆడుతున్నారని ఆరోపించారు. తెలంగాణలోని సమస్యలను పరిష్కరించకుండా ఏపీకి వెళ్లి ప్రతిపక్ష పాత్ర పోషిస్తామని కేసీఆర్ మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. కుటుంబ న్యాయం కాకుండా సామాజిక న్యాయం చేస్తే బాగుంటుందని వ్యాఖ్యానించారు.

ఎన్టీఆర్ భవన్‌లో నూతన సంవత్సర వేడుకలు

ఎన్టీఆర్ భవన్‌లో టీడీపీ తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలను మంగళవారం నిర్వహించారు. కేక్ కట్ చేశారు. ప్రజలకు శుభాకాంక్షలను తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు బండ్రు శోభారాణి, జి.బుచ్చిలింగం, రాష్ట్ర కార్యదర్శి కందిమళ్ల రఘునథరావు, తదితరులు పాల్గొన్నారు.

టీఆర్ఎస్ మైండ్‌గేమ్..!

కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో సంప్రదింపులు

- అభివృద్ధి కోసం కారెక్కండంటూ ఫోన్లు
- పార్లమెంటు ఎన్నికల్లోపు చేర్చుకునే యత్నం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ముందస్తు ఎన్నికల్లోనూ మరోసారి అధికారాన్ని హస్తగతం చేసుకున్న టీఆర్ఎస్...మరింత బలాన్ని పెంచుకునేందుకు ప్రయత్నం చేస్తున్నది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో టీఆర్ఎస్ మైండ్ గేమ్ ఆడుతున్నది. ఆ ఎమ్మెల్యేలతో సంప్రదింపులు జరుపుతున్నట్టు సోషల్‌మీడియాలో జోరుగా ప్రచారం జరుగు తున్నది. కాళేశ్వరం ప్రాజెక్టు పర్యటనలో ఉన్న సీఎం కేసీఆర్‌ను కాంగ్రెస్ ఎమ్మెల్యేలు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, గండ్ర వెంకట్రామణారెడ్డి కలవడం మరింత చర్చనీయాంశమైంది. టీఆర్ఎస్ పార్టీలో కొనసాగు తున్న పాత కాంగ్రెస్ నాయకులను, ఆయా జిల్లాల టీఆర్ఎస్ నాయకత్వాన్ని రంగంలోకి దించినట్టు పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తున్నది. మీ నియోజకవర్గం అభివృద్ధి చెందాలన్నా. మరిన్ని నిధులు రావాలన్నా... కారెక్కండంటూ ఫోన్లు వస్తున్నట్టు తెలిసింది. రాకపోతే మీ నియోజకవర్గం అభివృద్ధి జరగదంటూ సుత్తిమెత్తగా బెదిరింపులకు పాల్పడుతున్నట్టు కాంగ్రెస్ శ్రేణులుఅంటున్నాయి. అదిరించో,బెదిరించో కొంత మంది



ఎమ్మెల్యేలను కారెక్కించుకుని తెలంగాణలో శక్తివంతంగా తయారు కావాలనే వ్యూహరచన చేస్తున్నట్టు రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఎవరైనా సొంత పార్టీలో ఇముడలేక వేరే పార్టీలో చేరిన ఘటనలు ఉన్నాయి. లేదంటే పార్టీలో నెలకొన్న పోటీ మూలంగా టికెట్ వస్తుందో, లేదోనన్న కారణంగా పార్టీలను వీడిన సందర్భాలు ఉన్నాయి. అందుకు భిన్నంగా టీఆర్ఎస్ నయానో, భయానో ఇతర పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలను దారికి తెచ్చుకునేందుకు తీవ్రంగా యత్నిస్తున్నట్టు కాంగ్రెస్ నేతలు అంటున్నారు. పంచాయతీ, పార్లమెంటు ఎన్నికల్లోపు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కారెక్కించుకోవడం ద్వారా ఆ పార్టీని మరింత బలహీనపరిచేందుకు పావులు కదుపుతున్నది. దీంతో కాంగ్రెస్ పార్టీని బలహీనపరచడంతోపాటు ఆ పార్టీ నేతల్లో భయాందోళన కలిగిస్తున్నది. మూహుర్తాలపేరుతో ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారాన్ని వాయిదా వేస్తున్నట్టు పైకి కనిపిస్తున్నా...దానికి వెనక టీఆర్ఎస్ దురుద్దేశం దాగి ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. హస్తం గుర్తుపై గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు గులాబీ కారెక్కుతున్నారంటూ ఆ పార్టీ ఇప్పటికే ప్రచారాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఈ ప్రచారం టీపీసీసీ నేతలను తీవ్ర ఆందోళన గురి చేస్తున్నది. ఉమ్మడి 9 జిల్లాల్లో సత్తా చాటిన టీఆర్ఎస్...ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మాత్రం ఆ పార్టీకి చుక్కెదురైంది. ఎలాగైనా ఆ జిల్లాకు చెందిన ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలపై దృష్టిసారించింది. పార్టీలో చేరాలంటూ ఒత్తిడికి గురి చేస్తున్నట్టు తెలిసింది. దీంతో కాంగ్రెస్ నేతలు అప్రమత్తమైనట్టు సమాచారం. ఎవరు ఎవరితో మాట్లాడుతున్నారు. ఏం మాట్లాడుతున్నారు. అనే అంశాలను ఆరా తీస్తున్నారు. ఇప్పటికే కాంగ్రెస్ నాయకత్వం ఆ ఎమ్మెల్యేలతోనూ ఫోన్లో సంప్రదింపులు జరుపుతున్నది. సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఖమ్మం జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలతో ఫోన్లో మాట్లాడారు. పార్టీని వీడొద్దంటూ వారికి భరోసా కల్పించారు. కానీ పార్టీ రాష్ట్ర నాయకత్వం ఇప్పటికైనా చొరవ తీసుకుని, కొత్తగా గెలిచిన ఎమ్మెల్యేలకు భరోసా కల్పించాలని పార్టీ కార్యాలయవర్గాలు అంటున్నాయి.

రైతు ఆత్మహత్య

నవతెలంగాణ-నేరేడుచర్ల

ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం ఇంజవారిగూడెంలో మంగళవారం జరిగింది. ఎస్ఐ సర్ధార్‌నాయక్ వివరాల ప్రకారం.. ఇంజం సత్యనారాయణరెడ్డి(45) వ్యవసాయం కలిసిరాలేదు. పెట్టుబడులు కూడా ఎల్లలేదు. దీంతో అప్పులు తీరే మార్గం లేక మనస్తాపానికి గురైన సత్యనారాయణరెడ్డి పురుగుల మందు తాగాడు. రైతు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని హుజూర్‌నగర్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

బీసీ రిజర్వేషన్లపై ఆర్డినెన్స్‌ను వెనక్కి తీసుకోవాలి : టీడీపీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీసీ రిజర్వేషన్లను తగ్గిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్ వెంటనే వెనక్కి తీసుకోవాలని, ఆ తర్వాతే పంచాయతీ ఎన్నికలను నిర్వహించాలని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు కూన వెంకటేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి జి.బుచ్చిలింగం, మ్యాడం రామేశ్వరావు, పి.రవీంద్రాచారి మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బీసీలకు అన్యాయం చేసి అణచివేయాలని చూస్తున్న కేసీఆర్‌కు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్‌పై పున:సమీక్షించాలని డిమాండ్ చేశారు.

సెన్సెక్స్ ▲186.24	నిఫ్టీ ▲ 47	డాలరుకు రూపాయి విలువ	బంగారం(10.గ్రా)	వెండి (కేజీ)	కోడిగుడ్లు (వందకి)			
36,254	10,910	69.77	రూ. 31,434	రూ. 38,800	హైదరాబాద్	433	విజయవాడ	441
					ఒక్కగుడ్డుకు	4.70	చెన్నై	455
					వరంగల్	433	ముంబయి	484

మళ్లీ పేటీఎం ఖాతాల నమోదు షురూ!

- పేమెంట్ బ్యాంక్‌కు ఆర్బీఐ గొప్ప ఊరట



న్యూఢిల్లీ: పేమెంట్స్ బ్యాంకింగ్ సేవల సంస్థ పేటీఎంకు భారీ ఊరట లభించింది. వివిధ కారణాలతో గత ఏడాది నిలిపివేసిన నూతన ఖాతాదారుల రిజిస్ట్రేషన్లను తిరిగి ప్రారంభించుకొనేందుకు గాను భారతీయ రిజర్వు బ్యాంక్ (ఆర్బీఐ) పేటీఎంకు అనుమతులిచ్చింది. దీంతో పేటీఎంకు కొత్త సంవత్సరాదిలో గొప్ప ఊరట లభించినట్టయింది. ఆర్బీఐ అనుమతులతో గత కొంతకాలంగా ఆంక్షలు ఎదుర్కొంటున్న పేటీఎం సంస్థ ఇకపై స్వేచ్ఛగా కొత్త ఖాతాదారులను చేర్చుకొనేందుకు.. సేవలను మరింత మెరుగుపరచడానికి, నిలిచిపోయిన వినియోగదారుల కేవైసీ ప్రాసెస్‌ను తిరిగి ప్రారంభించేందుకు సోమవారం నుంచి (డిసెంబరు 31) మార్గం సుగమమైంది. పేటీఎం బ్యాంక్ కెవైసీ నిబంధనలు ఉల్లంఘనల ఆరోపణలతో గత ఏడాది జూన్‌లో కొత్త కస్టమర్ల నమోదును ఆర్‌బీఐ నిలిపివేసింది. ఇదే ఆరోపణలపై బ్యాంక్ సీఈవో రేణు సతిని తొలగించి, కొత్త సీఈవో, ఎండీగా సతీష్ గుప్తాను నియమించింది. కాగా పేటీఎం పేమెంట్స్ బ్యాంకులో సుమారు 4.2 కోట్ల మేర ఖాతాలుండగా, 2019 చివరి నాటికి వీటి సంఖ్యను 10 కోట్లకు చేర్చాలని పేటీఎం లక్ష్యంగ పెట్టుకొని ముందుకు సాగుతుంది.

కొత్త సంవత్సరాదిలో శుభారంభం

- 186 పాయింట్లు రాణించిన సెన్సెక్స్



ముంబయి: కొత్త సంవత్సరాదిని దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాలతో శుభారంభం చేశాయి. మంగళవారం ఉదయం సూచీలు ఫ్లాట్‌గా ప్రారంభమ య్యాయి. ఆ తరువాత అంతర్జాతీ య మార్కెట్ల మిశ్రమ సంకేతాలకు తోడు ఐటీ, ఆటోమొబైల్ రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడితో ట్రేడింగ్ లో మార్కెట్లు కాస్త తడబడ్డాయి. ఒక దశలో నష్టాల్లోకి మళ్లాయి.. అయితే చివరి గంటల్లో బ్యాంకింగ్, వినియోగ రంగాల షేర్లలో కొను గోళ్ల అండతో సూచీలు కోలుకున్నాయి. లాభాల బాట పట్టాయి. మదు పర్ల కొనుగోళ్ల మద్దతుతో మంగళవారం సెన్సెక్స్, నిఫ్టీలు రాణించాయి. దీంతో ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 186 పాయింట్లు రాణించి 36,254 పాయింట్లకు చేరింది. మరోవైపు ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 47 పాయింట్లు లాభపడి 10,910 పాయింట్ల వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, భారతీ ఎయిర్‌టెల్, భారత్ పెట్రోలియం, యెస్ బ్యాంకు, భారతీ ఇన్‌ఫ్రాటెల్, యాక్సిస్ బ్యాంకు, ఎస్‌బీఐ షేర్లు అధిక లాభాలు సాధించి మేటిగా రాణించిన స్టాక్స్‌లో ముందు వరుసలో నిలిచాయి. మరోవైపు మహీంద్రా అండ్ మహీంద్రా, హిందాల్కో, ఇండియాబుల్స్ హౌసింగ్, టాటా స్టీల్, హెచ్‌యుఎల్, ఓఎన్‌జీసీ, జేఎస్‌డబ్ల్యు, కోటక్ బ్యాంకు షేర్లు అధికంగా నష్టపోయిన వాటిలో టాప్‌లో ఉన్నాయి. సెన్సెక్స్‌లో మొత్తం 22 స్టాక్స్ లాభాల్లో నడవగా.. తొమ్మిది స్టాక్ నష్టాల బాట పట్టాయి. బీఎస్ఈ మిడ్ క్యాప్ సూచీ 0.08% క్షీణించగా, బీఎస్ఈ స్మాల్ క్యాప్ సూచీ 0.41% మేర లాభపడింది. మార్కెట్ విస్తృతి ఆరోగ్యకరంగా కనిపించింది. బీఎస్ఈలో 1445 స్టాక్స్ లాభాల్లో నిలవగా, 1105 షేర్లు నష్టాల బాట పట్టాయి. 151 స్టాక్స్‌లో ఎలాంటి వృద్ధి కనిపించలేదు.

జీఎస్టీతో చిన్న వర్తకులు దెబ్బతిన్నారు..

- నోట్లరద్దు గురించి ముందే హెచ్చరించాం..
- ఉర్జిత్ రాజీనామకు మేము ఒత్తిడి తేలేదు: మోడీ



న్యూఢిల్లీ: తమ ప్రభుత్వ అమలులోకి తెచ్చిన వస్తుసేవల పన్ను (జీఎస్టీ) కారణంగా చిన్న వ్యాపారాలు దెబ్బతిన్నారన్న విషయాన్ని ప్రధాని మోడీ ఎట్టకేలకు అంగీకరించారు. మంగళవారం ఆయన ఏఎన్ఐ వార్తా సంస్థకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ జీఎస్టీ ఇంకా పూర్తి స్థాయిలో రూపుదిద్దుకోలేదని.. దీనిపై కసరత్తు కొనసాగుతోందనితెలిపారు. రాహుల్ గాంధీ జీఎస్టీని 'గబ్బర్ సింగ్ ట్యాక్స్'గా చెబుతుండడాన్ని మోడీ ఆక్షేపించారు. అన్ని పార్టీల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నాకే తాము జీఎస్టీని అములులోకి తెచ్చామన్నారు. ప్రణబ్ ముఖర్జీ ఆర్థిక మంత్రిగా ఉన్నప్పటి నుంచే జీఎస్టీ ప్రక్రియ మొదలైందని ఆయన అన్నారు.

బలహీన చట్టాల వల్లే వారు దేశం దాటారు..

బ్యాంకులను ముంచి విజయ్ మాల్యా, నీరవ్‌తో సహా పలువురు ఆర్థిక నేరగాళ్లు సరిహద్దులు దాటి వెళ్లిపోవడానికి.. దేశంలో అమలులో ఉన్న బలహీనమైన ఆర్థిక చట్టాలే కారణమని ప్రధాని మోడీ అన్నారు. వీటిని సమీక్షించి బలమైన చట్టాలను అమలులోకి తెచ్చే ప్రక్రియను తమ సర్కారు కొనసాగిస్తోందని ఆయన అన్నారు. ఆర్థిక మోసగాళ్లను వెనక్కి రప్పించేందుకు గాను అన్ని చర్యలు చేపడుతున్నట్టు ఆయన తెలిపారు. వారి వద్ద నుంచి తాము ప్రతి పైసా రాబడుతామని ఆయన తెలిపారు.

నోట్ల రద్దు ఆకస్మిక నిర్ణయం కాదు..

దేశంలో చేపట్టిన పెద్దనోట్ల రద్దు ప్రక్రియన తాము తీసుకున్న ఆకస్మిక నిర్ణయం కాదని మోడీ తెలిపారు. ఇది ఆర్థిక వ్యవస్థకు కుదుపు ఏ మాత్రం కాదని ఆయన అన్నారు. వ్యవస్థను శద్ధి చేసేందుకు గాను నోట్ల రద్దు అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. నోట్లరద్దుకు ఏడాది ముందు నుంచే ప్రజలను తాము హెచ్చరిస్తూ వచ్చామని ప్రధాని అన్నారు. నల్లధనం ఉంటు ప్రజలు వెంటనే డిపాజిట్ చేయమని కోరామని.. లేకుంటే తగిన జరిమానాను ఎదుర్కోవాల్సి వస్తుందని తాము ప్రజలకు ముందే తెలిపామని ఆయన అన్నారు. అయితే చాలా మంది తన వ్యాఖ్యలను లైట్ తీసుకున్నారని.. ఇతర నేతల్లాగా మోడీ కూడా మాటలు తప్ప చేతలు చేయలేరని వారు భావించారని మోడీ తెలిపారు. అయితే నోట్లరద్దులో వ్యవస్థ శుద్ధిచేయబడిందని ఆయన అన్నారు.

ఉర్జిత్ ముందే వైదొలుగుతానన్నారు

భారతీయ రిజర్వు బ్యాంక్ (ఆర్బీఐ) మాజీ గవర్నర్ ఉర్జిత్ పటేల్ రాజీనామాపై దేశ ప్రధాని నరేంద్ర మోడీ తొలిసారిగా పెదవి విప్పారు. ఉర్జిత్‌ను రాజీనామా చేయమని తాము కోరలేదని ఆయన తెలిపారు. అలాగని.. ఆయనపై రాజకీయ ఒత్తిడి కూడా తీసుకురాలేదని ఆయన వివరించారు. మంగళవారం ఆయన ఏఎన్ఐ వార్తా సంస్థకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన ఈ విషయం వెల్లడించారు. ఆర్బీఐ అధినేత పదవి నుంచి తప్పుకోనున్నట్టుగా ఆయన కొన్ని నెలల ముందే తనకు సమాచారం ఇచ్చినట్టుగా మోడీ తెలిపారు. వ్యక్తిగత కారణాలతో తాను పదవి నుంచి వైదొలగాలని భావిస్తున్నట్టుగా ఉర్జిత్ ఆరేడు నెలల ముందే తనకు లిఖితపూర్వకంగా తెలియజేశాడని మోడీ వెల్లడించారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఆర్బీఐ వద్ద ఉన్న అదనపు నిధులను కోరడంతో పాటు పెద్ద బ్యాంక్ విధివిధానాలు, పనితీరు విషయం ప్రభుత్వం, ఆర్బీఐకి మధ్య వివాదం తారాస్థాయికి చేరి నేపథ్యంలో ఆర్బీఐ అధినేత పదవి నుంచి ఉర్జిత్ పటేల్ అకస్మాతుగా తన పదవికి రాజీనామా చేయడం తెలిసిందే. వ్యక్తిగత కారణాలను చూపుతూ ఆయన తన పదవకి రాజీనామా చేసినప్పటికీ.. ఆర్బీఐ బోర్డు పేరుతో సర్కారు చేసిన రాజకీయ ఒత్తిడి కారణంగానే ఆయన వైదొలిగినట్టుగా విమర్శలు వినవచ్చిన నేపథ్యంలో మోడీ మంగళవారం ఈ విషయమై తన వివరణనిచ్చారు. ఉర్జిత్ రాజీనామాకు వెనుక ఆలాంటి కారణాలకు ఆస్కారమేలేదని అన్నారు. ఆర్బీఐ గవర్నర్‌గా ఉర్జిత్ చేసిన సేవలను ఆయన ఈ సందర్భంగా ప్రశంసించారు.

రికార్డు స్థాయికి వాటాల విక్రయం!

- 2018లో 77వేల కోట్ల డిజిన్వెస్ట్‌మెంట్



న్యూఢిల్లీ: ఎన్నికలు సమీపిస్తున్న వేళ కేంద్రంలోని మోడీ సర్కరు వీలైనంత గరిష్ట స్థాయిలో ప్రభుత్వ రంగ సంస్థలో వాటాల విక్రయాన్ని చేపడుతోంది. తాజా సమాచారం మేరకు 2018లో మోడీ సర్కార్ ప్రభుత్వ రంగ సంస్థల్లో రికార్డు స్థాయిలో రూ.77,417 కోట్ల వాటాలను విక్రయించింది. దీనికి కొనసాగింపుగా కొత్త సంవత్సరాదిలో కూడా భారీ ఎత్తున డిజిన్వెస్ట్‌మెంట్ చేయనుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా గతేడాది హెచ్‌పీసీఎల్‌ను ఓఎన్‌జీసీ స్వాధీనంలోకి తీసుకోవడం, సీపీఎస్ఈ, ఈటీఎఫ్, భారత్-22 ఈటీఎఫ్, కోల్ ఇండియాలో వాటాలను విక్రయించారు. అదే విధంగా మరో ఆరు ప్రభుత్వ రంగ సంస్థలను పబ్లిక్ ఇష్యూకు తీసుకువచ్చారు. తద్వారా సర్కారు రూ.77,412 కోట్ల విలువ చేసే వాటాలను విక్రయించింది. ఇదే సమయంలో ఎయిరిండియాలో 74 శాతం వాటాను విక్రయించడానికి ప్రయత్నించి విఫలమైంది. దీంతో తాజాగా ఎయిరిండియా విక్రయానికి కేంద్రం కొత్త ప్రణాళికలు వేస్తోంది. ఇందులో భాగంగానే ఆ సంస్థ ఆస్తులను విడదీసి అమ్మడానికి కసరత్తు చేస్తుంది. ఎయిర్ ఇండియా ఎయిర్ ట్రాన్స్‌పోర్టు సర్వీసెస్ లిమిటెడ్, ఎయిర్ ఇండియా ఇంజనీరింగ్ సర్వీసెస్ లిమిటెడ్ లాండ్ అండ్ బిల్డింగ్ అసెట్స్ ఆఫ్ ఎయిర్ ఇండియాను వేరు వేరుగా చేసి విక్రయించడం ద్వారా ఎయిరిండియా రుణ భారాన్ని రూ.29,000 కోట్లకు తగ్గించాలని కేంద్ర యోచనగా ఉంది. అదే విధంగా సబ్సీడరీ ఆస్తుల విక్రయం ద్వారా రూ.9,000 కోట్ల వరకు రాబట్టుకోవాలని ప్రభుత్వ ఆలోచనగా ఉంది. 2019లో ముఖ్యంగా పవన్ హాన్స్‌లో వాటా విక్రయించాలనేది మోడీ సర్కార్ ప్రణాళిక.ఈ హెలిక్యాప్టర్ సేవల సంస్థను వచ్చే మార్చి ముగింపు నాటికి ప్రయివేటు శక్తులకు విక్రయించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. అదే విధంగా 10 కేంద్ర ప్రభుత్వ కంపెనీల్లో డిజిన్వెస్ట్‌మెంట్ చేయాలనేది ప్రధాన ఉద్దేశంగా ఉంది. ఇందులో ఓఎన్‌జీసీ, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, ఆయిల్ ఇండియా, ఎన్ఎల్‌సీ, భెల్, నాల్కో కంపెనీలున్నాయి. వీటిల్లో వాటాల విక్రయం ద్వారా రూ.12,000 కోట్లు రాబట్టుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. అదే విధంగా రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ (ఆర్‌ఈసీ)ని పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా కొనిపించాలని కేంద్ర యోచన. దీని ద్వారా రూ.15,000 కోట్లు పొందాలని యోచిస్తుంది. అదే విధంగా ప్రభుత్వానికి చెందిన ఎస్‌జేవీఎన్‌ను ఎన్‌టీపీసీ ద్వారా కొనుగోలు చేయించడం ద్వారా రూ.6,000 కోట్లు రాబడి పొందడానికి ప్రణాళికలు వేసింది.

మరోమారు క్షీణించిన జీఎస్టీ వసూళ్లు



న్యూఢిల్లీ: వస్తు సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు మరోమారు క్షీణించాయి. సోమవారంతో ముగిసిన డిసెంబరు మాసంలో జీఎస్టీ పన్ను వసూళ్లు రూ.94,726 కోట్లకు పడిపోయాయి. అంతకు ముందు నవంబరు నెలలో జీఎస్టీ వసూళ్లు రూ.97,637 కోట్లుగా నమోదయ్యాయి. 2018 డిసెంబరు 30 నాటికి మొత్తం జీఎస్టీఆర్-3బీ రిటర్నుల నమోదు సంఖ్య 72.44 లక్షలకు చేరినట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ మంగళవారం వెల్లడించింది. క్రితం మాసంలో కేంద్ర జీఎస్టీ కింద రూ.16,442కోట్లు వసూలు కాగా.. రాష్ట్ర జీఎస్టీ కింద రూ.22,459కోట్లు, ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ (ఐజీఎస్టీ) రూ.47,936 కోట్లు, సెస్ కింద రూ.7,888 కోట్లు వసూలు అయ్యాయంటూ ప్రభుత్వం గణాంకాలను వెల్లడించింది. గతేడాది రెండు సార్లు జీఎస్టీ వసూళ్లు రూ.లక్ష కోట్ల మార్క్‌ను నమోదు చేశాయి.

ఏడాది తొలిరోజే జిగేలుమన్న పసిడి ధర

న్యూఢిల్లీ : కొత్త ఏడాది తొలి రోజు బంగారం ధరలో పెరుగుదల చోటు చేసుకుంది. అంతర్జాతీయంగా పసిడికి డిమాండ్ పెరగడంతో పాటు దేశీయంగా అభరణాల వర్తకులు కొనుగోళ్లకు మొగ్గు చూపడంతో సోమవారం బంగారం, వెండి ధరలు మరింత ప్రియమయ్యాయి. దేశీయంగా న్యూఢిల్లీ బులియన్ మార్కెట్‌లో 99.9 శాతం, 99.5 శాతం స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.200 పెరిగి వరుసగా రూ.32,470, రూ.32,320గా పలికింది. కిలో వెండిపై రూ.150 భారమై రూ.39,250గా నమోదయ్యింది.

కొత్త ఏడాదిలో ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం : టీఎన్జీవో




నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కొత్త ఏడాదిలో ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షులు కారం రవీందర్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నూతన సంవత్సరం వేడుకలు టీఎన్జీవో భవన్‌లో ఘనంగా జరిగాయని పేర్కొన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హైకోర్టు ఏర్పాటు కావడం శుభసూచకమని తెలిపారు. నాలుగేండ్ల పోరాట ఫలితంగా హైకోర్టు ఏర్పడిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు, ఉద్యోగులకు సత్వర న్యాయం జరుగుతుందని తెలిపారు. విభజన సమస్యల పరిష్కారం కోసం సీఎం కేసీఆర్ చేస్తున్న కృషికి అభినందిస్తున్నామని పేర్కొన్నారు. ఉద్యోగులకు కొత్త పీఆర్సీ అమలు, పింఛనర్లకు డైరెక్టరేట్ ఏర్పాటు, ఆంధ్రలో పనిచేస్తున్న తెలంగాణ ఉద్యోగులను ఈ రాష్ట్రానికి తీసుకురావడం వంటి సమస్యలు పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చి సాధిస్తామని తెలిపారు. కొత్త జిల్లాల కార్యాలయాల బలోపేతం కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయడం ద్వారా ఉద్యోగులకు ఉన్న పనిభారాన్ని తగ్గించవచ్చని తెలిపారు. ఉద్యోగ విరమణ వయస్సును పెంచడం ద్వారా రాష్ట్రానికి అవసరమైన సేవలను వినియోగించుకునేటట్టుగా చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేందర్, కోశాధికారి రామినేని శ్రీనివాసరావు, నాయకులు కొండల్‌రెడ్డి, కస్తూరి వెంకటేశ్వర్లు, ప్రతాప్, నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- తెలంగాణ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు సంపత్‌కుమార్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను టీఆర్ఎస్ ప్రభుత్వం పరిష్కరించాలని తెలంగాణ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు చిలగాని సంపత్‌కుమారస్వామి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం సంఘం రాష్ట్ర కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించామని పేర్కొన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు సుఖసంతోషాలతో ఉండాలనీ, విధులు సక్రమంగా నిర్వహించాలనీ తెలిపారు. ఉద్యోగుల సమస్యలపై ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. కాంట్రిబ్యూటరీ పింఛన్ స్కీం (సీపీఎస్) రద్దు, ఉద్యోగ విరమణ వయస్సును 61 ఏండ్లకు పెంపు, కాంట్రాక్టు ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం, ఆరోగ్య కార్డులు మంజూరు చేయడం, ఉద్యోగులకు మధ్యంతర భృతి (ఐఆర్)ను వెంటనే ప్రకటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి జి బాలస్వామి, నాయకులు జి నిర్మల, ఆనంద్‌యాదవ్, ఆకుల రామలక్ష్మి, సైఫాబేగం, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో సీఎండీకి

సీజీఎం నూతన సంవత్సర శుభాకాంక్షలు

హైదరాబాద్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని టీఎస్ జెన్‌కో, టీఎస్ ట్రాన్స్‌కో సీఎండీ డి. ప్రభాకర్‌కు సిబ్బంది నుంచి శుభాకాంక్షలు అందాయి. ఆయనకు శుభాకాంక్షలు తెలిపినవారిలో సీజీఎం కె. వెంకటేశ్వర్లు, ఎస్ఈ చంద్రప్రకాశ్, డీఎం(హెచ్ఆర్) ఎండీ ఫసీయుద్దీన్ ఫిరోజ్, ఇతర అధికారులు ఉన్నారు.

దక్షిణ భారత హీరో కేరళ సీఎం విజయనే

వరదల నుంచి రాష్ట్రాన్ని కాపాడిన కామ్రేడ్

- ప్రజల గుండెల్లో మనోధైర్యం నింపిన నేతగా ప్రశంసలు
- శబరిమలై రగడలోనూ విజయ(ం)న్‌దే హవా!

కొన్ని విపత్తులు... మరికొన్ని సామాజిక సమస్యలు సాధారణంగా ఒక నాయకుడిగా సవాలుగా మారుతాయి. తనలోని నాయకత్వపు లక్షణాలకు పరీక్షగా తయారవుతాయి. బాధ్యతారహితమైన నాయకుడు వాటిని ఎదుర్కొకోలేకపోతాడు. బరువైన బాధ్యతలకు భయపడిపోతాడు. కానీ, చిత్తశుద్ధి కల్గిన నేత విపత్తులను కూడా వివేకంతో ఎదుర్కొంటారనడానికి ఆయన నిలువెత్తు నిదర్శనం. సమస్యలపై సమరభేరి మోగిస్తారు. ఇటువంటి లక్షణాలు పక్కాగా ఉన్న నేత ఎవరంటే కేరళ సీఎం పినరయ్ విజయన్ అని ఎటువంటి సందేహం లేకుండా స్పష్టంగా చెప్పవచ్చు. తన బాధ్యతలు విస్మరించని సీఎంగా ఆ రాష్ట్ర ప్రజల గుండెల్లో నిలిచిపోయారు. విపత్తులు, మతోన్మాదపు ప్రచారం ఉప్పెన వలె ఆయన ప్రభుత్వాన్ని ముంచేత్తుతున్నా.... ప్రజానీకానికి ఆశల తీరం చూపించిన నేతగా ప్రశంసలు పొందారు. అందుకే, ఆయనను ఓ ఆంగ్ల మ్యాగజైను 2018 దక్షిణ భారత హీరోగా అభివర్ణించి ఓ కథనాన్ని ప్రచురించింది.

నవ తెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో






ఇటీవల కేరళ రాష్ట్రాన్ని అతలాకుతలం చేసిన వరదలు, శబరిమలై వివాదాలు ఆయనను దక్షిణ భారతంలో బలమైన నేతగా, సాఫ్ట్‌ఫుల్ నాయకుడిగా ఎదిగేందుకు దోహదపడ్డాయి. ముఖ్యంగా వరదల సమయంలో కేంద్రం నుంచి పెద్దగా సాయం లేకపోయినా, నీటి తాకిడి విపత్తు నుంచి రాష్ట్రాన్ని కాపాడటంలో తీవ్రంగా కృషి చేశారు. తన అసమానమైన నాయకత్వ లక్షణాలతో రాష్ట్రాన్ని వాతావరణ సంక్షోభం నుంచి బయటపడేశారు. వరద ఉధృతి రోజురోజూకి అధికమవుతున్న తరుణంలో తన మంత్రివర్గ సహచరులు, పార్టీ సభ్యులు, రాష్ట్ర ప్రజానీకంలో అనుక్షణం ఆయన మనోధైర్యం నింపేందుకు యత్నించారు. ప్రతిరోజూ జరిగిన మీడియా సమావేశాల్లో వరద బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పడంతో అక్కడి ప్రజానీకానికి కొండంత ధైర్యమనిపించింది. తన శరీర ఆరోగ్యం సహకరించక పోయినా... వరదలకు సంబంధించి ఏ రాత్రి ఫోను వచ్చినా విజయన్ సమాధానం ఇవ్వడం విమర్శకుల్లో సైతం ఆలోచన రెకెత్తించింది. అనుదినం మీడియా సమావేశాల్లో సీఎం పినరయ్ విజయన్ మాట్లాడుతూ... ఇండ్లు కోల్పోయామని బాధపడొద్దు... ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పడంతో తమ ఆందోళన గురించి సర్కారు ఆలోచిస్తుందని పాలక్కడ్‌కు చెందిన విద్య అనే డాక్టర్ మీడియాతో వ్యాఖ్యానించడం చర్చనీయాంశమైంది. నిత్యం వరద ప్రభావిత ప్రాంతాల్లో విజయన్ పర్యటించడం, సమస్యలు తెలుసకోవడం చేశారన్నారు. వారితోనే ముఖ్యమంత్రి ఉండటం ప్రజల మదిలో బలంగా నిలిచిపోయింది. సాధారణంగా వరదలు, విపత్తులు రాగానే కొంతమంది నాయకులు, వారి అనుచరగణం ప్రజల కోసం పనిచేస్తున్నట్టు జిమ్మికులు చేస్తుంటారు. నిత్యం ఏదోక విధంగా ఎత్తుగడలు వేస్తూ, అది చేశాం... ఇది చేశాం అనిపించుకునేందుకు ప్రయత్నిస్తుంటారు. ఫోటోలకు పోజులిచ్చి కార్యక్రమాన్ని మమా అనిపిస్తుంటారు. కానీ, విజయన్ మాత్రం అటువంటి ఎత్తుగడలు ఏమీ వేయలేదు. కేవలం, వరద ప్రభావిత ప్రాంతాల్లో సాధారణంగా తన గొడుగు తానే పట్టుకొని సంచరించారు. ముఖ్యమంత్రిగా తన విధులను సమర్థవంతంగా నిర్వర్తించేందుకు సంపూర్ణంగా పనిచేశారు. కేరళ ఆర్థిక శాఖ మంత్రి థామస్ ఐసాక్ వరదలు ఉధృతమవుతున్న సమయంలో ఓ సమావేశంలో మాట్లాడుతూ... "కేంద్రం సాయం లేకుండా ఈ విపత్తు నుంచి ఎలా బయటపడటమని తమ మంత్రివర్గం ఎంతోగానో ఆందోళన చెందింది. విపత్తు సృష్టించిన విలయ తాండవం ఆర్థికంగా రాష్ట్రానికి పెను సవాలు అవుతుందని కలత చెందాం. కానీ, మా ముఖ్యమంత్రి ఎంతో ధైర్యాన్ని ఇచ్చారు. ప్రజలకు ముందుగా ధైర్యం చెబుదాం. మనమే ధైర్యం కోల్పోతే ఎలా? అని మమ్మలి ప్రశ్నించి, మాలో విజయన్ మనోధైర్యం నింపారు. ఇదే విషయాన్ని మేమంతా స్థానిక అధికార యంత్రాంగానికి, పార్టీ క్యాడర్‌కు నిత్యం ఉద్బోధించాం. ఆ విధంగా అంత పెద్ద ప్రకృతి విధ్వంసంపై ప్రజలకున్న భయాలను తొలగించగలిగాం. విధ్వంసం నుంచి బయటపడగలిగాం" ఆయన అభిప్రాయాన్ని వెల్లడించారు. వరదలు వికృత రూపం దాల్చి కేరళలో భయోత్పాతానికి గురి చేసిన సందర్భంలో ప్రధాని మోడీ కూడా ఆ రాష్ట్రాన్ని సందర్శించారు. ఆ సమయంలో కూడా పినరయ్ విజయన్ ఆయనకు స్వాగతం పలికిన తీరు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రశంసలు పొందింది. కేవలం ముగ్గురు అంటే ముగ్గురు అధికారులు, సీఎంతో ప్రధానికి స్వాగతం పలికారు. ఆయనతో పాటు ఏరియల్ సర్వే చేపట్టారు. పర్యటన తర్వాత కూడా పీఎం మోడీని కేరళను ఆదుకోవాలని అభ్యర్థించారు. అయితే, కేంద్ర ప్రభుత్వం రూ.600 కోట్లు(అవి కూడా విడతవారీగా) ఇచ్చి చేతులు దులుపుకోవడం సర్వత్రా విమర్శలు ఎదురయ్యాయి. మోడీ సర్కారు నుంచి సాయం సరైన విధంగా లేకపోయినా, వరద బాధితులకు అండగా ఉండి వారందరికి ఆయన ఆరాధనీయుడయ్యారు.



మత పిచ్చాస్పత్రిగా రాష్ట్రాన్ని మార్చొద్దు

ఆర్ఎస్ఎస్‌కు హెచ్చరిక



దక్షిణ భారతంలో కీలక రాష్ట్రమైన కేరళను మతోన్మాదుల పిచ్చాస్పత్రిగా మార్చవద్దని ఆర్ఎస్ఎస్‌కు విజయన్ గట్టి సవాలు విసిరారు. శబరిమల ఆలయంలోకి మహిళల ప్రవేశాన్ని అనుమతిస్తూ సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పునకు వ్యతిరేకంగా సంఘ్‌పరివార్ సంస్థలు కొనసాగిస్తున్న కుటిల యత్నాల నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మలయాళ కొత్త సంవత్సరారంభం రోజున మహిళలతో మానవహారాన్ని నిర్వహించి, ఆలయంలోకి అనుమతించేందుకు తమకు ఎటువంటి అభ్యంతరం లేదని ఘంటాపథంగా చెప్పారు. శబరిమలైలోకి మహిళలను అడ్డుకునేందుకు మతోన్మాద శక్తులు పెద్ద ఎత్తున ప్రయత్నించిన విషయం తెలిసిందే. ప్రవేశించాలని భావించిన మహిళలను రాళ్ళు, కర్రలతో దాడి చేశారు. బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా మహిళ ప్రవేశానికి వ్యతిరేకంగా వ్యాఖ్యానాలు చేశారు. విజయన్ ప్రభుత్వం తమ నాయకులను అణచివేస్తుందని అడ్డగోలు ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ కూడా హిందూ ఓటు బ్యాంకు ఎక్కడ కోల్పోతామో అని విజయన్ ప్రభుత్వంపై దండయాత్ర చేసింది. ఈ విషయం ప్రభుత్వంలోని కొందరిని కలవరపెట్టింది. అయితే, ఆ రాష్ట్ర హైకోర్టు బీజేపీ నాయకులపై తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేయడంతో బీజేపీ అగ్రనేతలు తట్టాబుట్టా సర్ధుకొని ఢిల్లీకి చేరుకున్నారు. మత, సామాజిక గొడవలు ఉచ్ఛ స్థాయిలో ఉన్న సమయంలో కూడా విజయన్ ఏమాత్రం బెదరలేదు. రాష్ట్రాన్ని ప్రగతిశీల మార్గంలో నడిపించడానికే ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని, అందుకోసం కొన్ని సీట్లు, ఓట్లను కోల్పోయినా ఆందోళన పడబోమని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం రాజకీయాల్లో ఇటువంటి వ్యాఖ్యలు చెయాలంటే, ఒక నాయకుడికి ఎంతో ధైర్యం అవసరమని మలయాళ నటుడు ఎన్ఎన్ పిళ్ళై చెప్పారు. మతంపై కపట నీతి ప్రదర్శించే నేటి రాజకీయ నాయకులకు విజయన్ ఒక సింహస్వప్నమని ఆయన అభివర్ణించారు. శబరిమల ఆలయంలోకి మహిళలు ప్రవేశించరాదంటూ కొందరు హిందుత్వ వాదులు నిరసనలు పెద్ద ఎత్తున చేపడుతున్న సమయంలో, పిళ్ళై తిరువనంతపురంలో నిర్వహించిన ఓ కార్యక్రమం సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేశారు. కేరళలో కొందరు మత విభజనను సష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. దాంతోపాటు, కొన్ని ఓట్ల కోసం సాంఘిక దురాచారాలను రాష్ట్రంలోకి అనుమతించమని విజయన్ ఉద్ఘాటించారు. కేరళలో మతతత్వ విభజనను స ష్టించేందుకు కొంత మంది ప్రయత్నిస్తున్నారు. ఆచారాలు, నమ్మకాల పేరుతో విభజనకు అనుమతించినట్లయితే, కేరళ తన ఉనికిని కోల్పోతుందని' సీఎం మొదటి నుంచి చెప్పొకొచ్చారు. కాగా, రాష్ట్రాన్ని రాజకీయంగా, ఆర్థికంగా బలహీనపరిచే అంశాలే ఆయనలోని బలమైన నాయకుడిని యావత్ ప్రపంచానికి పరిచయం చేశాయని మీడియాలోకం కూడా పెద్ద ఎత్తున కథనాలు ప్రచురించింది.

జరదేఖో
నవతెలంగాణ
11 హైదరాబాద్ page.jeradekho@gmail.com
బుధవారం 2-1-2019



సువీశాలమైన ప్రదేశం. చుట్టూ అందమైన మంచుకొండలు. గల గలా ప్రవహించే నదులు. ఓ ప్రపంచ వింతను తనలో ఇముడ్చుకున్న ఘనమైన దేశం చైనా. అలాంటి దేశాన్ని దర్శించాలని ప్రతి ఒక్కరికీ ఉంటుంది. అలాంటి అద్భుతమైన చైనా మహాకుడ్యాన్ని వీక్షించే అవకాశమే మాకు వచ్చింది. ఆ అనుభవాలను ఈ రోజు జరదేఖోతో పంచుకోవడం మరింత ఆనందంగా ఉంది.

అద్భుతం ఆ మహాకుడ్యం



పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా రాజధాని అయినటువంటి బీజింగ్‌ను దర్శించటానికి మేమంతా అంటే సుమారు 70 మంది డాక్టర్ల కుటుంబాలతో సహా బయల్దేరి వెళ్ళాం. నేను మావారు, మా చిన్నబ్బాయి స్వాప్నిక్ ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టుకు చేరాం. అందరం అక్కడే కలుసుకొని చైనా బయల్దేరాలి. చైనా ఈస్టర్న్ ఎయిర్ లైన్స్ వారి విమానంలో రాత్రి 9:25 ని॥లకు ఢిల్లీలోని టెర్మినల్ 3 నుండి షాంఘై బయల్దేరాం. షాంఘై నుండి బీజింగ్‌కు మరొక విమానమెక్కాలి. విమానం పైకెగరగానే పై నుంచి ఢిల్లీ నగరం పాపిడిబొట్టు, వడ్డాణం, మెడనిండా హారాలు, కాళ్ళకు మువ్వలతో సహా సకల ఆభరణాలనూ ధరించిన నవ యవ్వనవతిలా ఉంది. ఆ సోయగాలను ఆస్వాదిస్తూ విమానంలో కిటికీ పక్కన సీట్లో కూర్చు న్నాను. చైనీస్ ఎయిర్‌లైన్స్ కాబట్టి ఎయిర్‌హోస్టస్‌లు చైనీయులే ఉన్నారు. టీవీలో చైనీస్ లాంగ్వేజ్ వినిపిస్తున్నది. వార ణాసి, ఢాకా నగరాలను దాటుకుంటూ ఉదయం 5-30కు షాంఘై లోని 'పుడాంగ్ ఎయిర్‌పోర్టు'కు చేరుకున్నాం. విమానం నుంచి షాంఘై నగర లైట్లను చూసినప్పుడు ఢిల్లీ కన్నా భిన్నంగా కనిపిం చింది. అన్నీ పసుపు రంగు లైట్లు కనిపిస్తున్నాయి. దాంతో కొన్ని ఎకరాల మేర బంగారు పంట పండినట్లుగా కనపడుతున్నది. ఢిల్లీ నగరమేమో నవరత్నాలతో సర్వాలంకార భూషితంగా ఉంటే షాంఘై నగరం మాత్రం కేవలం బంగారం పంట పండించినట్లుగా ఉన్నది. షాంఘై నుండి బీజింగ్ చేరేసరికి ఉదయం 10:30 గంటలు అయింది.

నిలకడైన వాతావరణం

బీజింగ్ కేవలం చైనాకు రాజధాని మాత్రమే కాదు. నేషనల్ పొలిటికల్, కల్చరల్ సెంటర్. మన హైదరాబాదు లాగానే దీనికీ ఓల్డ్ సిటీ, న్యూ సిటీ అని రెండు ఉన్నాయి. ఓల్డ్ సిటీ సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక. ఈ శతాబ్దంలోనే చైనా బాగా అభివృద్ధి చెందింది. చైనా దేశం జనాభాలో మొదటిస్థానం, భూ భాగంలో మూడవ స్థానాన్ని ఆక్రమించియున్నది. ఇక్కడి కరెన్సీని 'యువాన్లు' అంటారు. మేము వెళ్ళిన రోజు ఒక యువాన్‌కు 72 భారతదేశ రూపాయలు. ఇక్కడ ఉష్ణోగ్రత మైనస్ డిగ్రీలలో ఉంటుంది. ఎండాకాలంలో కూడా ఎండ చాలా తక్కువగా ఉంటుందట. రకరకాల నేలలు, పెద్దదైన భూభాగం, వాతావరణం ఎప్పుడూ నిలకడగా ఉండకపోవడం వల్ల సందర్శనకు ఇది అనువైన సమయమని చెప్పేందుకు లేదు.

వర్ణమాల లేని భాష

యాంగ్జీనది చైనాను ఉత్తర దక్షిణ ప్రాంతాలుగా విడగొడుతుంది. చైనా భూభాగంలో మూడింట రెండు వంతులు పర్వతాలే ఉన్నాయి. దీని భూభాగ వైశాల్యం 9.6 మిలియన్ చ.కి. యాంగ్జీనది చైనాలో అతిపెద్దనది. ప్రపంచంలోని అతిపెద్ద నదులైన నైల్, అమెజాన్‌ల తర్వాతి స్థానం దీనిదే. చైనాలో నాగరికత వెల్లివిరియటానికి దేశంలోని రెండవ అతిపెద్ద నదైన పసుపునది కారణమని చెబుతారు. ప్రపంచంలోని అతి ప్రాచీన భాషల్లో ఒకటైన చైనీస్ భాషకు వర్ణమాల వ్యవస్థలేదు. ఇది చిత్రలేఖనం రూపంలో ఉంటుంది. ఈ భాష స్వర సంబంధిగా ఉండటం వల్ల మనకు అన్ని మాటలూ ఒకే రకంగా వినబడతాయి. చైనా అధికార భాషను ఇంగ్లీషులో 'మాండరిన్' అంటారు. చైనా వెళ్ళబోయే ముందే ట్రావెల్స్ వాళ్ళు మనకవసరమయ్యే మాటల్ని చైనా భాషలో ఏమనాలో పేపర్ ప్రింటవుట్లు ఇచ్చారు. వాటిని ఎంతసేపు చదివినా పేపర్ దగ్గరుంటే తప్ప ఏదీ గుర్తుండేలా లేదు. బాగా చదివి 'థ్యాంక్ యూ' అనే పదానికి 'జీజీనీ' అనాలని గుర్తుపెట్టుకున్నాం. ప్రతిచోటా అందరికీ 'జీజీనీ' అని చెప్తుంటే వాళ్ళు సన్నగా నవ్వుకుంటున్నారు. 'ఎలా ఉన్నారు' అని అడగాలంటే 'ని హావో మా' అనాలి. ఏదైనా వస్తువు కొనాలంటే 'రేటెంత' అని అడగాలి కదా దానికి 'డుమో షావో కియాన్?' అని అడగాలి. ఇలా వాళ్ళ భాష గురించి వివరాలు తెలుసుకున్నాం.

భూమిపై హక్కు ప్రభుత్వానిదే

బీజింగ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో దిగి ఊర్లోకి వస్తుంటే ఆకాశాన్నంటే భవనాలు, అద్భుతమైన రోడ్లు కనువిందు చేశాయి. అన్నీ ఫ్లైవోవర్లే. మేం ఎయిర్‌పోర్టు నుంచి హోటల్‌కు చేరే వరకూ ఎక్కడా ట్రాఫిక్ సమస్య లేనే లేదు. ఏ బిల్డింగ్ చూసినా పది అంతస్థులకు తక్కువ కనిపించలేదు. అక్కడి పంటపొలాలు కొనుక్కోవటం గానీ, కొనుక్కున్నాక తమ పిల్లలకు రిజిస్ట్రేషన్లు ఏమి ఉండవట. భూమి ఏదైనా ప్రభుత్వానిదే. కావాలంటే 30 లేదా 40 ఏండ్లు కిరాయికి ప్రభుత్వం నుంచి తీసుకొని ఆ తరువాత మరల ప్రభుత్వానికే అప్పజెప్పాలి. వాళ్ళ పిల్లలకు ఇవ్వడానికి వీలు లేదు. పిల్లలు పెద్దవాళ్ళయి వ్యవసాయం చేసుకుంటానంటే మరల ప్రభుత్వం నుంచి కిరాయికి పొలం తీసుకోవాల్సిందే. ఎయిర్‌పోర్టు నుండి హోటల్‌కు చేరేదాకా గైడు ఈ విషయాలన్నీ చెపుతూ కూర్చున్నది. బస్సులో ఓ మైకు ఉంటుంది. ఆ మైకు ద్వారా ఆమె ఇవన్నీ మాట్లాడింది. ఆ గైడు పేరు 'అమీ'.



ఆక్రో బాటిక్ షో

సాయంత్రం 6:30 గంటలకు జనోషా థియేటర్‌లో 'ఆక్రో బాటిక్ షో' చూపించారు. ఇది చాలా అద్భుతంగా ఉన్నది. దీంట్లో చైనా వాళ్ళ సాంప్రదాయక నృత్యంతో పాటు సర్కస్ ఫీట్లన్నీ ఉన్నాయి. ఒక ఇనుప గోళంలో మోటరు సైకిళ్ళతో స్పీడుగా నడపడం అంటే ఎంత కష్టం. ఏ మాత్రం బ్యాలెన్స్ తప్పినా చాలా ప్రమాదం. చూడటానికి చాలా ఆనందాన్నీ, సంభ్రమాశ్చర్యాల్నీ కలగజేసినా వాళ్ళ జీవితాలు ఎంత రిస్క్‌తో కూడుకున్నవో తెలిస్తే, ఆ ఆనందమంతా ఆవిరై పోతున్నది. దాదాపు పది బంతుల్ని తెలిస్తే, ఆ ఆనందమంతా ఆవిరై పోతున్నది. దాదాపు చేతులతో పట్టుకుంటూ ఉండటం, తల మీద టోపీలను పైకెగరవేసి ఒకరిని మరొకరు పట్టుకోవటం వంటివి వారి హస్త నైపుణ్యానికి, ఏకాగ్రతకు నిదర్శనం. కొంతమంది రాజులుగా, జోకర్లుగా వేషాలు వేసుకొనీ, మరికొంతమంది అమ్మాయిలు అందంగా అలంకరించుకొని డాన్స్ చేయటం వారి సాంస్కృతిక వారసత్వానికి చిహ్నంగా కనిపిస్తుంది. ఇంకొందరు కుర్చీలను కింది నుంచి పైకి వంకరటింకరగా ఒకదానిపై మరొకటి పేర్చుకొని దానిపైకి ఎక్కుతూ, తల మాత్రమే వాటికి ఆన్చి శరీరమంతా గాల్లో తేలేలా చెయ్యటం చూస్తుంటే వాళ్ళు పడిపోతారేమో, పడిపోతారేమో అని మనకు టెన్షన్ అనిపిస్తుంది. ఇలా కుర్చీలపైకెక్కటం, రింగుల్లోంచి దూరి ఒకరిపై మరొకరు పడటం, మోటారు సైకిళ్ళ విన్యాసం- ఈ సర్కస్ ఫీట్లన్నీ ఎంత ప్రాణాంతకమో తెలిస్తే చాలా బాధనిపించింది. ఇలా ఒకసారి కాదు కదా! ప్రతి రోజూ రెండు మూడు షోలు ఇవ్వాలి. స్టేజి షో కాబట్టి తప్పు జరగడానికి లేదు. ఇలా జీవిత కాలం ప్రమాద పరిస్థితితో ఉండటమనే విషయాన్ని ఆలోచిస్తేనే విషాదం అనిపించింది. ఏది ఏమైనా పిల్లలూ, పెద్దలూ ఈ ప్రదర్శన చూసి ఆశ్చర్యంతో నోరు తెరవని వారు లేరు. ఇంకా కుంగ్‌ఫూ ప్రదర్శన కూడా ఉంటుందట గానీ మాకు చూడటానికి టైమ్ దొరకలేదు.

ప్రతిరోజూ జెండా వందనం

ఆ మరునాడు ఫర్‌బిడెన్ సిటీ టియాన్మన్ స్క్వేర్ చూడటానికి వెళ్ళాం. ఇవి రెండూ ఎదురెదురుగానే ఉంటాయి. ఫర్‌బిడెన్ సిటీని 1407లో కట్టారు. దీని నిర్మాణంలో ఒక మిలియన్ కన్నా ఎక్కువ మంది పనివాళ్ళు పాల్గొన్నారు. దీన్లో మింగ్, కింగ్ రాజవంశాలు 500 ఏండ్ల పాటు నివసించాయి. ఈ భవనం లోపల ఒక రకమైన పసుపురంగుతో లెక్కకు మిక్కిలిగా అలంకరణలు చేయబడ్డాయి. పసుపురంగు చైనా వారి సాంప్రదాయమైన రంగట. ఈ భవనాలన్నీ వారి వస్తు ప్రకారం కట్టబడినాయట. టియాన్మన్ స్క్వేర్ యాభై హెక్టార్ల స్థలంలో వ్యాపించబడి ప్రపంచంలోని అతిపెద్ద ఖాళీ ప్రదేశాలలో ఒకటిగా పేరు పొందింది. దీనిని 1417లో మింగ్ రాజవంశం స్థాపించింది. సామాన్య ప్రజలంతా తమ రాజులు, రాణుల ఎదుట ఉత్సవాలను జరుపుకోవడానికి వీలుగా ఈ స్క్వేర్‌ను 'ఫర్ బిడెన్ సిటీ' ఎదురుగా నిర్మించారు. ప్రస్తుతం ఇంకా విశాలం చేసి దాంట్లో ఎక్కువ మంది ప్రజలు పట్టే సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు టియాన్మన్ స్క్వేర్ వద్ద ప్రతిరోజూ జెండా వందనం అద్భుతంగా జరుగుతుంది. దీనిని తిలకించటానికి ప్రతిరోజూ వేల మంది ప్రజలు హాజరవుతారు. ఇది చూడాలంటే సూర్యోదయం కాకముందే లేచి అక్కడకు చేరుకోవాలి. ఐదు నక్షత్రాలున్న ఎర్రని చైనా జాతీయ జెండా ఈ స్క్వేర్ వద్ద ఆకాశంలోకి ఎగిరే దృశ్యం ప్రతి టూరిస్టు తప్పక చూడవలసినది. మలేసియా, చైనా, హంగ్‌కాంగ్ వాసులు ఈ టియాన్మన్ స్క్వేర్ వద్ద మాతో ఫొటోలు తీయించుకున్నారు. హిందూ, హిందూ అంటూ నమస్కారాలు చేశారు. మేం చైనాలో ఉన్నపుడు ఆ దేశ అధ్యక్షుడు "హూ జింటావో" భారతదేశ పర్యటనలో ఉన్నారు.

గ్రేట్ వాల్ ఆఫ్ చైనా

బీజింగ్ నుండి బాడాలింగ్ హైవేలో గ్రేట్‌వాల్ ఆఫ్ చైనాకు బయల్దేరాం. దారిలో జేడ్ ఫ్యాక్టరీ చూపించారు. అవి పెద్ద పెద్ద గ్రానైటు బండల్లా ఉన్నాయి. వాటి నుంచి శిల్పాలు, ఫ్లవర్ వేజెలు, అలంకారానికి ఉపయోగపడే ఎన్నో వస్తువులు తయారు చేయబడి ఉన్నాయి. గ్రేట్ వాల్ ఆఫ్ చైనా దగ్గరవుతుంటే అందరిలోనూ ఒకటే ఉద్విగ్నత. 'ఈరోజు మనం ప్రపంచ వింతను చూడబోతున్నాం' అని బస్సుదిగగానే పైకి చూస్తే మంచు తెరల్లోంచి చైనా మహాకుడ్యం ఒక కొండ మీద నుండి మరొక కొండ మీదకు వంకులు తిరుగుతూ పాక్కుంటూ వెళ్తున్న కొండ చిలువలా కన్పించింది. ఈ గోడ 25.6 ఫీట్ల ఎత్తుతోనూ, 16.4 ఫీట్ల వెడల్పుతోనూ కట్టబడింది. 'క్విన్ షి హుయాంగ్' అనే రాజు 220 బిసి నుంచి 200 మధ్యలో ఈ గోడను కట్టారు. మింగ్ రాజవంశం దీన్ని పునరుద్ధరించి 5వ శతాబ్దంలో బండ రాళ్ళతో కట్టారు. ఈ గోడనే మనం ఇప్పుడు చూస్తున్నది. ఈ గోడ పొడవు 6,400 కి.మీ.లు. 2,3 మిలియన్ల మంది సైనికులు వారి జీవితకాలమంతా ఈ గోడను కడుతూనే ఉన్నారు. మంచూరియన్ల, మంగోలియన్ల దాడిని నివారించేందుకు, వారు చైనాలోకి చొరబడకుండా ఉండేందుకు కట్టారు. ఈ మహాకుడ్య శిఖరాగ్రాన ఒక మిలియన్ సైనికులు కాపలా కాసేవారంట. అక్కడ చాలా షాపులు ఉన్నాయి. ఓషాపులో ఇత్తడి ప్లేట్ మీద మన పేరు చెక్కి ఈరోజు చైనా గోడను ఎక్కినట్లుగా చెక్కి ఇస్తారు. మేం కూడా దాన్ని చెక్కించుకున్నాం. ఇది మేం చూసిన రెండవ ప్రపంచ వింత. మొదటిది తాజ్‌మహల్. రెండవది ఇది. ఇంకొక షాపు దగ్గర చైనా రాజ వంశీయుల దుస్తులు వేసి ఫొటోలు తీస్తున్నారు. మేం కూడా ఆ ఫొటోలను తీయించుకున్నాం. మనం ఈ మానవ నిర్మితమైన ప్రపంచ వింతను దర్శించినట్లు ఒక సర్టిఫికెట్‌తో పాటు, ఫొటోలనూ ఇస్తారు. దీనికి మనం వంద యువాన్లు చెల్లించాలి. ఇలా చైనా మహాకుడ్య విశేషాలను భద్రపరచుకొని తిరిగి ఇండియా ప్రయాణమయ్యాం.


చైనావాల్ వద్ద కుటుంబ సభ్యులతో వ్యాసకర్త

- కందేపీ రాణీ ప్రసాద్
9866160378

ప్రకృతి సౌందర్యం చిరపుంజి...

సంవత్సరమంతా సగటున వర్షించే మేఘాలు, ఎత్తయిన కొండలపైనుంచి మంచు కురిసినట్టు నేలకు జారే జలపాతాలు.. ఒక్కటని కాదు ఎటూ చూసినా మనసుకు హత్తుకునే అందాల హరివిల్లు చిరపుంజీ. ఇది సముద్రమట్టం నుంచి దాదాపు 1300 మీటర్ల ఎత్తులో ఉండే ఈ ప్రదేశంలోనే దేశంలో అత్యధికంగా వర్షం పడే ప్రాంతం. కాలుష్య వాతావరణానికి దూరంగా ప్రకృతి రమణీయ దృశ్యాలతో అలరించే పర్యాటక ప్రాంతం చిరపుంజీ.

మేఘాలయా రాష్ట్ర రాజధాని షిల్లాంగుకు 56 కిలోమీటర్ల దూరంలో ఉన్న చిరపుంజీ ఓ అందమైన ప్రకృతి నిలయం. చిరపుంజీని చిర్రాపుంజి అని కూడా పిలుస్తారు. ఇది మేఘాలయాలోని తూర్పు ఖాశీ హిల్స్ జిల్లాలోని ఒక ముఖ్య పట్టణం. భూమి మీద అతి తేమగా ఉండే ప్రదేశంగా ఖ్యాతిగాంచింది. దీనికి సమీపంలో ఉండే మాసిన్రామ్‌లో అత్యధిక వర్షపాతం ఉంటోంది. చిరపుంజీ అసలు పేరు సొరా, దీన్ని చురా అని బ్రిటిష్ వారు పిలిచేవారు. కాలక్రమేణా అది చిరపుంజీగా మారింది. చిరపుంజీకి వెళ్లాలంటే ముందు షిల్లాంగ్‌కు చేరుకోవాలి. అక్కడి నుంచి ఘాట్ రోడ్‌లో సాగే ప్రయాణంలో చుట్టూ ఎత్తయిన పర్వతాలను చూస్తూ వాటినుంచి జాలువారే జలపాతాలను తన్మయత్వంతో తిలకించవచ్చు. చిరపుంజీ ప్రాంతం దాదాపుగా లైమ్ రాతిగుహలతో నిండి ఉంటుంది. ఇక్కడ పురాతన ప్రెస్బిటేరియన్ చర్చి, రామకృష్ణ మిషన్‌లను దర్శించవచ్చు. షిల్లాంగ్ చుట్టు పక్కల అనేక పర్యాటక ప్రదేశాలున్నాయి. దాదాపు ప్రతిరోజు టూరిస్టులతో సందడిగా ఉండే షిల్లాంగ్‌లో మ్యూజియం ఆఫ్ ఎంటోమాలజీ అనే సీతాకోక చిలుకల పార్క్ పర్యాటకులను మంత్రముగ్ధుల్ని చేస్తుంది. ప్రముఖ హిల్ స్టేషనైనా షిల్లాంగ్ కేవలం పర్యాటకులకే కాక సినిమా షూటింగ్‌లకు కూడా అనువైన ప్రదేశం.

చిరపుంజీలో నివసించే స్థానికులను ఖాసీలంటారు. వీరిలో మాతృవంశ పాలన ఉంటుంది. పెళ్లి తరువాత భర్త భార్య వెంబడి ఆమె ఇంటికి వెళతాడు. పుట్టిన పిల్లలు తల్లిపేరును ఇంటిపేరుగా పెట్టుకుంటారు. చిరపుంజీ లివింగ్ బ్రిడ్జ్‌లకు పెట్టింది పేరు. ఎన్నో వందల సంవత్సరాల నుంచి చిరపుంజీవాసులు చెట్ల వేళ్లనే బ్రిడ్జిలుగా మార్చే విధానాన్ని అభివృద్ధి చేశారు. ఇప్పటికీ ఉపయోగిస్తున్న ఒక పురాతన బ్రిడ్జి వయస్సు 500 ఏళ్లు ఉంటుంది. బంగ్లాదేశ్ ముఖంగా ఉన్న ఖాసీ కొండల దక్షిణ కొనకు చిరపుంజీ ఉంది. బంగాళాఖాతం నుంచి వీచే రుతుపవన గాలులు ఈ కొండశిఖరాలను తాకడం వల్ల చిరపుంజీలో భారీ వర్షాలు కురుస్తాయి. అలాగే ఈశాన్య, నైరుతీ రుతుపవనాల నుంచి వర్షాలు కురవడంతో, ఇక్కడ రెండూ కలిసి ఒకే ఒక రుతుపవన కాలంగా ఉంటాయి. శీతాకాలంలో బ్రహ్మపుత్ర వ్యాలీ గుండా ప్రయాణించే ఈశాన్య రుతుపవనాల వల్ల ఇక్కడ వానలు పడతాయి. ఒక సంవత్సర కాలంలో గరిష్ట వర్షపాతానికి సంబంధించి చిరపుంజీ పేరిట రెండు గిన్నీస్ రికార్డులున్నాయి.



సాంకేతికంగా.. సౌకర్యంగా...

పర్యటనతో వినోదమే కాదు విజ్ఞానమూ కలుగుతుంది. భారతీయులు పర్యాటకం మీద మునుపటి కన్నా ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. కుటుంబంతో కలిసి కొత్త ప్రదేశాలకు షికారు వెళ్తున్నారు. నూతన సాంకేతికత, పర్యాటక ఏజెన్సీలు, పర్యాటక సంస్థల వెబ్‌సైట్లు, పర్యాటక రంగం అందిస్తున్న రాయితీలు, సౌలభ్యాలు సందర్శకులను పర్యటనల వైపు మొగ్గు చూపేలా చేస్తున్నాయి.

ఆన్‌లైన్ వెబ్‌సైట్లు: పర్యాటక సంస్థలు ఆన్‌లైన్ బుకింగ్ సౌకర్యాన్ని కల్పిస్తున్నాయి. పర్యటించాలనుకుంటున్న ప్రదేశం వివరాలు, అక్కడ వసతి, భోజనం, వినోదం, షాపింగ్‌కు ఎంత ఖర్చు చేయాల్సివస్తుంది తదితర వివరాల కోసం ప్రజలు పలు ట్రావెల్ వెబ్‌సైట్లను ఆశ్రయిస్తున్నారు.

పర్యాటక శాఖల వెబ్‌సెట్లు: పలు రాష్ట్రాల పర్యాటక శాఖలు, పలు ట్రావెల్ కంపెనీలు సొంత వెబ్‌సైట్ల ద్వారా, మొబైల్ యాప్‌ల ద్వారా సందర్శకులకు చేరువవుతున్నాయి. ఎక్కువ రాయితీలతో పర్యాటకులను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నాయి. తక్కువ ఖర్చుతో ఇష్టమైన గమ్యాలకు వెళ్లే అవకాశాలు పెరగడంతో సందర్శకులు ఆసక్తి చూపుతున్నారు.

డేటా ఆధారంగా: పర్యాటక ప్రదేశాల డిజిటలైజేషన్ వల్ల పర్యాటక స్థలాల వివరాలు, హోటళ్లు, ట్రావెలింగ్ సంస్థల వివరాలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటున్నాయి.

బడ్జెట్లోనే యాత్ర: పర్యాటకుల కోసం ప్రత్యేకంగా హోటల్స్‌తో పాటు షేరింగ్ హాస్టల్స్ ఏర్పాటవుతున్నాయి. అనువైన బడ్జెట్‌లోనే మనసుకు నచ్చిన ప్రదేశాలను చుట్టి వచ్చే అవకాశాలు పెరిగాయి.

వీసా ఆన్ అరైవల్: విదేశీ పర్యాటకులు భారత్ రాగానే వారికి వీసా ఆన్ అరైవల్ సౌకర్యం కల్పిస్తున్నారు. దీంతో భారత్‌లో పర్యటించడానికి ఎక్కువ మంది విదేశీయులు ఆసక్తి చూపుతున్నారు. కొత్త ప్రదేశాలంటే ఆసక్తి: ఇంతవరకు చూడని ప్రదేశాలకు వెళ్లి, అక్కడి సంస్కృతి, సంప్రదాయాలు తెలుసుకునేందుకు భారతీయ యువత ఆసక్తి చూపుతున్నారు. చాలామంది ఒంటరిగా యాత్రలకు వెళ్లేందుకు ఇష్టపడుతున్నారు.



కొత్త జంటలకు మజిలీ...

ద్వీపం అనగానే ఎవరికైనా గుర్తుకు వచ్చేది సముద్రం మధ్యలో ఉన్న భూమి, చుట్టూ పచ్చటి ప్రకృతి, ఎత్తయిన కొండలు, లోతయిన లోయలు. అయితే నదుల మధ్య కూడా కొన్ని ద్వీపాలు ఉంటాయి. అలాంటి అరుదైన ద్వీపమే మజిలి లాంటి 'మజులి'. ప్రపంచంలో ఇలా నదుల మధ్య ఉండే అరుదైన మంచినీటి ద్వీపాల్లో ఇదే పెద్ద ద్వీపం కావడం విశేషం. అసోం రాష్ట్రంలోని బ్రహ్మపుత్ర నది మధ్యలో ఏర్పడిన ఈ మజులి ద్వీప సౌందర్యాన్ని మనసారా వీక్షించడానికి రెండు కండ్లు చాలవు. ఈ ద్వీపం మధ్యలో నిర్మించిన కాటేజ్‌లలో నుండి సూర్యాస్తమయాన్ని చూడటం ఓ మధురానుభూతి.

మజులి ద్వీపంలో చెట్లు, చేమలూ.. పుట్టలూ, నదీ జలాలు... ఇలా మజులి ద్వీపం గురించి ఏం చెప్పుకున్నా అవన్నీ కాలుష్యానికి దూరంగా, అతీతంగా నిలిచి ఉన్నాయి. కాలుష్య ప్రభావం ఈ ప్రాంతంపై పడలేదు కాబట్టి ఇప్పటికీ... మజులి సౌందర్యం ఏ మాత్రం ధ్వంసం కాకుండా, స్వచ్ఛంగా, ఆహ్లాదాన్ని పంచుతున్నది. ఏ రుతువులో చూసినా. ఈ అద్భుత ద్వీపంలో మానవ సంచారం ఉన్నప్పటికీ... నేటికి పచ్చని సౌందర్యంతో ప్రకృతికాంత పరవశిస్తూనే వుంది. అందుకే కొత్తగా పెళ్లైన దంపతులకు ఇదొక స్వర్గధామం అని చెప్పవచ్చు. అసోం నుండే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి కూడా హనీమూన్ కపుల్ ఇక్కడ సందడి చేస్తారు. కొత్త వాతా వరణంలో, పూర్తి కొత్తదనంతో గడపాలనుకునే జంటలకు మజులి ఓ అద్భుతమైన అనుభవాన్నిస్తుందనడంలో ఏ మాత్రం అతిశయోక్తి కాదు.



అపురూపం నగర పర్యటన...

తెలంగాణ టూరిజం శాఖ హైదరాబాద్ నగర పర్యటనకు ప్రత్యేక ప్యాకేజీని నిర్వహిస్తున్నది. ఈ పర్యాటనలో హైదరాబాద్‌లోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలను చూపిస్తారు. ఈ పర్యాటనల్లో బిర్లామందిర్, చౌహమల్లా ప్యాలెస్, చార్మినార్, మక్కామసీదు, లాడ్‌బజార్‌లో షాపింగ్ (నడక), సాలార్‌జంగ్ మ్యూజియం (ఇక్కడే లంచ్ బ్రేక్ ఉంటుంది), నిజాం జూబ్లీ పెవిలియన్ (పురానీ హవేలీ), గోల్కొండ కోట, కుతుబ్‌షాహి టూంబ్స్, లుంబినీపార్క్ (ముగింపు పాయింట్) తదితర ప్రాంతాలను చూపిస్తారు.



సమయం: ప్రతిరోజు ఉదయం 7.30 నిమిషాలకు ప్రారంభమయ్యే ప్రయాణం తిరిగి సాయంత్రం 7.30 నిమిషాలకు ముగుస్తుంది. చార్జీలు: నాన్ ఏసీ బస్ పెద్దలకు-రూ. 250, పిల్లలకు-రూ. 200, ఏసీ బస్ రూ. 350, పిల్లలకు-రూ. 280, ఎంట్రీ టికెట్, భోజనానికి అదనపు చార్జీ. శుక్రవారం రోజున అన్ని మ్యూజియాలు మూసి ఉంటాయి. అందువల్ల శుక్రవారం పర్యటించే వారికి మ్యూజియానికి బదులు జూ పార్క్‌ను చూపిస్తారు.



ఆస్ట్రేలియా ప్రధాన మంత్రి స్కాట్ మోరిసన్ మంగళవారం సిడ్నీలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విందులో.. ప్రధానితో భారత, ఆస్ట్రేలియా క్రికెట్ సభ్యులు.

బేబీ సిట్టర్ పంత్!

ఆసీస్ కెప్టెన్ పైన్ ఫ్యామిలీతో పంత్ ఫోటో వైరల్



సిడ్నీ : బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో ఇరు జట్ల నుంచీ మాటలతో మాయ చేస్తోన్న ఆటగాళ్లు వికెట్ కీపర్లు. స్టంప్ మైక్‌తో వికెట్ల వెనకాల వీరి కవ్వింపు వ్యాఖ్యలు బయటకు రావటంతో అభిమానులు వాటిపై చర్చించుకోవటం చూశాం. ఇందులో కొన్ని కవ్వింపు వ్యాఖ్యలు ఉండగా, మరికొన్ని సరదా సంభాషణలూ ఉన్నాయి. బాక్సింగ్ డే టెస్టులో ఆసీస్ కెప్టెన్ టిమ్ పైన్‌తో భారత వికెట్ కీపర్ రిషబ్ పంత్‌కు ఆసక్తికర చర్చ నడిచింది. ' వన్డే జట్టులోకి ఎం.ఎస్ ధోని వచ్చాడు. నువ్వు బిగ్‌బాష్ లీగ్‌లోని హోబర్ట్ హరికేన్స్‌కు వస్తావా? మాకు ఓ బ్యాటర్ అవసరం ఉంది. హోబర్ట్‌లో మంచి బస పొందవచ్చు. అలాగే సాయంత్రాలు నా భార్యతో సినిమాకు వెళితే, నా పిల్లలను చూసుకుంటావా?' అని పంత్ బ్యాటింగ్ చేస్తుండగా పైన్ మాటల వేడి మొదలెట్టాడు. పైన్ బ్యాటింగ్‌కు వచ్చినప్పుడు బదులు తీర్చుకున్న పంత్ షార్ట్ లెగ్‌లో ఫీల్డింగ్ చేస్తోన్న మయాంక్‌తో ' ఎప్పుడైనా తాత్కాలిక కెప్టెన్ గురించి విన్నావా?' అని కంగారూ కెప్టెన్‌పై మాటల బాణం విసిరాడు. ఈ రెండు సంఘటనలు మెల్‌బోర్న్‌లో హైలైట్‌గా నిలిచాయి. మైదానంలో మాటల యుద్ధం పక్కనపెడితే, బయట క్రికెటర్లు మంచి స్నేహితులు. ఇదే విషయాన్ని యువ రిషబ్ పంత్ చాటి చెప్పాడు. మంగళవారం సిడ్నీలో ఆస్ట్రేలియా ప్రధాని స్కాట్ మోరిసన్ నివాసంలో భారత్, ఆస్ట్రేలియా జట్లకు విందు ఏర్పాటు చేశాడు. ఈ సందర్భంగా టిమ్ పైన్ పిల్లలతో ఎత్తుకున్న పంత్, అతడి భార్యతో సెల్ఫీకి ఫోజిచ్చాడు. పైన్ ఫ్యామిలీతో పంత్ ఫోట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. బీసీసీఐ, సీఏ, ఐసీసీలు ఈ ఫోటోను సోషల్ మీడియాతో పంచుకున్నాయి. ప్రత్యర్థితో మాటల వార్ మైదానానికి పరిమితం అని రిషబ్ పంత్ క్రీడాస్ఫూర్తి చాటాడు. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ చరిత్రలో ఈ ఫోటో ఓ మధుర జ్ఞాపకంగా మిగిలిపోతుందని క్రికెట్ అభిమానులు కితాబు ఇచ్చేశారు.



ఇద్దరు స్పిన్నర్లతో..?

● అశ్విన్ ఫిట్‌నెస్ సాధించినట్టే! ● రేపటి నుంచి ఆసీస్‌తో చివరి టెస్టు

సిడ్నీ (ఆస్ట్రేలియా) :

బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో 2-1 ఆధిక్యం సహా సిరీస్‌ను కోల్పోని స్థితిలో నిలిచిన టీమ్ ఇండియా కొత్త ఏడాదిలో తొలి రోజు మైదానానికి దూరంగా గడిపింది. ఆస్ట్రేలియా ప్రధాని నివాసంలో విందుకు హాజరైన కోహ్లిసేన ప్రాక్టీస్ సెషన్‌ను రద్దు చేసింది. మరో వైపు ఆస్ట్రేలియా జట్టు ఐచ్ఛిక ప్రాక్టీస్ సెషన్లో పాల్గొన్నది. కానీ సిడ్నీలో ఓ ఆటగాడు అందరి దృష్టిని ఆకర్షించాడు. జట్టు పూర్తిగా ప్రాక్టీస్ సెషన్‌కు దూరంగా ఉన్న వేళ ఫిజియో, ఫిట్‌నెస్ ట్రైనర్‌లతో కలిసి సిడ్నీ ఇండోర్ నెట్స్‌లో కనిపించాడు. అతడే ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్. తొలి టెస్టు చివరి రోజు గాయపడిన అశ్విన్, తర్వాతి రెండు టెస్టులకు దూరమయ్యాడు. సిడ్నీ పిచ్ స్పిన్నర్లకు అనుకూలం కానున్న పరిస్థితుల్లో ఆతిథ్య ఆస్ట్రేలియా సైతం ఇద్దరు స్పిన్నర్లతో ఆడేందుకు మొగ్గుచూపుతోంది. ఈ నేపథ్యంలో అశ్విన్ మంగళవారం నెట్స్‌లో కనిపించటంతో కోహ్లిసేన సైతం ఇద్దరు స్పిన్నర్లతో ఆడేందుకు సిద్ధమవుతోందని తెలుస్తోంది. పక్క కండరాల గాయంతో బాధపడుతున్న అశ్విన్‌కు ఫిట్‌నెస్ ట్రైనర్ శంకర్ బసు కొన్ని పరీక్షలు నిర్వహించాడు. అధికారికంగా ఫిట్‌నెస్ పరీక్ష నిర్వహించకపోయినా, అశ్విన్ మ్యాచ్ ఫిట్‌నెస్ సాధించినట్టు సమాచారం. నేడు జట్టు పూర్తి స్థాయి ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గోనాల్సి ఉంది. అశ్విన్ ఫిట్‌నెస్ సాధించాడా? లేదా? అనేది నేడు అధికారికంగా వెల్లడించనున్నారు. ఒక వేళ ఒకే స్పిన్నర్‌తో ఆడాలని అనుకుంటే రవీంద్ర జడేజానే కొనసాగించాలని జట్టు మేనేజ్‌మెంట్ భావిస్తోంది. కానీ కూతురు పుట్టిన వేళ భార్యతో ఉండేందుకు స్వదేశానికి వచ్చిన రోహిత్ శర్మ స్థానంలో హార్దిక్ పాండ్యను తుది జట్టులోకి తీసుకుంటే, అశ్విన్ బెంచ్‌కు పరిమితం కావాల్సి ఉంటుంది. కానీ సిడ్నీ స్పిన్ ఫ్రెండ్లీ వాతావరణంలో అశ్విన్‌ను బెంచ్‌కు పరిమితం చేసే సాహసం కోహ్లి చేయకపోవచ్చు!.

కెప్టెన్సీనా..హాస్యాస్పదం

ఆసీస్ సీమర్ పాట్ కమిన్స్



సిడ్నీ : మెల్‌బోర్న్ టెస్టు తర్వాత ఆస్ట్రేలియా క్రికెట్‌లో కొత్త చర్చ మొదలైంది. బంతితో, బ్యాట్‌తో విశేషంగా ఆకట్టుకున్న యువ సీమర్ పాట్ కమిన్స్ భవిష్యత్ ఆస్ట్రేలియా కెప్టెన్ అంటూ కొందరు మాజీ వ్యాఖ్యానించారు. ' వచ్చే ఏడాది నుంచి మెల్‌బోర్న్ టెస్టు కచ్చితంగా డే నైట్ ఫార్మాట్‌లో ఆడాలి. ఆల్‌రౌండ్ లక్షణాలతో కూడిన ఆస్ట్రేలియా కెప్టెన్‌గా పాట్ కమిన్స్ సరిపోతాడు. బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్ గణాంకాలు సైతం కంగారు పెడుతున్న అంశాలు' అని దిగ్గజ స్పిన్నర్ షేన్ వార్న్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. కెప్టెన్సీ వ్యాఖలపై పాట్ కమిన్స్ స్పందించాడు. ' ఈ సమయంలో ఇది హాస్యాస్పదం. కెప్టెన్‌గా టిమ్ పైన్ బాధ్యతలు తీసుకున్నాడు. అతడు అద్భుతంగా పని చేస్తున్నాడు. కెప్టెన్సీ పైన్ దీర్ఘకాలిక బాధ్యత అని భావిస్తున్నాను' అని విమర్శలు ఎదుర్కొంటున్న పైన్‌కు పాటిన్స్ మద్దతుగా నిలిచాడు.

30 ఏండ్లుగా ఏం చేశారు?

టెన్నిస్ సమాఖ్యపై సోమ్‌దేవ్ ఫైర్



పుణె : భారత టెన్నిస్ స్టార్ సోమ్‌దేవ్ దేవర్మన్ ఆల్ ఇండియా టెన్నిస్ సంఘం (ఏఐటీఏ)పై మండి పడ్డాడు. హైదరాబాద్‌లో పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ తరహాలో న్యూఢిల్లీలో టెన్నిస్ సెంటర్ ఫర్ ఎక్సలెన్సీ ఏర్పాటుకు క్రీడా మంత్రిత్వ శాఖ, టెన్నిస్ సంఘం ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ సెంటర్‌కు సోమ్‌దేవ్ దేవర్మన్ డైరెక్టర్‌గా ఉండేందుకు ప్రణాళిక వేశారు. కానీ బడ్జెట్‌ను రూ. 20 కోట్ల నుంచి రూ. 10 కోట్లకు కుదించటంతో సోమ్‌దేవ్ స్పందించారు. ' ముందుగా అనుకున్న బడ్జెట్ ప్రకారం ప్రణాళిక వేశాం. అన్నీ అందుకు అనుగుణంగానే సాగాయి, కానీ ఇప్పుడు బడ్జెట్ కుదిస్తే, సెంటర్ సాధ్యపడదు. వేతనం కోసం నేను ఈ పనికి ఒప్పుకోలేదు. ఇప్పటికి వరకూ ఎటువంటి జీతాన్ని తీసుకోలేదు. ఇదో ఫ్యాషన్ ప్రాజెక్ట్' అని సోమ్‌దేవ్ అన్నాడు. సెంటర్ ఫర్ ఎక్సలెన్సీ ప్రాజెక్ట్‌ను పక్కనపెడితే, టెన్నిస్ సంఘాన్ని నేనో ప్రశ్న అడుగుతున్నాను. టెన్నిస్ కోసం మీ దగ్గర ఉన్న ప్రణాళిక, వ్యూహం ఏమిటి? అసలు గత 30 ఏండ్లుగా మీరు టెన్నిస్ కోసం ఏం చేస్తున్నారు? ప్రభుత్వ పాత్రను వదిలేద్దాం. అసలు సంఘం ఏం చేస్తోంది? మీ పాత్ర సరిగా పోషించారా? ఇదేదో నేను ఎవరినో టార్గెట్ చేసి అడుతున్నానని కాదు. ఎవరినో తిట్టాలనే ఉద్దేశం నాకు లేదు. టెన్నిస్ కీలక అంతర్జాతీయ ఆట. తాత్కాలిక పనులకు ఫలితాలు రావు. ఏండ్లుగా కృషి చేయాలి. ఆ విషయం టెన్నిస్ సంఘం గుర్తించాలి అని సోమ్‌దేవ్ పేర్కొన్నాడు.

పాక్‌స్తాన్‌కు క్రికెట్ కళ!

సఫారీ, ఆసీస్ జట్లపై ఆశలు

కరాచీ : 2009 మార్చిలో లాహోర్‌లో శ్రీలంక క్రికెట్ జట్టు బస్సుపై ఉగ్ర దాడి తర్వాత పాకిస్తాన్ అంతర్జాతీయ క్రికెట్‌కు దూరమైంది. యు.ఏ.ఈలో అంతర్జాతీయ స్వదేశీ మ్యాచలకు పాక్ ఆతిథ్యం ఇస్తోంది. పదేండ్ల తర్వాత పాక్‌కు మళ్లీ క్రికెట్ కళ రానున్నది పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) భారీ ఆశలు పెట్టుకున్నది. ఇటీవల దక్షిణాఫ్రికాలో పర్యటించిన పీసీబీ చైర్మన్ ఇషన్ మణి, సఫారీలను పాక్‌కు ఆహ్వానించారు. తాజా భద్రతా ఏర్పాట్లపై సానుకూలంగా స్పందించిన క్రికెట్ దక్షిణాఫ్రికా బోర్డు, దశల వారీగా అండర్-9, ఏ సహా సీనియర్, మహిళల జట్టును పాకిస్తాన్ పర్యటనకు పంపుతామని హామీ ఇచ్చినట్టు సమాచారం. ఇదే సమయంలో ఈ ఏడాది మార్చి-ఏప్రిల్‌లో ఆస్ట్రేలియా సైతం రెండు వన్డేల కోసం పాకిస్తాన్‌కు వచ్చే అవకాశం ఉందని పీసీబీ చెబుతోంది. గతేడాది శ్రీలంక, వెస్టిండీస్‌లతో స్వదేశంలో సిరీస్‌లు ఆడిన పాకిస్తాన్ భద్రతా పరంగా మెరుగైంది. వరల్డ్ ఎలెవన్‌తో టీ20 సహా పాకిస్తాన్ సూపర్ లీగ్ ఫైనల్స్‌కు సైతం లాహోర్ ఆతిథ్యం ఇచ్చింది. ఉగ్రదాడి జరిగిన పదేండ్ల తర్వాతైనా పాకిస్తాన్‌కు అంతర్జాతీయ క్రికెట్ తిరిగి రాకపోదా అని ఆ దేశ క్రీడాభిమానులు ఎదురు చూస్తున్నారు.


ఎవరి కోసం ఇదంతా?

నిందితుడిగాలేని 'అమిత్ షా'కు క్లీన్‌చిట్

సోహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసులో జడ్జి తీర్పును ఎలా అర్థం చేసుకోవాలి?

న్యూఢిల్లీ : సోహ్రాబుద్దీన్ షేక్, అతని భార్య కౌసర్‌బీ, తులసీరాం ప్రజాపతిల ఎన్‌కౌంటర్ కేసు దేశవ్యాప్తంగా ఓ చర్చనీయాంశమైంది. దీనిపై సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం జడ్జీ ఇచ్చిన తీర్పు సైతం సంచలనంగా మారింది. ఈ కేసులో నిందితుడుగా ఉన్న బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా 2014లోనే నిర్దోషిగా బయటపడ్డాడు. అలాంటప్పుడు మళ్లీ అతని పేరు ప్రస్తావిస్తూ అమిత్ షాకు క్లీన్‌చిట్ ఇస్తూ న్యాయమూర్తి ఎస్‌జే.శర్మ చెప్పిన మాటలు కొందరికి ఏవో అనుమానాల్ని రేకెత్తిస్తున్నాయి.

అందునా సార్వత్రిక ఎన్నికలు మరికొద్ది నెలల్లో జరగబోతున్నవేళ ఇలాంటి తీర్పు రావటాన్ని రాజకీయ పండితులు 'ఏదో ఉందన్న' ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయమూర్తి తీర్పుపై సీబీఐ అధికారికంగా స్పందించలేదు. కోర్టు పరిశీలనపై మాట్లాడ్డానికి సీబీఐ మీడియా ప్రతినిధి నిరాకరించారు. ప్రస్తుతం ఎలాంటి వ్యాఖ్యలూ చేయదలుచుకోలేదనీ, తీర్పు ప్రతి తమకు ఇంకా రాలేదనీ అన్నారు. సోహ్రాబుద్దీన్, కౌసర్‌బీల హత్యకు గల కారణాలు 13ఏండ్లు అయినా బయటపడకపోవటం, ఒక మిస్టరీగా ఉండిపోవటంపై ఎన్నో అనుమానాలు కలుగుతున్నాయి.



కావాలని ఇరికించారు : సీబీఐపై మండిపడ్డ న్యాయమూర్తి

తీర్పు ప్రతిలో సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం ఎస్‌జే.శర్మ ఏమన్నారంటే..."ఈ కేసు దర్యాప్తును సీబీఐ ఓ లక్ష్యంతో మొదట రూపొందించుకున్న పథకంతో జరిపినట్టు భావిస్తున్నా. తన ఆలోచనల ప్రకారం దర్యాప్తు జరిపేందుకు సీబీఐ ఏకంగా సాక్ష్యాలను సృష్టించింది. రాజకీయ నేతలను ఈ కేసులో ఇరికించడమే లక్ష్యంగా కనబడుతోంది. ఎవర్నో ఇరికించడానికి నకిలీ సాక్ష్యాలను తెచ్చారు"అని న్యాయమూర్తి తీవ్రంగా మండిపడ్డారు.

బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా కూడా ఈ కేసులో ఓ నిందితుడు. కానీ ఆయనను 2014లోనే నిర్దోషిగా విడుదల చేశారు. "16వ నెంబరు నిందితుడు (అమిత్ షా) సమర్పించిన ఓ దరఖాస్తుపై తీర్పునిచ్చిన నా పూర్వ జడ్జి కూడా ఈ కేసు రాజకీయ ప్రేరేపితమని స్పష్టంగా చెప్పారు"అని శర్మ తన తాజా తీర్పులో గుర్తుచేశారు.

"అసలు సోహ్రాబుద్దీన్, మిగిలిన ఇద్దరూ ఇండోర్ నుంచి హైదరాబాద్‌కు అక్కడ్నుంచి మహారాష్ట్రలోని సాంగ్లికి వెళ్లారా? వెళ్లారనడానికి ఏది ఆధారం? వారిని బస్సులో నుంచి దింపి గుజరాత్‌లోని వాల్సద్‌కు తీసుకెళ్లి కాల్చిచంపారా? ఇది నిజమే అయితే వారి శరీరంపై బుల్లెట్ గాయాలేవీ? సోహ్రాబుద్దీన్‌ది హత్య కావచ్చు. కానీ కచ్చితంగా కాల్చి చంపలేదు"అని జడ్జి అన్నారు. ప్రజాపతిది నిజమైన ఎన్‌కౌంటరే అని కోర్టు తేల్చింది.

కేసు నేపథ్యం ఇది..

అప్పటి గుజరాత్ సీఎంగా మోడీ ఉన్న సమయంలో ఆయన హత్యకు కుట్రపన్నాడన్న కారణాల్ని చూపి సోహ్రాబుద్దీన్ షేక్‌ను 2005 నవంబర్‌లో ఎన్‌కౌంటర్ చేశామని గుజరాత్ పోలీసులు



వెల్లడించారు. అదే ఏడాది నవంబర్ 22న సోహ్రాబుద్దీన్ భార్య కౌసర్‌బీ, సహచరుడు తులసీరాం ప్రజాపతిలను గుజరాత్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారని సీబీఐ తెలిపింది. అదృశ్యమైన కౌసర్‌బీని నవంబర్ 29న బనస్కంత జిల్లాలోని ఓ గ్రామానికి తీసుకువెళ్లి లైంగిక దాడికి పాల్పడి అనంతరం హతమార్చారనీ సీబీఐ ఆరోపించింది. ప్రజాపతిని ఓ కేసు విచారణ నిమిత్తం అహ్మదాబాద్ నుంచి రాజస్థాన్‌కు తీసుకువెళుతుండగా పారిపోయేందుకు ప్రయత్నించగా అతడిని ఆపే క్రమంలో జరిపిన కాల్పుల్లో మరణించాడని పోలీసులు చెబుతున్నారు.

జనవరి 2010లో సుప్రీంకోర్టు ఈ కేసు విచారణను సీబీఐకి అప్పగించింది. అప్పటి గుజరాత్ హోంమంత్రి అమిత్ షా, అప్పటి రాజస్థాన్ హోంమంత్రి గులాబ్‌చంద్ కటారియా, ఇతర ఐపీఎస్ అధికారులతో పాటు 38 మందిపై సీబీఐ అభియోగాలు నమోదు చేసింది. అమిత్ షాను సీబీఐ అరెస్ట్ చేసింది. డిసెంబర్ 30, 2014న కోర్టు అమిత్ షాను కేసు నుంచి విముక్తుడ్ని చేసింది. ఇతర ఐపీఎస్ అధికారులు బయటపడ్డారు.

గుజరాత్ ఎన్‌కౌంటర్ కేసుల్లో నిందితులకు పదోన్నతి

అహ్మదాబాద్ : ఇష్రాత్ జహాన్, సోహ్రాబుద్దీన్ షేక్ ఎన్‌కౌంటర్ కేసుల్లో కీలక నిందితులకు బీజేపీ సర్కార్ పదోన్నతి కల్పించింది. ఇష్రాత్ జహాన్ కేసులో ప్రస్తుతం బెయిల్‌పై ఉన్న ఐపీఎస్ అధికారి జి.ఎల్. సింఘాల్, సోహ్రాబుద్దీన్ షేక్ ఎన్‌కౌంటర్ కేసులో నిందితుడైన అగర్వాల్‌కు గుజరాత్ ప్రభుత్వం మంగళవారం ఐజీపీలుగా పదోన్నతి కల్పించింది. ఐజీపీలుగా పదోన్నతులు పొందాల్సిన 2001వ సంవత్సరం బ్యాచ్‌కు చెందిన ఆరుగురు ఐపీఎస్ , డిఐజి ర్యాంక్ అధికారుల జాబితాలో సింఘాల్, అగర్వాల్ పేర్లు



కూడా ఉన్నాయి. గుజరాత్‌లో 2004లో చోటుచేసుకున్న ఇష్రాత్ జహాన్ ఎన్‌కౌంటర్ కేసు నిందితులలో సింఘాల్ కీలక నిందితుడు. సింఘాల్‌ను 2013లో సీబీఐ అరెస్టు చేసింది. సింఘాల్‌పై గడువులోగా చార్జిషీట్ దాఖలు చేయడంలో సీబీఐ విఫలమైన నేపథ్యంలో ఆయనకు బెయిల్ లభించింది. సింఘాల్‌కు 2014లో డీఐజీగా పదోన్నతి కల్పిస్తూ గుజరాత్ ప్రభుత్వం తిరిగి విధుల్లోకి తీసుకున్నది. ఇష్రాత్ కేసులో దాదాపు 267 వాయిస్ రికార్డింగ్‌లు కలిగి ఉన్న రెండు పెన్ డ్రైవ్‌లతో సీబీఐకి బలమైన సాక్ష్యాలను సింఘాల్ అందించాడు. అప్పటి గుజరాత్ హోం మంత్రి, ప్రస్తుత బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా ఆదేశాల మేరకు ఇష్రత్ జహాన్‌పై అక్రమ నిఘా ఉంచిన విషయాన్ని ఆ వాయిస్ రికార్డులు వెల్లడిస్తున్నాయి. ప్రస్తుతం అహ్మదాబాద్‌లో విధులు నిర్వహిస్తున్న ఏసీపీ(అడ్మినిస్ట్రేషన్) విపుల్ అగర్వాల్‌కు కూడా ఐజీపీగా పదోన్నతి కల్పించారు. ముంబయిలోని ప్రత్యేక సీబీఐ కోర్టు ఈ కేసులోని నిందితులందరినీ గత నెలలో నిర్దోషులుగా ప్రకటించిన సంగతి తెలిసిందే.

100 స్మార్ట్ సిటీలు ఎక్కడ..?

2014 ఎన్నికల వాగ్దానం మరిచారా..?

● ప్రధాని మోడీ, బీజేపీ మాట్లాడరేం..?

● 5 శాతం మాత్రమే పూర్తయినట్టు నివేదికలు



న్యూఢిల్లీ: 2018లో ప్రధాని మోడీ తన చివరి మన్‌కీబాత్‌ని గత ఆదివారం(డిసెంబర్ 30న) నిర్వహించారు. ఆ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ సానుకూల సమాచారానికి ప్రచారం కల్పించాలని సూచించారు. వ్యతిరేక వార్తలకే ఎక్కువ ప్రచారం లభించడం శోచనీయమన్నారు. ఓవిధంగా ప్రధాని వ్యాఖ్యలు మీడియాకే వర్తిస్తాయి. అయితే, 2014లో తాను అధికారం చేపట్టడానికి ముందు ఎన్నికల్లో ప్రజలకిచ్చిన వాగ్దానాలు, వాటి అమలుతీరుపై ప్రధాని బేరీజు వేసుకుంటే సానుకూల ఫలితాలు సాధించారా..? లేదా..? అన్నది ఆయనకే అర్థమవుతుంది. ప్రధాని మోడీ, ఆయన పార్టీ ప్రజలకిచ్చిన వాగ్దానాలను ఎంతవరకు నెరవేర్చారు..? ఎక్కడెక్కడ వైఫల్యం చెందారో..? వాస్తవాలు విశ్లేషించాల్సిన బాధ్యత మీడియాపై ఉన్నది. ప్రధానియైనా, మీడియాయైనా ప్రజలకే జవాబుదారీగా ఉండాలి. వాస్తవాలను వక్రీకరించి చెబితే అది సానుకూలం అవుతుందా..? అన్నది విజ్ఞతతో తేల్చాల్సిన అంశం. మరోసారి సార్వత్రిక ఎన్నికలకు వెళ్లనున్నవేళ ప్రధాని మోడీకిగానీ, ఆయన పార్టీకిగానీ సానుకూలంగా సాధించిన ఫలితాలేమీలేక మీడియాపైనా, ప్రతిపక్షాలపైనా తమ అక్కసును వెళ్లకక్కుతున్నారనిపిస్తోంది.

2015, జూన్‌లో స్మార్ సిటీల(ఆకర్షణీయ నగరాల) ప్రాజెక్ట్‌ను ప్రధాని మోడీ ప్రకటించారు. దేశంలోని 100 నగరాలను స్మార్ట్ సిటీలుగా అభివృద్ధి చేస్తామని బీజేపీ తన ఎన్నికల మ్యానిఫెస్టోలోనూ ప్రకటించింది. దేశంలోని మిగతా నగరాలకు వీటిని నమూనాగా అభివృద్ధి చేయనున్నట్టు తెలిపింది. ఒక్కో స్మార్ట్ సిటీకి ఏటా రూ.100 కోట్లు కేంద్రం అందించాలి. ఐదేండ్లపాటు సాగే ఈ ప్రాజెక్ట్ ద్వారా ఒక్కో నగరానికి కేంద్రం నుంచి మొత్తం రూ.500 కోట్లు అందించాలి. కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ ద్వారా ఈ ప్రాజెక్ట్‌ను పూర్తి చేయాలి. శుద్ధమైన నీరు, పరిశుభ్రత, వేస్ట్ మేనేజ్‌మెంట్, ప్రజా రవాణా,హెల్ప్‌లైన్, ఐటీ కనెక్టివిటీలాంటి మొత్తం 18 అంశాల్లో ఈ స్మార్ట్ నగరాలు నమూనాగా ఉండాలి. మిగతా నగరాలకు ఇవి లైట్ హౌజ్‌ల్లా అభివృద్ధికి నమూనాగా ఉండేలా తీర్చిదిద్దనున్నట్లు కేంద్రం తెలిపింది.

అయితే, ఇప్పుడు ప్రధాని మోడీగానీ, కేంద్ర మంత్రులుగానీ ఈ స్మార్ట్ సిటీల గురించి మాట్లాడటం మానేశారు. మీడియాగానీ, ప్రతిపక్షాలుగానీ వీటి గురించి మాట్లాడితే అవి ప్రధాని మోడీ దృష్టిలో వ్యతిరేక వార్తలవుతాయి. ఎందుకంటే ఈ ప్రాజెక్ట్ విషయంలో కేంద్రం సాధించిన ప్రగతి చాలా స్వల్పమని చెప్పకతప్పదు. స్మార్ట్ సిటీల అభివృద్ధిలో ఎదురయ్యే ఆటంకాలను అధిగమించేందుకు స్పెషల్ పర్పస్ వెహికిల్స్(ఎస్‌పీవీ) పేరుతో నిపుణులతో పర్యవేక్షణ బృందాలను కూడా కేంద్రం ఏర్పాటు చేసింది. తాజాగా 'వడా న తోడో అభియాన్' అనే స్వచ్ఛంద సంస్థ సేకరించిన డేటాతో ఈ స్మార్ట్ సిటీస్ ప్రాజెక్ట్ లోపాలు వెల్లడయ్యాయి. ఈ ప్రాజెక్ట్ కోసం ఎంపిక చేసినవాటి నుంచి 60 నగరాలను షార్ట్ లిస్ట్ చేసి పనులు ప్రారంభించామని, మొత్తమ్మీద పురోగతి 5 శాతం మాత్రమేనని ఎస్‌పీవీలు తెలిపాయి. దీంతో, స్మార్ట్ సిటీస్ ప్రాజెక్ట్ నత్తనడకన సాగుతున్నదని స్పష్టమవుతోంది. దీనిపై రాజ్యసభలో ఓ ప్రశ్నకు సమాధానంగా ప్రభుత్వం తెలిపిన వివరాల ప్రకారం 14 శాతం నగరాల్లో పనులు ప్రారంభం కాగా, 70 శాతం నగరాల్లో పనులు ప్రగతి దశలో ఉన్నాయి. 5 శాతం నగరాల్లో ప్రాజెక్ట్ పూర్తయింది.

నగరాల అభివృద్ధికి సంబంధించి కేంద్రం ప్రకటించిన మరో పథకం అమృత్. ఈ పథకం కోసం 500 నగరాలను ఎంపిక చేశారు. అమృత్ కోసం ఎంపికైనవాటిలో కొన్ని స్మార్ట్ సిటీస్ ప్రాజెక్ట్‌లోనూ ఉన్నాయి. వీటి విషయంలోనూ ఇప్పటివరకూ కేంద్రం నుంచి 19 శాతం నిధులు మాత్రమే విడుదలయ్యాయి. తాగునీటి సరఫరాను మెరుగు పరచడం, ఘన వ్యర్థాల నిర్వహణ, హరిత వనాల అభివృద్ధి లక్ష్యాలతో అమృత్ పథకాన్ని కేంద్రం ప్రారంభించింది.

స్మార్ట్ సిటీస్ విషయంలో మౌలిక వసతుల కల్పన ప్రధానమైనది. ఇందుకు ప్రయివేట్ సంస్థల భాగస్వామ్యానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. అయితే, స్మార్ట్‌సిటీలుగా ఎంపికైన చిన్న నగరాల్లో అభివృద్ధి పనులు చేపట్టడం వల్ల తమకు ప్రయోజనం తక్కువని ప్రయివేట్ సంస్థలు వెనకడగు వేస్తున్నాయి. మెట్రో నగరాల్లో పనుల పట్ల బడా కంపెనీలు ఆసక్తి చూపడం తెలిసిందే. లాభాలు ఎక్కడ ఎక్కువగా ఉంటే అక్కడే ఆ కంపెనీలు వాలుతాయి. మరోవైపు అధికారుల అలసత్వం, ప్రభుత్వం నుంచి నిధులు సక్రమంగా అందకపోవడంలాంటివి కూడా ఈ ప్రాజెక్ట్ తగిన పురోగతి సాధించకపోవడానికి కారణాలు..

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.